ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-7-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 174 పేజీలు: 10+4 వెల: 6.50


9/11 తరహా దాడులు: అమెరికాకు ఇరాన్ హెచ్చరిక 5

ఇరాన్‌పై యుద్ధం ఆపండి: ట్రంప్‌కు సెనేట్ ఆదేశం 7

## చర్చలకు సిద్ధం

**కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ వెల్లడి**

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేస్తేనే చర్చలు: సిజెపి**

**ఉభయ సభల్లో 'నీట్' రభస**

**పార్లమెంట్ వెలుపలా అధికార, విపక్ష ఎంపిల ఆందోళన**

**న్యూఢిల్లీ, జులై 23:** పరీక్షా పత్రాల లీక్‌లు, విద్యా రంగంలో వ్యవస్థాగత సమస్యలపై కేంద్రానికి వ్యతిరేకంగా సిజెపి కార్యకర్తలు, విద్యార్థులు దేశ రాజధాని ఢిల్లీలో తమ ఆందోళనలను ఉధృతం చేశారు. గురువారం ఢిల్లీలోని టాల్‌స్టాయ్ మార్గ్, జన్‌పథ్‌లో విస్తృత నిరసనలు చేపట్టారు. జంతర్ మంతర్ వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన మరింత ఉధృతమైంది. చర్చలకు సిద్ధమని కేంద్ర మంత్రులు జెపి నడ్డా, జితేంద్ర సింగ్ పునరుద్ఘాటించారు. ఎప్పుడైనా, ఎక్కడైనా తాము చర్చలకు సిద్ధమని స్పష్టంచేశారు. "మీడియా ద్వారా ప్రభుత్వం తరఫున ఆందోళన చేస్తున్న >>2




యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది మరొకటి లేదు. పరీక్షా పత్రాల లీకేజీకి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా చూసేందుకు 'ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్ల ను ఏర్పాటు చేయాలని తాము నిర్ణయించాము. -ప్రధాని మోడీ

మన యువత భవిష్యత్తును అత్యంత తీవ్రంగా దెబ్బతీసింది మీరే. మన విద్యా వ్యవస్థను పూర్తిగా తమ గుప్పిట్లోకి తీసుకుని నాశనం చేసేలా మీరు అనుమతించారు, ప్రోత్సహించారు. - రాహుల్ గాంధీ

# పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

**ప్రధాని మోడీ హామీ.. గంటల్లోనే కార్యాచరణ**

**ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుపై కేంద్రం చర్యలు**

**కొత్త యాంటీచీటింగ్ చట్టం కింద విచారణ**

**దోషులకు ఐదేళ్లు జైలు, రూ.10 లక్షల జరిమానా**

**తొలి దశలో 4 రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు**

**న్యూఢిల్లీ, జులై 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలు పెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్2024 కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలుశిక్ష, రూ.10లక్షల జరిమానా విధించే అవకాశం >>2



ముందుగా మీరు యువత డిమాండ్లను నెరవేర్చాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి, అవినీతి వ్యవస్థను సంస్కరించాలి, విద్యార్థులందరి నుండి క్షమాపణ కోరాలి. - కాక్రోచ్ జనతా పార్టీ

## తగ్గేదేలే!

**కొనసాగుతున్న ఆందోళనలు**

**పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన ఢిల్లీ పోలీసులు**

**కాంగ్రెస్ తీరుపై వాంగ్‌చుక్ భార్య గీతాంజలి మండిపాటు**

**నేడు ఆందోళనలకు సిజెపి పిలుపు**

**విద్యార్థులకు సినీప్రముఖుల మద్దతు**

**గాంధీ స్మృతికేంద్రం వద్ద కొవ్వొత్తుల ర్యాలీలో రాహుల్ గాంధీ**

**మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీం కోర్టు ఆగ్రహం**

**మధ్యాహ్నం లోపు తెరవాలి, లేదంటే తామే రంగంలోకి దిగుతాం**

**సిజెఐ జస్టిస్ సూర్యకాంత్**

**నిరసనల్లో విద్రోహ శక్తులు**

**ఢిల్లీ పోలీసుల సంచలన పోస్టులు**

**ఎన్ఐఎ దర్యాప్తు కోరుతూ హైకోర్టులో పిటిషన్**

**బిజెపి కార్యకర్తలు రాళ్లు విసిరారు**

**సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆరోపణలు**

**జంతర్‌మంతర్ దగ్గర ఇంటర్నెట్, మొబైల్ సేవలు నిలిపివేత**

## సొంతింటి కల సాకారం




**పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే.. విష ప్రచారమా?**

**కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై23:** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ... పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30-40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం >>2

# ఓటు పోతే పథకాలు కట్?

**ప్రతి ఒక్కరూ ఓటును జాబితాలో ఉండేలా చూసుకోవాలి..**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జులై23:** ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఓట్ల ప్రక్షాళన కార్యక్రమం చాలా ముఖ్యమని తమ పార్టీ నేతలకు గట్టిగా చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్ ప్రక్రియ నాయకులది కాదు, ప్రజల ఇష్యూ అని వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పటి వరకు 70 శాతం పూర్తయిందని, మరో 30 శాతం మిగిలి ఉందన్నారు. బీఎల్‌వోలకు అనుసంధానంగా పార్టీ నేతలు, కార్యకర్తలు ఓట్లు పోకుండా చూస్తున్నారని చెప్పారు. ఎస్ఐఆర్‌పై అవగాహన రాహిత్యం వల్లే బీఎల్‌ఏలను పెట్టినట్లు చెప్పారు. బీఎల్‌ఏలు పరిశీలన చేసి ఓట్లు పోకుండా చూస్తున్నారని పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలోని మీడియా కమిటీ ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్ సందర్భంగా అనేక అంశాలపై సీఎం స్పందించారు. గతంలో కొడంగల్ కర్ణాటకలో ఉండేదని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడినప్పుడు తెలంగాణలోకి వచ్చిందని సీఎం గుర్తుచేశారు. కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకొని, తన ఓటును బదిలీ చేయించుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. తనకు రెండు ఓట్లు ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, తప్పుడు ఫిర్యాదు అయితే లోపల వేయిస్తానని హెచ్చరించారు, తెలిసి,తెలియక ఏది పడితే అది మాట్లాడుతున్నారని ఓ ప్రశ్నకు

**నాకు రెండు ఓట్లు లేవు, ఓటును బదలీ చేసుకున్నా.**

**తప్పుడు ఫిర్యాదు అని తేలితే వారిని లోపల వేయిస్తా**

**ధర్మేంద్ర రాజీనామాకు బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదు**

**మీడియా ప్రతినిధులతో సిఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్**

సమాధానంగా పేర్కొన్నారు. సర్ తెలివి తేటలు అంతా హైదరాబాద్ మీద చూపిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో అమాయకుల ఓట్లు పోతాయని. అందుకే పార్టీ కార్యకర్తలు అలెర్ట్‌గా ఉండాలని చెప్పారు. ఎస్సీ,ఎస్టీ ఓట్లు పోయాయంటే కాంగ్రెస్ ఓట్లు పోయినట్లే, ఊర్లో ఓటు లేకుంటే... తర్వాత ఆధార్ పోతదని అంటున్నారు. ఆధార్ లేనప్పుడు సంక్షేమ పథకాలు ఎట్లా వస్తాయని ప్రశ్నించారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని ప్రశ్నించిన సీఎం >>2



అసెంబ్లీ ఆవరణలో పనులను పరిశీలిస్తున్న సిఎం రేవంత్

**యూనిఫాంల నాణ్యతలో రాజీలేదు** 2

పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు: సిఎం

**కెటిఆర్ బినామీ గ్లోబరినా** 2

ఫిర్యాదు వస్తే విచారణ: సిఎం



కానిస్టేబుల్ స్వామి (ఫైల్)

## డిజిపి ఆఫీసులో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. రాత్రి విధుల్లో ఉన్న స్వామి.. గురువారం తెల్లవారు జామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన >>2

## ఎస్ఎస్‌సి పేపర్ లీక్ అయితే రేవంత్ ఎందుకు రాజీనామా చేయలేదు?



**యుపిఎ హయాంలో పేపర్లు లీక్..**

**కాంగ్రెస్ నేతలు ఎందుకు వైదొలగలేదు**

**ఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై23:** దేశరాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తో పాటు రాష్ట్రాలలో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ >>2

## సిఎం రేవంత్‌కు కెటిఆర్ లీగల్ నోటీసులు

**48 గంటల్లో క్షమాపణ చెప్పాలని డిమాండ్**




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై23:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లీగల్ నోటీసు పంపారు. గ్లోబరీనా టెక్నాలజీస్ సంస్థతో తనకు సంబంధాలు ఉన్నాయంటూ చేసిన ఆరోపణలపై 48 గంటల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పరువు నష్టం దావాతో పాటు సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతామని హెచ్చరించారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని కేటీఆర్ తన నోటీసులో పేర్కొన్నారు. గ్లోబరీనా >>2

## సిజెపికి బిఆర్ఎస్ సంఘీభావం 2

**నేడు ఇందిరాపార్కు వద్ద నిరసన**

**జన్మదిన వేడుకలకు కెటిఆర్ దూరం**

**నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్**

**కాంగ్రెస్, వామపక్ష విద్యాసంఘాల పిలుపు**

**నేడు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసిన వర్సిటీలు**




## కృష్ణా జలాలపై గంపెడాశలు!

**ఆలమట్టికి వరదపోటు**

**పక్షం రోజుల్లో 92.36 టిఎంసిలు**

**ఏ క్షణమైనా దిగువకు నీరు విడుదల**

**హైదరాబాద్,జులై 23,ప్రభాతవార్త:** ఉత్తర కర్ణాటక విజయపుర బాగల్‌కోట్ జిల్లాల సరిహద్దులో నిర్మించిన లాల్ బహద్దూర్ శాస్త్రీ సాగర్ ఆలమట్టిలోకి పక్షం రోజులుగా 92.36 టిఎంసిల వరద వచ్చి చేరడంతో ఎగువ నుంచి నీటిని విడుదల చేస్తారేమో అని తెలంగాణ రాష్ట్ర ప్రజల్లో ఆశచిగురిస్తోన్నది. పక్షం రోజుల క్రితం జులై7న ఆలమట్టి ఎల్‌బిఎస్‌సాగర్‌లో 23.04 టిఎంసిలనీరు మాత్రమే ఉండేది. ప్రస్తుతం గురువారం ఆ రిజర్వాయర్‌లో 107.92 టిఎంసిలకునీటి నిల్వలు చేరుకొన్నాయి. గత ఏడాదితో ఇదే రోజుతో పోల్చితే 5.27టిఎంసిలు ప్రస్తుతం ఇంత వర్షాభావపరిస్థితిలో కూడా ఎక్కువ వరద వచ్చి చేరడం విశేషం. నారాయణపూర్ రిజర్వాయర్ పక్షంరోజుల క్రితంవరకు 23.71 టిఎంసిల నీరు ఉండగా >>2



నవీ ముంబయిలో ఘోడ్‌బందర్ పాటలీపాడ వంతెన మీద అదుపు తప్పి బోల్తా పడిన ట్రక్కును క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం

## కానిస్టేబుల్ ఆత్మహత్య

>> సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నా భార్య పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను... స్వామి సూసైడ్ నోట్

"ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పూ చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచి వాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలాఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో"అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు. కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. బెట్టింగ్ యాప్‌లకు బానిసై, అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా, స్వామి మృతి విషయం తెలిసిన వెంటనే ఆయన కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు. కానిస్టేబుల్ మృతితోభార్య,పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈఏడాది జులై 2 నుంచి డీజీపి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ స్వామి స్వగ్రామం భువనగిరి జిల్లా చౌటుప్పల్.

## కృష్ణా జలాలపై గంపెడాశలు!

>> గురువారం ఉదయం వరకు 10.48టిఎంసిలనీటి వరద ఆ ప్రాజెక్టులోకి వచ్చింది. ప్రస్తుతం28.02టిఎంసిల నీరు రిజర్వాయర్‌లో నిలిచి ఉంది. గత ఏడాదితో పోల్చితే ఎనిమిది టిఎంసిలు ఈ రిజర్వాయర్‌లో తక్కువగా ఉన్నాయి. పోయిన ఏడాది36.67టిఎంసిలు అందులో ఉండేది. ఉజ్జనిలోలోకి 45.53టిఎంసిలు వరద రూపంలో వచ్చింది. అయితే ప్రస్తుతం అందులో 92.00టిఎంసిలనీరు ఉండగా, గత ఏడాది కంటే 12.41టిఎంసిలు తక్కువ ఉంది. ఉజ్జని రిజర్వాయర్ 114.41 టిఎంసిల గతేడాది ఉండేది. తెలంగాణలో ని ఇందిరాప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు నుంచి గత ఏడాది జులై 23 నాటికి కిందికి 108 టిఎంసిలు కిందికి వదలగా ఈ యేడాది మాత్రం ఆ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి కేవలం 4.13 టిఎంసిల నీరుమాత్రమే వరద రూపంలో వచ్చింది. గోదావరి జలాలు ఎత్తి పోసుకోవడంతో ఆంధ్రప్రదేశ్‌కు నీరు అందించే పులిచింతలలో నీటినిల్వలు29.28 టిఎంసిలతో సంతృప్తికరంగా ఉంటే తెలంగాణకు ఉపయోగపడే శ్రీశైలం,లో 41.51టిఎంసిలు (గత ఏడాది 209.16టిఎంసిలు)నాగార్జునసాగర్‌లో 137టిఎంసిలు (గతంలో 261.59 టిఎంసిలు) నీరు ఉంది. తుంగభద్రలోకి వర్షాకాలం ఆరంభంనుంచి 21.40టిఎంసిలవరద నీరు వచ్చిచేరింది. అదేవిధంగా కృష్ణడెల్టాకు 13.09 టిఎంసిలు, నాగార్జునసాగర్‌కు 19.22 టిఎంసిలు ఎగువ నుంచి వరద ఈ వర్షాకాలం ఆరంభం నుంచి వచ్చిచేరింది. గోదావరి నదిలో కూడా నీటివరదలు తగిపోయాయి. గైక్వార్డ్ జలాశయంలో గత ఏడాది 86.12టిఎంసిలు నీటినిల్వఉంటే ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో3.48 టిఎంసిల వరదనీరు మాత్రమే అందులోకి వచ్చింది. గైక్వార్డ్ ప్రాజెక్టులో49.9 టిఎంసిలనీరు మాత్రమే ఉంది. సింగూర్‌లో గత సంవత్సరం 18 టిఎంసిల నీరు ఇదే రోజు ఉండగా ప్రస్తుతం 1.42టిఎంసిల వరద మాత్రమే క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి జలాశయంలోకి వచ్చింది దీనితో సింగూర్‌లో 4.36టిఎంసిలు మాత్రమే నీటినిల్వఉంది. నిజామ్‌సాగర్‌కు ఈ వర్షాకాలంలో క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ఏమాత్రం వరద రాలేదు. అందులో 6.44 టిఎంసిల నీరు ఉంది. శ్రీరాంసాగర్ ఎగువన బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో 3.48 టిఎంసిల నీరు ఇప్పటి వరకు అటు క్యాచ్‌మెంట్‌ఏరియా ఇటు ఎగవ నుంచి వరదగా 3.22టిఎంసిలనీరు వచ్చిచేరింది. ఎస్సారెస్పీలో 15.67టిఎంసిలనీరు ఉంది. క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాభావపరిస్థితులు ఉండటంతో మిడ్‌మానేరులోకి ఎగువ నుంచి 0.20 ఎల్‌ఎండికి 0.11 కడెంకు0.55 శ్రీపాద ఎల్లంపల్లికి 2.29 టిఎంసిలు మాత్రమే వరద రూపంలో నీరు జలాశయాలకు వచ్చిచేరింది.

కడెంలో దారుణంగా నీటినిల్వలు ఉన్నాయి కనీసం ఒక్క టిఎంసి కూడా అందులో లేదు. లోయర్ మానేరు డ్యామ్‌లో 5.52 టిఎంసిలు శ్రీపాద ఎల్లంపల్లిలో 7.95 టిఎంసిలు నీరు మాత్రమే ఉంది. మేడిగడ్డకు దిగవన నీరు కిందికిపోతుండటంతో పట్టిసీమనుంచి కృష్ణాడెల్టాకు నీటిని ఎత్తిపోసుకుంటున్నారు. కృష్ణా,పెన్నా బేసిన్‌లకు నీరు ఎత్తిపోసినతరువాత కూడా గోదావరి డెల్టాకు 81.02టిఎంసిల వరదవచ్చి చేరుకొన్నది.

## ఎందుకు రాజీనామా చేయలేదు?

>> ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు. కాంగ్రెస్.. జాతీయ పార్టీ అనే విషయాన్ని మర్చిపోయి.. దేశంలోని అన్ని వ్యవస్థలను కూల్చే ప్రయత్నం చేస్తున్నది. విద్యార్థులను ఎగదోసి దేశ శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో ఎన్ని రకాల ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయో తెలుసుకోండి. అప్పుడు ఎంతమంది మంత్రులు రాజీనామా చేశారో సమాధానం చెప్పాలి. ప్రతిపక్షాలకు రాజకీయాలు, అధికారమే తప్ప విద్యార్థుల భవిష్యత్తు, దేశ భద్రత అవసరం లేదు. వారికి అధికారం రాకపోతే ఏ వ్యవస్థనైనా కూల్చేస్తామన్నట్టు ప్రవర్తిస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు, మమతా బెనర్జీ సీఎంగా ఉన్నప్పుడు పశ్చిమబెంగాల్ లో పేపర్లు లీకయ్యాయి. వారి హయాంలో ఒకలా.. బీజేపీ హయాంలో ఒకలా వ్యవహరిస్తున్నారని తప్పుపట్టారు. 2025లో పదో తరగతి పరీక్ష పత్రం లీక్ అయినప్పుడు విద్యాశాఖ మంత్రిగా రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు. టీచర్లను సస్పెండ్ చేశారు. అంతే కానీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై సమాధానం చెప్పిన తర్వాతే రేవంత్ రెడ్డి నీట్ పేపర్ పై బీజేపీ కార్యకర్తలను అరెస్టు చేయాలి. అప్పుడే మీరు ప్రశ్నించాలి అని పేర్కొన్నారు. 2026లో జయశంకర్ వ్యవసాయ వర్సిటీ, జగిత్యాలలో బీఎస్సీ పేపర్ లీక్ అయింది. అప్పుడు మీ కాంగ్రెస్ మంత్రులతో రాజీనామా చేయించారా? అని ప్రశ్నించారు. సభలో ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించాల్సింది పోయి లేనిపోని రాజకీయాలు చేస్తున్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు ఎన్నిసార్లు లీక్ అయ్యాయి.. వాటిపై కెటిఆర్ సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

## కెటిఆర్ బినామీ గ్లోబరినా
### ఫిర్యాదు వస్తే విచారణ: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, జులై23:** గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ అని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. గ్లోబరీనా విషయంలో కేటీఆర్ నిజాయితీ నిరూపించుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇంటర్ పేపర్లు సరిగా దిద్దకపోవడం వల్లే 27 మంది విద్యార్థులు చనిపోయారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆ కంపెనీపై కేసు పెట్టాల్సిందిపోయి వదిలేశారని,ఇప్పుడు పేరు మార్చుకుని కంపెనీ పెట్టారని పేర్కొన్నారు. సిబిఎస్ఈ పేపర్ కూడా ఆ కంపెనీ చేసిన పేపర్ లీక్ అయ్యిందని, వీటి ఆదర్శంగా కుంభకోణం జరిగిందని, ఆ గొప్పతనమంతా కేటీఆర్‌దే అని చెప్పారు. విద్యార్థుల మరణానికి కారణమైన కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, అమరవీరుల స్థూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. కెటిఆర్‌కు గ్లోబరినకి సంబంధం లేదంటున్నాడు, జన్‌వాడ భూములు కెటిఆర్‌కి ఏ రాజుల నుంచి భూములు వచ్చాయన్నారు. గ్లోబరిన మీద సిసిఎస్‌లో కెటిఆర్ ఫిర్యాదు చేయాలి, గ్లోబరిన ఎలా వచ్చింది అనేది విచారణ చేయిస్తానన్నారు.

నేను సొంతంగా విచారణ చేయిస్తే కక్ష సాధింపు అంటారు,అందుకే కెటిఆర్ ఫిర్యాదు చేస్తే మేము చేయిస్తామంటున్నారు. ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతుందని, నివేదిక వచ్చాక చెప్తానని ఓ ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఫాస్ట్ ట్రాక్‌పై నమ్మకం రావాలి అంటే కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి అని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీలో పిల్లలు దెబ్బతింటు ఉంటే ఇప్పటి వరకు బిఆర్ఎస్ ఎందుకు బయటకు రాలేదు.

ఏందీ బిఆర్ఎస్ కుమ్మక్కు అని ప్రశ్నించారు. మేము తెరిచిన ధర్నా చౌక్‌లో బిఆర్ఎస్ ధర్నా చేస్తామంటున్నారు. కెటిఆర్ వద్దనుకున్న ధర్నా చౌక్‌లో ఆయనే ధర్నాకు వెళ్తున్నాడు అంటే మేము ఓపెన్ చేసిందే కదా అన్నారు. నిరసన శాంతియుతంగా చేస్తే ఇబ్బంది లేదు అని పేర్కొన్నారు. ధర్నా చౌక్‌తో పాటు ప్రజా భవన్ ఓపెన్ చేశాం అని గుర్తు చేశారు.

### వారం - వర్జ్యం

24-07-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
దశమి ఉ.9.13, అనూరాధ తె.4.36
వర్జ్యం : ఉ.6.12-ఉ.8.00
దు.ఉ.8.20-ఉ.9.12, 2)మ.12.39-మ.1.31
శుభసమయం : ఉ.5.00-6.00
రాహుకాలం - ఉ.10.30-12.00

### వార్తాఫలం

**మేషం:** పారిశ్రామిక రంగాలలో వారికి పదువులు, హోదాలు లభిస్తాయి. సాంకేతిక విద్యలపై ఆసక్తి చూపుతారు.

**వృషభం:** కుటుంబ సమస్యలు తీరి ఊరట చెందుతారు. రెండు, మూడు విధాలుగా ధన లాభం పొందుతారు. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**మిథునం:** క్రీడారంగం యందు ఆసక్తి కలిగివుంటారు. మొండిబాకీలు రాబట్టు కోవడానికి కొత్తగా మార్గాలు అవలంభిస్తారు.

**కర్కాటకం:** పురోభివృద్ధిలో స్వల్ప మందగమనం ఏర్పడిందని గుర్తించి కొత్త వ్యూహాలను అనుసరిస్తారు. ఆ దిశగా కొంత పురోభివృద్ధి సాధిస్తారు.

**సింహం:** నూతనవ్యక్తులు పరిచయమై మాట సహాయసహకారాలు అందిస్తారు. అప్రయత్నంగా కలిసివస్తాయి. ఉద్యోగాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** క్రయవిక్రయాలు, దూరప్రాంత ప్రయాణాలు, పెట్టుబడులు కొంతకాలం వాయిదావేయటం అన్నివిధాలా మంచిది.

**తుల:** స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరుకుంటాయి. రాజకీయ రంగాలలోని వారు విదేశీ పర్యటనలు పొందుతారు.

**వృశ్చికం:** సేవకా సిబ్బంది వలన, సహోద్యోగుల వలన నష్టములు వాటిల్లవచ్చు, తగు జాగ్రత్తలు పాటించండి.

**ధనుస్సు:** సంతానం గురించి అధికంగా ఆలోచిస్తారు. వారి పురోభివృద్ధికి కావలసిన వనరులను సమకూరుస్తారు.

**మకరం:** దూరప్రాంతాలలోని ఆత్మీయుల నుండి ఆనందాయకమైన సమాచారం అందుకుంటారు. వస్తువులు కొనుగోలు చేస్తారు.

**కుంభం:** వ్యవహారాల తాలూకు చికాకులను ఇంట్లో ప్రదర్శిస్తారు. ఇది లాభించే అంశం కాదు. కనుక తగుజాగ్రత్తగా ఉండండి.

**మీనం:** ప్రతి చిన్నవిషయానికి శ్రమించి చివరకు పూర్తిచేస్తారు. క్రయవిక్రయాలలో మెలుకువ అవసరం. ఆరోగ్యం జాగ్రత్త.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సిజెపికి బిఆర్ఎస్ సంఘీభావం

### నేడు ఇందిరాపార్కు వద్ద నిరసన
### జన్మదిన వేడుకలకు కెటిఆర్ దూరం
### నేడు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

**హైదరాబాద్, జులై23:** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై జరిగిన అణచివేత, దాడుల నేపథ్యంలో తన జన్మదినం నాడు ఎలాంటి వేడుకలు లేకుండా సాధారణంగా గడపాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు నిర్ణయించుకున్నారు. ఢిల్లీలో విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటానికి సంఘీభావం తెలుపుతూ, వారిపై జరిగిన దాడులను నిరసిస్తూ శుక్రవారం బీఆర్ఎస్ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) ధర్నా చౌక్‌లో నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొననున్నట్లు కేటీఆర్ తెలిపారు.

దీంతోపాటు రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవక రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితులు, అటు రాష్ట్రంలోనూ దేశవ్యాప్తంగా ఒక గంభీరమైన వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తన 50వ జన్మదినాన్ని సెలబ్రేట్ చేసుకోకూడదని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే, తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు కేక్ కటింగ్‌లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు, పూల బొకేలు, పత్రికా ప్రకటనలు వంటి వాటిపై అనవసరంగా ఖర్చు చేయవద్దని పార్టీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ఆ ఖర్చులను తమకు చేతనైన మేరకు సేవా కార్యక్రమాలకు వినియోగించాలని, ఆపదలో ఉన్నవారికి, అవసరమైన వారికి సాయం అందేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల ద్వారానే తన జన్మదినాన్ని అర్థవంతంగా నిర్వహించాలని కేటీఆర్ కోరారు.

**నేడు విద్యాసంస్థల బంద్**

నీట్ పేపర్ లీకేజీలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక (ఎఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర కమిటీలతోపాటు ఎన్ఎస్‌యుఐ నేడు(శుక్రవారం) రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజలు సహకరించాలని విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలకు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు దాడులపై స్వతంత్ర, సమగ్ర, పారదర్శక విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యను కేంద్రీకరించే విధానాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని, విద్యా వ్యవస్థ స్వయం ప్రతిపత్తికి భంగం కలిగించే విబిఎస్ఏ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌యుఐ) తెలంగాణ రాష్ట్ర విభాగం కూడా శుక్రవారం రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది. జాతీయ ప్రవేశ పరీక్షల్లో జరుగుతున్న వరుస అక్రమాలు, వ్యవస్థాగత వైఫల్యాలు, శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యానికి నిరసనగా "విద్యను రక్షించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి, విద్యార్థుల హక్కులను పరిరక్షించండి" అనే ప్రధాన నినాదంతో ఈ బంద్‌కు పిలుపునివ్వడం జరిగింది. జాతీయ పరీక్షల నిర్వహణలో వైఫల్యం, కుంభకోణాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ని తక్షణమే రద్దు చేయాలని, ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన ఘోరమైన లాఠీఛార్జికి బాధ్యులైన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రాథమిక ప్రజాస్వామ్యహక్కులను, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును పరిరక్షించాలన్నారు. "విద్య అనేది ప్రతిఒక్కరి ప్రాథమిక హక్కు, అని అదికొందరికే పరిమితమైన హక్కు కాదన్నారు.

**పరీక్షలను వాయిదా వేసిన యూనివర్సిటీలు**

తెలంగాణ రాష్ట్రంలో నేడు(శుక్రవారం) జరగాల్సిన అన్నిరకాల పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు యూనివర్సిటీలు ప్రకటించాయి. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో నేడు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు ఉస్మానియా యూనివర్సిటీ, జవహార్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(జేఎన్‌టియు) హైదరాబాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపాయి. వాయిదా వేసిన పరీక్షలను తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారనేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. నీట్ పేపర్ లీకేజీలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక (ఎఐఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యు) తెలంగాణ రాష్ట్ర కమిటీలతోపాటు ఎన్ఎస్‌యుఐ నేడు(శుక్రవారం) రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. విద్యార్థి సంఘాల బంద్ పిలుపు మేరకు యూనివర్సిటీలు నేడు జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశాయి.



న్యూఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతలను కాపాడేందుకు సంసద్ మార్గ్‌లో పోలీసుల బందోబస్తు

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం

>> ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కోల్‌కతా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న 4కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యుపిఎస్‌సి, ఎస్ఎస్‌సి, ఆర్ఆర్‌బి, ఐబిపిఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి.

## చర్చలకు సిద్ధం

>> విద్యార్థులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. చర్చలు జరపడానికి మేము సిద్ధంగా ఉన్నాం. ప్రభుత్వం తలుపులు తెరిచే ఉన్నాయి. యువతకు ఇది ఒక ఆహ్వానం. ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. ఆందోళనకు సంబంధించిన విషయాలతో పాటు, ఇతర అంశాలపై కూడా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని తెలిపారు. "చర్చలకు ఎంత సమయం అవసరమైతే అంత సమయం కేటాయించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. చర్చల్లో వైద్యారోగ్య శాఖ మంత్రి జెపి నడ్డాతో పాటు నేను కూడా పాల్గొంటా. ఈ చర్చల ద్వారా మనం పరిష్కారం దిశగా అడుగులు వేయవచ్చు. మీరు ఎక్కడ కోరితే అక్కడ చర్చలకు సిద్ధం. నడ్డా నివాసం లేదా ఆయన కార్యాలయంలోనైనా చర్చలు జరపవచ్చు. ఈ విషయంలో మాకు ఎటువంటి పట్టింపులు లేవు. అత్యంత వినయంతో నేను మిమ్మల్ని కోరుతున్నాను రండి, కూర్చోండి, చర్చించండి. ఈ సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు అందరం కలిసి ఒక ప్రయత్నం చేద్దాం" అని జితేంద్రం సింగ్ తెలిపారు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌పై సిజెపి నాయకత్వం పట్టుతోఉంది. తాము నిరసనలను ముగించాలంటే కేంద్ర ప్రభుత్వం మూడు డిమాండ్లను నెరవేర్చాలని సిజెపి ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. "మొదటిది కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. రెండోది నీట్ పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థులందరి కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం అందించాలి. మూడోది శాంతియుతంగా నిరసన చేసినవారిపై అనవసరంగా నమోదు చేసిన అన్ని ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించుకోవాలి. భవిష్యత్తులో ఈ నిరసనకు సంబంధించి ఎవరిపైనా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బేరసారాలు ఉండవు. మా డిమాండ్లు నెరవేరే వరకు నిరసనలు కొనసాగుతాయి. ఆస్పత్రిలో ఉన్నప్పటికీ నిరాహార దీక్షను కొనసాగిస్తున్న సోనమ్ వాంగ్‌చుక్‌తో మాట్లాడాం. నిరసనలను శాంతియుతంగా చేపట్టాలని తాము నిర్ణయించుకున్నాం అని సౌరవ్ దాస్ తెలిపారు. అలాగే పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. ఈ ప్రదర్శనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ పాల్గొన్నారు. పార్లమెంట్ ప్రాంగణంలోని మకర్ ద్వార్ వద్ద అధికార ఎన్‌డియే, ప్రతిపక్ష ఇండియా కూటములకు చెందిన ఎంపిలు పోటాపోటీగా ఆందోళన చేశారు. ఉభయ సభలకు చెందిన ఇరు వర్గాల సభ్యులు ఒకేచోట ఏకకాలంలో నిరసన చేపట్టారు. తమ తమ డిమాండ్లను వినిపిస్తూ నేతలు ప్లకార్డులు పట్టుకుని, నినాదాలు చేస్తూ నిరసనలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, గురువారం సాయంత్రంలో గాంధీ స్మృతి కేంద్రం వద్ద లోక్‌సభలో ప్రతినేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేశారు. ఇందులో భాగంగా జులై 24వ తేదీ శుక్రవారం దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది.

## యూనిఫాంల నాణ్యతలో రాజీలేదు
### యూనిఫాం సరఫరాపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై23:** యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజు ఇతర అంశాలపై ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్ బ్యాక్) తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు ఇచ్చే ఫీడ్ బ్యాక్ ఆధారంగా వచ్చే ఏడాది పంపిణీ, వాటి రంగులు ఇతర అంశాలపై నిర్ణయం తీసుకుంటామని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు యూనిఫాంల అందజేతపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల నాణ్యతలో రాజీపడమని సీఎం తెలిపారు. ఆగస్టు 15వ తేదీ నాటికి పిల్లలందరికీ యూనిఫాం అందజేయాల్సినదేనని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అలసత్వం వహిస్తే సహించనని సీఎం హెచ్చరించారు. మహిళా సంఘాలు కుట్టు పని వేగవంతం చేసేలా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సెర్ప్ సీఈవో దివ్యకు సీఎం సూచించారు. పేద పిల్లల కోసం పని చేస్తున్నామని అంశాన్ని దృష్టిలో ఉంచుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు బాల మాయా దేవి, షఫీ ఉల్లా, విజయేంద్ర బోయి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

**అసెంబ్లీ భవనలో మరమ్మతు పనులను పరిశీలించిన సిఎం రేవంత్‌రెడ్డి**

చారిత్రక ప్రాధాన్యం కలిగిన తెలంగాణ శాసనసభ భవనంలో జరుగుతున్న మరమ్మతు, పునరుద్ధరణ పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రాంగణమంతా తిరిగి పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పలు సూచనలు చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి అడ్లూరి, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ తదితరులు హాజరయ్యారు.

## ఓటు పోతే పథకాలు కట్?

>> రేవంత్‌రెడ్డి, ప్రక్షాళన పేరుతో కొన్ని ఓట్లను తొలగించే అవకాశం కూడా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. గతంలో జీహెచ్ఎంసీ పరిధిలో ఆంధ్ర వాళ్ల ఓట్లన్నీ తొలగించినట్లు చెప్పిన రేవంత్‌రెడ్డి, దీనిపై కాంగ్రెస్ కోర్టుకెళితే నాటి జీహెచ్ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు గుర్తుచేశారు. జిహెచ్ఎంసి కమిషనర్‌గా సోమేశ్‌కుమార్ ఉన్నప్పుడు 28లక్షల ఆంధ్రా ఓటర్ల పేర్లు తొలగించారు. అప్పుడు శశిధర్‌రెడ్డి కొట్లాడితే 15లక్షల ఓట్లు తిరిగి వచ్చాయని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చే ఇళ్లను దళారులకు అమ్ముకుందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. డబుల్ బెడ్ రూంలు బ్రోకర్లకు అమ్ముకున్నారని, దందాలు చేశారు కాబట్టి జనం దవడ పగలగొట్టి బయటక పంపించారని ఎద్దేవా చేశారు. మేము స్థానికంగా ఇండ్లు ఇవ్వాలనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టామని, వాళ్ల లెక్క ఊరు బయటకు పంపండం లేదని బిఆర్ఎస్‌ను విమర్శించారు. 2023 నుంచి ఇప్పటి వరకు జరిగిన ఉద్యోగ నియామకాలపై అసెంబ్లీలో ప్రశ్న వేస్తే పేర్లతో సహా జాబితా విడుదల చేస్తానన్నారు. పేపర్లు అమ్ముకుని పరీక్షలు పెట్టింది బిఆర్ఎస్ కాదా, పదేళ్ల పట్టిందా నీకు నోటిఫికేషన్ ఇవ్వడానికి అని ప్రశ్నించారు. రాజధాని నగరంలో హైడ్రా బాగా పని చేస్తోందని సీఎం కితాబిచ్చారు. అనేక ప్రాంతాల్లో ఆస్తులకు రక్షణ కల్పించిందని చెప్పారు. నగరంలో తాగు నీటి సమస్య లేదని, ట్యాంకర్ల సమస్య ఉండొచ్చని చెప్పారు. భూగర్భంలో నీళ్లు పెరగాలి అంటే చెరువులు ఉండాలి కదా అని పేర్కొన్నారు. తెలంగాణలో లక్ష కోట్లు పెట్టుబడులు పెడితే వాళ్ల పేర్లను ఆయా రోడ్లకు పెడతామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో అమెరికన్ కార్యాలయం వద్ద వీదికి ట్రంప్ పేరు పెట్టడానికి కారణాలను తెలిపారు. బీజేపీ నేతల మధ్య అంతర్గత కొట్లాటలు ఉన్నాయని రేవంత్ రెడ్డి విమర్శించారు.

## సిఎం రేవంత్‌కు కెటిఆర్ లీగల్ నోటీసులు

>> సంస్థలో తనకు ఎటువంటి ఆర్థిక ప్రయోజనాలు, యాజమాన్య హక్కులు లేదా బినామీ ప్రయోజనాలు లేవని ఆయన స్పష్టం చేశారు. సదరు సంస్థ తన బినామీ అని, సీబీఎస్ఈ కాంట్రాక్టులు ఇప్పించానని చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి, రాజకీయ ప్రత్యర్థిపై ఇటువంటి నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని కేటీఆర్ పేర్కొన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే రాజకీయ దురుద్దేశంతోనే రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు.

## సొంతింటి కల సాకారం

>> చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంట. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం అని మండిపడ్డారు. లబ్ధిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్ధిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఫ్లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంది. ఎస్ఆర్‌వో (బేసిక్) విలువ రూ.14.6 లక్షల నుంచి రూ.28.4 లక్షల వరకు ఉంది. దీంతో ప్రభుత్వం అందించే సబ్సిడీ, భూమి విలువ మరియు నిర్మాణ వ్యయాన్ని కలిపి పేదలకు అత్యంత తక్కువ ధరలో గృహాలను అందించే అవకాశం కల్పిస్తోందని వివరించారు. లబ్ధిదారుడికి ప్రభుత్వం రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఇల్లు సమకూరుస్తుంది. ఇందులో లబ్ధిదారుడు వాటా కేవలం ఆరు లక్షల రూపాయలు మాత్రమేనని చెప్పారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బిసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం, ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నామని తెలిపారు.

## అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రీమియం ఎయిర్‌పోర్ట్ టాక్సీ సేవలు ప్రారంభం

**శంషాబాద్, జులై 23, ప్రభాతవార్త:** శంషాబాద్ అంతర్జాతీయ విమా నాశ్రయం ప్రయాణికులకు సురక్షితమైన, విశ్వసనీయమైన మరియు అంతరాయం లేని చివరి మైలు (లాస్ట్ మైల్) కనెక్టివిటీని అందించేందుకు ప్రత్యేక ప్రీమియం ఎయిర్‌పోర్ట్ టాక్సీ సేవలను ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సేవలు సంవత్సరంలోని అన్ని రోజులు, 24 గంటలూ (24/7) అందుబాటులో ఉంటాయి. రద్దీ సమయాలు, సెలవు దినాలు సహా అన్ని ప్రయాణ షెడ్యూళ్లకు అనుగుణంగా ప్రయాణికులకు నిరంతర రవాణా సౌకర్యాన్ని అందించనున్నాయి. 200కు పైగా సెడాన్‌లు మరియు ఎస్‌యూవీలు కలిగిన ప్రత్యేక వాహనాల సమూహంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఈ వాహనాలు పూర్తిగా విమానాశ్రయ కార్యకలాపాల కోసమే కేటాయించబడటం వల్ల సేవల్లో స్థిరత్వం, విశ్వసనీయత మరియు నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈఓ కదిర్ కదిరవన్ మాట్లాడుతూ, 'జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించడం మా కార్యకలాపాల ప్రధాన లక్ష్యం' అని అన్నారు.

## పేద విద్యార్థిని ఉన్నత చదువులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థిక భరోసా

### జర్మనీ వర్సిటీలో విద్యాభ్యాసానికి రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేత

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** నిరుపేద విద్యార్థిని కలలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అండగా నిలిచారు. రెక్కాడితే డొక్కాడని దినసరి కూలీ కూతు రుకు విదేశాల్లో ఉన్నత చదువులు చదువు కొనేందుకు తోడ్పాటు అందించడమే కాకుండా ఆమెలోని విజ్ఞానకాంతులు విశ్వ ప్రపంచానికి పరిచయం చేయడానికి తన వంతు చేయుత మంత్రి అందించారు. దేవరకొండకు చెందిన పరిమళ అనే ఓ నిరుపేద రోజువారీ కూలీల కుటుంబానికి చెందిన విద్యార్థిని చిన్నతనం నుంచి చదువుల్లో ప్రతిభను ప్రదర్శిస్తూ వస్తోంది. ఐఐటీ మద్రాస్‌లో ఉన్నత విద్యను పూర్తి చేసిన ఆమె, జర్మనీలో మాస్టర్స్ చదివేందుకు ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో సీటు సాధించింది. అయితే, కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె కలలు నెరవేరుతాయా లేదా అనే సందిగ్ధ పరిస్థితి నెలకొంది. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే బాలునాయక్ దృష్టికి రావడంతో, ఆయన ఆ విద్యార్థిని కుటుంబ సభ్యులను పిలిపించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, వారిని మంత్రిని కలిసేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థిని సాధించిన విజయాన్ని, ఆమె ఉన్నత చదువుల పట్ల ఉన్న అంకితభావాన్ని తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆపద్బాంధవుడిలా స్పందించారు. పేదరికం కారణంగా ప్రతిభ మరుగున పడకూడదనే ఉద్దేశంతో 'కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్' ద్వారా వెంటనే రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి, ఆమె విదేశీ ఉన్నత విద్యకు అండగా నిలిచారు.



పరిమళ

ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 'ప్రతిభకు పేదరికం ఎప్పుడూ అడ్డుకాదు. అవకాశం కల్పిస్తే నిరుపేద విద్యార్థులు ప్రపంచ వేదికపై తమ సత్తా చాటగలరు. పేద విద్యార్థుల కలలను సాకారం చేయడంలో, వారి ఉన్నత విద్యకు భరోసాగా నిలవడంలో తాను ఎల్లప్పుడూ ముందుంటాను' అని పేర్కొన్నారు. జర్మనీలో ఉన్నత విద్యను అభ్యసించబోతున్న ఆ విద్యార్థిని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి, దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు.

## రైలులో కవలలకు జన్మనిచ్చిన యుపి మహిళ

### మానుకోటలో రైలు ఆపి ఆసుపత్రిలో చేర్పించిన అధికారులు

### చికిత్స పొందుతూ మరణించిన కవలలు

**మహబూబాబాద్ ప్రతినిధి, ప్రభాతవార్త:** రైలులో ప్రయాణిస్తున్న ఒ గర్భిణి మహిళ రైలుపెట్టెలోనే ప్రసవించి ఇద్దరు కవలలకు జన్మనివ్వగా వారు పురిటిలోనే మరణించగా విషాదం నెలకొంది. వివరాల్లోకి వెళితే ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నో ప్రాంతానికి చెందిన మహ్మద్ ఖలీద్ ఖాన్, సాలేహా దంపతులు జీవనోపాది కోసం కేరళ రాష్ట్రంలోని పాలక్కాడ్‌లో ఒ బేకరిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో సాలేహా ఎనిమిది నెలల గర్భవతిగా ఉన్న సమయంలో ప్రసవం కోసం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తున్న క్రమంలో ఖమ్మం దాటిన తర్వాత ఆకస్మాత్తుగా పురటి నొప్పులు రావడంతో రైలులో ఉన్న మహిళలు ప్రసవం చేయగా ఇద్దరు కవలలకు జన్మనిచ్చింది. రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వగా మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలును నిలిపి స్థానిక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు కవలలు మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మహబూబాబాద్ పట్టణంలోని అల్ అన్సార్ యూత్, కంకరబోర్డ్ యూత్ ఆధ్వర్యంలో మృతదేహాలకు ము స్లిం సాంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో కుటుంబసభ్యులతోపాటు పట్టణ ప్రజలు వారిని అభినందించారు.

# కార్పొరేట్‌కు ధీటుగా గురుకులాలు

### విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

### సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గురుకులాలు కార్పొరేట్ స్కూల్స్‌కి ధీటుగా ఉన్నాయని, పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటను వేస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పేద విద్యార్థులు కూడా కార్పొరేట్ స్థాయి విద్య, వసతులు పొందాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, పోషకాహారంలో దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణమే ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యమని, వారి అభ్యున్నతికి అవసరమైన ప్రతి చర్యను ప్రభుత్వం చేపడుతోందన్నారు. గురువారం హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌ను మంత్రి స్వయంగా సందర్శించారు. కొత్తగా చేరిన విద్యార్థులకు 11 రకాల వస్తువులతో కూడిన వెల్‌కమ్ కిట్లను పంపిణీ చేశారు. కిట్‌లో ప్లేట్, గ్లాస్, కటోరా, కప్పు, స్పూన్, బెడ్‌షీట్, టవల్, బ్లాంకెట్, బ్లాక్ అండ్ వైట్ షూస్, సాక్స్, స్కూల్ బ్యాగ్ తదితర వస్తువులున్నాయి. జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన ఏ సౌకర్యాల విషయంలో రాజీ ఉండదని, పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపామని చెప్పారు. సంక్షేమ హాస్టళ్లలో డైట్ చార్జీలను గణనీయంగా పెంచడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందుతోందని తెలిపారు. ఆరోగ్యవంతమైన విద్యార్థులే విద్యలోనూ, క్రీడల్లోనూ అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు. గురుకుల విద్యార్థులు ఇప్పటికే ఎప్‌సెట్, నీట్, జేఈఈ, సీఏ, సివిల్స్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో విజయాలు సాధిస్తూ తెలంగాణకు గుర్తింపు తీసుకొస్తున్నారని చెప్పారు.

అదే స్ఫూర్తితో విక్టోరియా మెమోరియల్ విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. గురుకులాల్లో అత్యుత్తమ విద్య అందించేందుకు అవసరమైన అధ్యాపక నియామకాలు, ఆధునిక తరగతి గదులు, డిజిటల్ లెర్నింగ్, ప్రయోగశాలలు, గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన నిధులను విడుదల చేసి అభివృద్ధి పనుల వేగం పెంచామన్నారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా ప్రత్యేక అకడమిక్ కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ గురుకులాల్లో చదివే ప్రతి విద్యార్థి ఆత్మవిశ్వాసంతో దేశానికి ఆదర్శంగా నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి అడ్లూరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సిడిడి కార్యదర్శి విజయేంద్ర బోయి, విక్టోరియా మెమోరియల్ విద్యాసంస్థ కార్యదర్శి సల్మాబాను, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మీపార్వతి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులు బహుళ రంగాల్లో నైపుణ్యం సాధించాలి

### అప్‌డేట్ అవ్వండి.. లేకపోతే ఔట్‌డేట్ అవుతారు

### ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** అత్యంత వేగంగా మారుతున్న సాంకేతిక ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం తమను తాము అప్‌డేట్ చేసుకుంటూ, బహుళ రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి పిలుపునిచ్చారు. శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ఉద్యానవన కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన "ఉద్యాన విద్య-ఉన్నత విద్యలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు" అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం, సమయపాలన విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చే ప్రధాన లక్షణాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, ప్రధానంగా కృత్రిమ మేధస్సు(ఏఐ)ని సమర్థవంతంగా వినియోగించు కుని తమ లక్ష్యాలను సాధించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు వస్తున్న నూతన సాంకేతిక పరిణామాలను తెలుసుకుంటూ, తమ విజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకోవాలని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాల న్నారు. నేడు ప్రతి రంగంలోనూ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందని, దానిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు తమ సామర్థ్యాలను, ఉపాధి అవకాశాలను మరింత విస్తరించుకోవచ్చన్నారు. ఆవిష్కరణలు, వ్యవస్థాపకత (ఎంటర్‌ప్రెన్యూర్ షిప్) ప్రాధాన్యతను వివరించిన ఆయన, సాంకేతికతతో పాటు కృత్రిమ మేధస్సును సమర్థంగా వినియోగిస్తూ స్టార్టప్‌ల స్థాపనకు అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు, ప్రాయోగిక అనుభవాన్ని విద్యార్థులు సంపాదించుకోవాలని సూచించారు. ఉద్యాన, వ్యవసాయ రంగాలతో పాటు విమానయానం, అంతరిక్ష సాంకేతికత, ఆధునిక సాంకేతిక రంగాలు, కృత్రిమ మేధస్సు వంటి విభాగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునేందుకు సిద్ధంగా ఉండాలని బాలకిష్టారెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వ్యవస్థాపకులుగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యాన విద్యను పూర్తిచేసిన అనంతరం స్టార్టప్‌లను స్థాపించి, ఆవిష్కరణల ద్వారా సమాజానికి సేవలందించే దిశగా ముందుకు సాగాలని సూచించారు.

క్రమశిక్షణ, పట్టుదల, సమయపాలన విజయానికి మూల సూత్రాలని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ దండా రాజిరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి. ప్రశాంత్, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు

# వైఆర్‌పి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 187 మందికి రూ.74లక్షల స్కాలర్‌షిప్‌లు

**హైదరాబాద్, జులై 23,ప్రభాతవార్త:** 2026-27 విద్యా సంవత్సరంలో అర్హులైన 187 మంది విద్యార్థులకు రూ.74 లక్షల విలువైన అవార్డుల స్కాలర్‌షిప్‌లు వైఆర్‌పి ఫౌండేషన్ అంద జేసిందని 2022 నుండి 680 మంది విద్యార్థులకు విద్యాసహాయం అందించబడు తోందని వైష్ణోయ్ గ్రూప్,వైఆర్‌పిఫౌండేషన్ వ్యవస్థాపకుడు చైర్మన్ యెలిశాల రవి ప్రసాద్ తెలిపారు. గురువారం వైష్ణవోయి గ్రూప్ కార్పొరేట్ కార్యాలయంలో వార్షిక స్కాలర్‌షిప్ పంపిణీ వేడుకను నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్, గౌరవ అతిథులుగా డాక్టర్ రిటైర్డు ఐ పిఎస్ జె. పూర్ణచంద్రరావు, రిటైర్డు ఐఎఎస్ ఎం. జగదీశ్వర్ హాజరయ్యారు. ప్రభావవంతమైన కమ్యూనిటీ కార్యక్రమాల ద్వారా విద్య, సాంఘిక సంక్షేమం దేశ నిర్మాణాన్ని ప్రోత్సహించడంలో వైఆర్‌పి ఫౌండేషన్ యొక్క నిరంతర ప్రయత్నాలను ప్రముఖులు అభినందించారు. యెలిశాల రవి ప్రసాద్ మాట్లాడుతూ."సమాజం సమిష్టి గొప్ప పెట్టుబడి విద్యఅని . అర్హులైన ప్రతి విద్యార్థికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా తన కలలను సాకారం చేసుకునే అవకాశం ఉండాలనీ ఈ స్కాలర్‌షిప్‌లను అందించడంతో మా బాధ్యత అని అన్నారు. చదువుకొనేవారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆశను




పెంపొందించడంఅవకాశాలను సృష్టించడంతో ప్రారంభమవుతుంది. విద్య ద్వారా జీవితాలను మార్చడం గత నాలుగు సంవత్సరాలుగా, ఫౌండేషన్ తెలంగాణ అంతటా 680 మందికి పైగా అర్హులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు విద్యా సహాయం ద్వారా మద్దతు ఇచ్చిందనీ తెలిపారు. ఆర్థిక పరిమితులు లేకుండా ఉన్నత విద్యను అభ్యసించడానికి వీలు కల్పిస్తుంది. ఫౌండేషన్ దాని లబ్ధిదారుల విజయాల పట్ల అపారంగా గర్విస్తుందనీతెలపిఆరు. వైఆర్‌పి ఫౌండేషన్ నుండి ఆర్థిక సహాయం పొందిన విద్యార్థులు వైద్యులు, ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, చార్టర్డ్ అకౌంటెంట్‌లు, సాఫ్ట్‌వేర్ నిపుణులు మరియు వ్యవస్థాపకులుగా విజయవంతమైన కెరీర్‌లను మొదలుపెట్టారని చెప్పారు. చాలామంది మొదటి తరం గ్రాడ్యుయేట్లు, వారు తమ స్వంత జీవితాలను మాత్రమే కాకుండా వారి కుటుంబాలను కూడా మార్చారు, భవిష్యత్ తరాలకు రోల్ మోడల్‌లుగా మారారని తెలిపారు.



## బాలయోగి స్టేడియంలో ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్ క్రీడా పోటీలు

### ప్రారంభించిన కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** 2030లో కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇవ్వడానికి భారత్ సిద్ధమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. 2036 నాటికి ప్రపంచంలోని టాప్10 క్రీడా దేశాల జాబితాలో భారత్ ఉండేలా నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోందన్నారు. సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో 11వ ఆలిండియా పోలీస్ జూడో క్లస్టర్ క్రీడా పోటీలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వచ్చిన 36 జట్లకు చెందిన 1,600 మందికి పైగా క్రీడాకారులు, అధికారులు ఒకే వేదికపై పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ ఏడీజీ సౌత్ పద్మాకర్ ఎస్.రాన్సిపే, నిసా డైరెక్టర్, ఐజీ హర్ప్రీత్ కౌర్ సోహి, ఎస్.ఆర్. శరవణన్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



పూర్తి అయిన కాజీపేట-బల్హార్షా ట్రిప్లింగ్ ప్రాజెక్టు

## కాజీపేట-బల్హార్షా ట్రిప్లింగ్ ప్రాజెక్టును పూర్తి చేసిన దక్షిణ మధ్య రైల్వే

### ఉత్తర-దక్షిణ రైలు రాకపోకలకు మరింత ఊతం

**హైదరాబాద్ (తార్నాక), జులై 23, ప్రభాతవార్త:** దేశంలోని అత్యంత రద్దీ రైలు మార్గాల్లో ఒకటైన కాజీపేట-బల్హార్షా రైల్వే మార్గంలో ట్రిప్లింగ్ ప్రాజెక్టు నిర్మాణ పనులను దక్షి ణ మధ్య రైల్వే విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. సుమారు రూ.3 వేల కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఆసిఫాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్ మధ్య 11 కిలోమీటర్ల మేర చివరి దశ మూడో లైన్ నిర్మాణం, విద్యుదీకరణ పనులు జూలై 22న పూర్తవడంతో మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చింది. 203 కిలోమీటర్ల పొడవున చేపట్టిన ఈ ప్రాజెక్టులో తెలంగాణలో 159 కిలోమీటర్లు, మహారాష్ట్రలో 44 కిలోమీటర్ల మేర మూడో లైన్, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. బ్రిబా నదిపై కీలక వంతెన నిర్మాణంతో పాటు అన్ని మౌలిక పనులు పూర్తి కావడంతో గ్రాండ్ ట్రంక్ మార్గంలో రైళ్ల రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. దేశంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాలను అనుసంధానించే ఈ ప్రధాన రైలు మార్గంలో ప్రయాణికుల రాకపోకలతో పాటు బొగ్గు, సిమెంట్, పారిశ్రామిక ముడి పదార్థాల రవాణా భారీగా జరుగుతోంది. మూడో రైలు మార్గం అందుబాటులోకి రావడంతో రద్దీ తగ్గి, సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు ప్రయాణికుల రైళ్ల నిర్వహణ కూడా మరింత సులభతరం కానుంది. విద్యుదీకరణ పూర్తికావడం వల్ల ఇంధన వినియోగం తగ్గడంతో పాటు కార్బన్ ఉద్గారాల నియంత్రణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేసిన నిర్మాణ, ఇంజనీరింగ్, సిగ్నల్, టెలికమ్యూనికేషన్, విద్యుత్, నిర్వహణ తదితర విభాగాల అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ ప్రాజెక్టు దేశంలోని ఉత్తర-దక్షిణ ప్రాంతాల మధ్య రైల్వే అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్ రవాణా అవసరాలను సమర్థవంతంగా తీర్చడంలో కీలక వైలురాయిగా నిలువనుందని ఆయన పేర్కొన్నారు.

# పిఎ వేధింపులతో కాంగ్రెస్ నేత మృతి?

### గుండ్లపల్లిలో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి

### పోలీసు పహారాలో అంత్యక్రియలు

**కరీంనగర్ బ్యూరో/మానకొండూర్, ప్రభాత వార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తగిన గుర్తింపు లభిస్తుందని ఆశించిన ఓ కాంగ్రెస్ నేత అనుమానాస్పద పరిస్థితుల్లో, మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. పార్టీ జెండాను గుండెల్లో పెట్టుకుని, పార్టీ కోసం క్షేత్రస్థాయి లో పనిచేసిన మానకొండూరు నియోజక వర్గంలోని గన్నేరువరం మండలం గుండ్ల పల్లికి చెందిన బేతెల్లి రాజేందర్‌రెడ్డి (మాజీ సర్పంచ్ సమత భర్త) మృతి స్థానికంగా సంచలనం కలిగిస్తుంది. కుటుంబసభ్యుల తెలిపిన ప్రకారం.. ఈ నెల 14న జిల్లాలోని ఎల్ఎండి కాలనీలోని మానకొండూరు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ప్రజా భవన్) ఎదుట బేతెల్లి రాజేందర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే ఆయనను స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తర లించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. రాజేందర్ రెడ్డి బుధవారం అర్ధరాత్రి ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాక హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సమ యంలో రాజేందర్‌రెడ్డి ఇచ్చిన మరణ వాంగ్మూలంలో పలు కీలక అంశాలు వెలుగుచూసినట్లు తెలుస్తోంది. వాంగ్మూలంలో సంచలన ఆరోపణలు చేసి నట్లు సమాచారం. మానకొండూరు ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) తనపై అక్రమకేసులు బనాయించారని, అట్రాసిటీ కేసుల పెట్టించి వేధించడం తోనే ఆత్మహత్యా యత్నానికి దిగినట్లు ఆయన పేర్కొన్నట్లు సమాచారం. తన గోడును నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్దామనుకున్నా, ఆయన అందుబాటులో లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అధికారంలో లేనప్పుడు పార్టీ కోసం ముందుండి కష్టపడిన రాజేందర్‌రెడ్డి పట్ల కొందరు వ్యవహరించిన తీరుపై స్థానిక కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. పార్టీ పెద్దలు ముందే స్పందించి ఉంటే ప్రాణనష్టం జరిగి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తన భర్త మృతికి మానకొండూరు ఎమ్మెల్యే పీఏ(వ్యక్తిగత సహాయకుడు)నే ప్రధాన కారణమని మృతుడి భార్య, మాజీ సర్పంచ్ సమత నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

**గుండ్లపల్లిలో ఉద్రిక్తత.. పోలీసుల లాఠీచార్జి**

రాజేందర్‌రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం గురువారం పోలీసుల భారీ బందోబస్తు మధ్య గుండ్లపల్లి గ్రామానికి తరలించారు. ఈ సందర్భంగా మృతుని బంధువులు ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్తున్న సమయంలో పిఎ మురళీధర్‌రెడ్డి నివాసం వద్దకు చేరుకున్న బంధువులు ఒక్కసారిగా ఇంటిని ముట్టడించడానికి యత్నించారు. వారిని అడ్డుకోవడానికి ప్రయ త్నించిన పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి అదుపుతప్పడంతో పోలీసులు లాఠీచార్జి చేసి గుంపును చెదర గొట్టినట్లు సమాచారం. ఈ పరిణామాల నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తుగా అప్రమత్తమయ్యారు. ఔజిల్లా కాంగ్రెస్ కార్యాలయంతోపాటు ఎల్ఎండీ కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, అదేవిధంగా గుండ్లపల్లిలోని పీఏ మురళీధర్‌రెడ్డి నివాసం దగ్గర ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గస్తీ నిర్వహించి, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ నేత ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, మృతి చెందడం జిల్లాలో ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు చెబుతున్నారు.

## కోవిడ్‌పై ఆందోళన అవసరం లేదు

### పరిస్థితి పూర్తిగా అదుపులో ఉంది: చేసిన కేంద్ర ఆరోగ్య శాఖ

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** దేశంలో కోవిడ్-19 వ్యాప్తిపై జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కేంద్ర ఆరోగ్య శాఖ గురువారం ప్రకటించింది. కోవిడ్ గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సి న అవసరం లేదని, ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని అన్ని రాష్ట్రాల ఆరోగ్య శాఖ కార్యదర్శులకు తెలిపింది. ఈ మేరకు గురువారం అన్ని రాష్ట్రాల హెల్త్ సెక్రటరీలకు కేంద్ర ఆరోగ్యశాఖ సమాచారం అందించింది.

## 20 యేళ్లుగా అమెరికాలో ఉద్యోగం

### ఇంజినీర్‌పై ప్రభుత్వం విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 23:** తెలంగాణ రోడ్లు, భవనాల (ఆర్ అండ్ బి) శాఖలో పనిచేస్తున్న ఓ ఇంజనీర్, ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా దాదాపు రెండు దశాబ్దాలుగా అమెరికాలో ఉద్యోగం చేస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం, సదరు ఇంజినీర్‌పై క్రమశిక్షణా చర్యలకు ఉపక్రమించింది. శాఖాపరమైన రికార్డుల్లో ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతున్న ఆయనపై సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఆర్ అండ్ బి శాఖలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉన్న సీహెచ్ రవి, 2006లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో తొలిసారిగా అమెరికా వెళ్లారు. అనంతరం 2011లో స్వల్ప కాలం పాటు తిరిగి వచ్చి, 2012లో మళ్లీ అమెరికాకు వెళ్లారు. అప్పటి నుంచి ఆయన విధులకు హాజరుకావడం లేదు. గత కొన్ని ఏళ్లుగా ఆయన వేతనం తీసుకోనప్పటికీ, ఆర్ అండ్ బి శాఖ అధికారిక రికార్డుల్లో ఆయన పేరు ఇప్పటికీ ఉద్యోగిగా కొనసాగుతుండటం గమనార్హం. ప్రభుత్వ సర్వీస్ నిబంధనల ప్రకారం, విదేశాల్లో ఉద్యోగం చేయాలంటే ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి పొందడం తప్పనిసరి. అలాగే, నిబంధనల మేరకు గరిష్ఠంగా ఐదేళ్ల వరకు మాత్రమే దీర్ఘకాలిక సెలవు పొందేందుకు అవకాశం ఉంటుంది. అయితే, రవి ఎలాంటి అనుమతులు పొందకుండానే విదేశాల్లో ఉద్యోగంలో చేరి సేవా నిబంధనలను ఉల్లంఘించారని అధికారులు గుర్తించారు.


తెలంగాణ ప్రభుత్వం
రెవిన్యూ (LA) విభాగం

కలెక్టరేట్: మహబూబ్‌నగర్

ఫారం - VII
ప్రకటన

(2013 యొక్క చట్టం-30 యొక్క 19(1) సెక్షన్ మరియు నిబంధన-25 యొక్క సబ్ రూల్(1) చూడండి)

No. Rev/G1/LAG/0016/2025-G-Section తేది: 30.06.2026

ఇది ఇలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం/కలెక్టర్ వారు మహబూబ్‌నగర్ జిల్లా చిన్న చింతకుంట మండలం యొక్క అల్లీపూర్ గ్రామంలో ఎ.0.76 సెంట్లు మరియు 387.20 చ.గజాలు యొక్క మొత్తం విస్తీర్ణం, ప్రజా ప్రయోజనం నిమిత్తం రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం క్రింద బుద్దారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ యొక్క ఎడమ ప్రధాన కాల్వ యొక్క కి.మీ. 0.000 నుండి 1.300 కి.మీ.కు D-26 యొక్క 5L మైనర్ పై 1L సబ్ మైనర్ కొరకు భూమి అవసరమై ఉన్నదని భావించినారు.

కావున మహబూబ్‌నగర్ జిల్లా యొక్క చిన్న చింతకుంట మండలం యొక్క అల్లీపూర్ గ్రామంలోని పై సదరు ప్రాజెక్ట్ కొరకు ప్రామాణిక కొలత యొక్క ఎ.0.76 సెంట్లు మరియు 387.20చ.గజాలు భూమి కొలత ఎక్కువ లేదా తక్కువగా భూమి సేకరణకు ప్రకటించబడమైనది. ఆ భూమి సవివర వివరణ ఈ క్రింది విధంగా.

గ్రామం : అల్లీపూర్ మండలం : చిన్న చింతకుంట జిల్లా : మహబూబ్‌నగర్

| క్ర. సం. | సర్వే నం. | మెట్ట/ ఐ.డి/ తరి | భూమి రకం | సేకరణక్రింద ప్రతిపాదిత ఏరియా (ఎక. సెంట్స్‌లో) | ఆసక్తి గల వ్యక్తి పేరు మరియు చిరునామా | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | కట్టడాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 159 | మెట్ట | పట్టా | 0.47 | వెంకటరెడ్డి తండ్రి: పద్మనాభరెడ్డి | 215 | 157 | 158 | 150 | | |
| 2 | 149 | మెట్ట | పట్టా | 0.21 | ఉప్పరి లక్ష్మి భర్త: వెంకటేష్ | 109 | 111 | 148 | 150 | టేక్ -23 కొబ్బరి -7 మామిడి -10 బోర్-1 | |
| 3 | 149 | మెట్ట | పట్టా | 0.08 | ఉప్పరి నర్సింహులు తండ్రి: [illegible] | 109 | 111 | 148 | 150 | | |
| | | | మొత్తం: | 0.76 | | | | | | | |
| 4 | 149 | మెట్ట | నాలా | 387.20 చ. గజాలు | పెట్రోల్ బంక్ ఎస్.కాంతికుమార్ తండ్రి: ఎస్.బంగారు శ్రీనివాస్ | 109 | 111 | 148 | 150 | | |

2013 యొక్క చట్టం నం.30 యొక్క సెక్షన్ 15 క్రింద ఏర్పాటు ప్రకారం తగిన సరియైన విచారణ మరియు ఆసక్తి గల వ్యక్తుల యొక్క అభ్యంతరాలను విన్న తర్వాత, ఈ ప్రకటన చేయబడింది. ఈ భూసేకరణ కారణంగా పునరావాసం కల్పించవలసిన కుటుంబాలు లేవు.

బొగ్గు యొక్క గనులు, ఇసుక-రాయి, వలక లేదా ఇతర ఖనిజాలు ఈ భూగర్భంలో పడి ఉన్నవి లేదా సదరు భూమి యొక్క ప్రత్యేక భాగంలో వున్నవి, ఏదైనా, భూమి సేకరించబడుతున్న ప్రయోజనం కొరకు ప్రాజెక్ట్ యొక్క నిర్మాణ దశలో ఉపయోగించే ఏదైనా లేదా తొలగింపు లేదా త్రవ్వవలసిన అవసరం వుంటే తప్ప లేదా అవసరం లేనివై వున్నాయి.

భూమి యొక్క ప్లాన్ ఏ పని రోజునైనా మహబూబ్‌నగర్, ఇరిగేషన్ ప్రాజెక్ట్, యూనిట్-II, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, వారి కార్యాలయంలో తనిఖీ చేసుకొనవచ్చును.

సం/-.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R యూనిట్-II ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్
సం/- అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), మహబూబ్‌నగర్
సం/-. ఖుష్బూ గుప్తా IAS జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్

DIPR RO.NO: 528/LA/PP/Advt/Pub/2026-27

వార్త

భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

-విలియం హామిల్టన్

# 'ఉచితాల' కోసం ఎన్ని తిప్పలో!

ఎన్నికల్లో లబ్ధిపొందడమే లక్ష్యంగా రూపొందుతున్న పథకాలు ఏలిన వారికి విజయం సాధించి పెట్టినా, ఆ వెంటనే అభాసుపాలు చేస్తున్నాయి. చిత్తశుద్ధికీ లక్ష్య సిద్ధికి లంగరు అందడం లేదు. అనర్హులకు చిక్కుతున్నాయి. ప్రభుత్వ ఖజానాలకు చిల్లుపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో ఏరాజకీయ పార్టీ అధికారంలోఉన్నా అవలంభించాల్సిన ఎన్నికల తంత్రం ఇదేనన్నట్లు చరిత్ర శిలాక్షరాలు రాసిపెట్టేసినట్లుంది. ఉచితాలనేవి తాత్కాలిక ప్రయోజనం ఆశించి గుప్పించే 'ఎర'మాత్రమే. అంతకన్నా వేరుగా విశ్లేషించలేం. కాలక్రమేణ అదే విషయం నిరూపితమవుతోంది. మహారాష్ట్రలో మహిళల కోసం మొన్న ఎన్నికలప్పుడు అమలు చేసిన సంక్షేమ పథకం ఇప్పుడు ఆ రాష్ట్ర కోశాగారానికి కన్నం పెట్టిందనే చెప్పాలి. అనర్హులకు తామరతంపరగా ఆర్థికలబ్ధి చేరిపోయింది. ఇదేదో కుడి ఎడమైతే పర్వాలేదని పరాకుగా తెచ్చినపథకంకాదు. కానీ మహా కోశాగారం ఖాళీ అయిపోయింది. మహారాష్ట్ర ప్రభుత్వం పేదమహిళల ఆర్థిక పరిపుష్టి కోసం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'ముఖ్యమంత్రిమాఝీలాడ్కీ బహీన్ యోజన'లో వెలు గుచూసిన ఆరోపణలు, బడ్జెట్ ఉల్లంఘనలు, నకిలీ లబ్ధిదారుల ఉదంతం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల్లో పారదర్శకత లోపిస్తే, ప్రజాధనం ఏ విధంగా దుర్వినియోగమవుతుందో తెలిపేందుకు ఈ ఘటన ఒక ఉదాహరణ. కాగ్ నివేదికతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర తనిఖీల్లో ఈ పథకంలో జరిగిన లోపాలు స్పష్టమయ్యాయి. ప్రాథమిక దశలో కఠినమైన భౌతిక తనిఖీలు లేకుండా కేవలం స్వీయ పత్రాల ఆధారంగా ఆదరబాదరగా నిధులు విడుదల వల్ల నకిలీ ఖాతాలు వెలిశాయి. నిరుపేద మహిళలకు నెలకు రూ.1,500 ఇచ్చే ఈపథకంలో సుమారు 14వేల మందికి పైగా పురుషులు మహిళలుగా నకిలీపత్రాలతోనమోదు చేసుకుని నిధులు పొందినట్లు తేలింది. దీనివల్ల సుమారు రూ.21.44 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. అర్హత లేకపోయినా దాదాపు 2,600 మందికి పైగా ప్రభుత్వ మహిళా ఉద్యోగులు (క్లాస్3, క్లాస్4) ఈ ఆర్థిక సహాయాన్ని అక్రమంగా పొందారు. దాదాపు 29వేల మంది పురుషులు, సుమారు 8వేల మంది ప్రభుత్వఉద్యోగులు అనర్హులు అయినప్పటికీ లబ్ధి పొందినట్లు తేలింది. నిధుల కేటాయింపుల్లో అనుమతించిన బడ్జెట్ కంటే దాదాపు రూ.3,541 కోట్ల మేర అదనపు వ్యయం జరిగిందని కాగ్ నివేదిక స్పష్టం చేసింది. ఈ స్థాయిలో అక్రమాలు జరగడానికి ప్రభుత్వ యంత్రాంగం, డిజిటల్ వ్యవస్థల్లో ఉన్న లోపాలే ప్రధాన కారణం. ఎంప్లాయ్ డేటాబేస్ , ఆధార్ సీడింగ్‌ను సరిగ్గా సరిపోల్చకపోవడం వల్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం సులభంగా లబ్ధిదారులుగా మారిపోయారు. లోపాలు బయటపడిన తర్వాత ప్రభుత్వం కఠిన తనిఖీలు చేపట్టి, ఆన్‌లైన్ ఈకెవైసి ప్రక్రియ ద్వారా దాదాపు 92లక్షల నకిలీ, అనర్హమైన ఖాతాలను తొలగించింది. అలాగే అక్రమంగా నిధులు పొందిన వారి నుండి రికవరీ చర్యలను ప్రారంభించింది. తొలగించబడిన లబ్ధిదారులు సుమారు రూ.14వేలకోట్లు అందుకున్నారు. ఈ ఘటన ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ పథకాలనిర్వహణపై అనేక సందేహాలను రేకెత్తిస్తోంది. ఎన్నికల సమయాల్లో హడావుడిగా తగినంత బడ్జెట్ అంచనాలు లేకుండాప్రవేశపెట్టే పథకాలు రాష్ట్ర ఆర్థికపరిస్థితిని దెబ్బతీస్తాయి. ఒకేసారి లక్షలాది పేర్లను తొలగించే క్రమంలో, డిజిటల్ పరిజ్ఞానం లేని కొందరు నిజమైన పేద మహిళలు కూడా ఈకెవైసి సమస్యల వల్ల ప్రయోజనాలు కోల్పోతున్నారనే ఆందోళన ఉంది. లడ్కీబహీన్ యోజన కింద నమోదు చేసుకున్న ప్రతి 10మంది మహిళల్లో దాదాపునలుగురిని తొలగించినట్లు ప్రభుత్వ రికార్డుల సమీక్షలో వెల్లడైంది. ఈపథకం నుండి 92 లక్షలకు పైగా లబ్ధిదారులను తొలగించారు. ఇది మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు బహిరంగంగా వెల్లడించిన సుమారు 80లక్షల తొలగింపులను మించిపోయింది. ఇలాంటి వాటిపై ఎన్నో చర్చోపచర్చలు జరుగుతాయి. కానీ ఫలితం శూన్యం. వారి కుటుంబాల వార్షిక ఆదాయం పథకం అర్హత గరిష్ట పరిమితి అయిన రూ.2.5లక్షలను మించిపోయినందున, దాదాపు 16లక్షల మంది లబ్ధిదారులను తొలగించారు. ధృవీకరణ సమయంలో మరో 4.42లక్షల మంది లబ్ధిదారులు, తాము గానీ లేదా తమ కుటుంబ సభ్యులలో ఒకరు గానీ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నారని ప్రకటించారు. వీరిలో సుమారు3.6 లక్షల మంది ఇప్పటికే సంజయ్‌గాంధీ నిరాధర్ యోజన కింద సహాయం పొందుతుండగా, దాదాపు 2.5 లక్షల కేసులలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరికంటే ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారు. రికార్డుల ప్రకారం, సుమారు 1.8 లక్షల మంది లబ్ధిదారులు 65ఏళ్ల గరిష్టఅర్హతా పరిమితి కంటే ఎక్కువ వయస్సుగలవారని, జిల్లా స్థాయి ధృవీకరణ సమయంలో దాదాపు 1.7లక్షల మందిని గుర్తించినట్లు వెల్లడైంది. ఈపథకం కింద, సంవత్సరానికి రూ.2.5 లక్షల కంటే తక్కువ సంపాదించే కుటుంబాలకు చెందిన 21నుండి 65 సంవత్సరాల మధ్యవయస్సు గల మహిళలు ప్రత్యక్ష ప్రయోజన బదిలీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా నెలకు రూ. 1,500 పొందుతారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు , కొన్ని ఇతర సంక్షేమ పథకాల లబ్ధిదారులను దీని నుండి మినహాయించారు. ధృవీకరణ ప్రక్రియలోని వివిధ దశలలో లబ్ధిదారులు సుమారు 10 నెలల పాటు సహాయం పొందారని అధికారులు తెలిపారు. కేవలం ఓట్ల లబ్ధికోసం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం కాకుండా, బడ్జెట్ క్రమశిక్షణతో కూడిన పారదర్శక పాలన అందించడమే దీనికి ఏకైక పరిష్కారం.



ఇరవైయేళ్ల వయసుంటేనే యువకుడి కింద లెక్కకాదు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా స్పందించే వారే యువకులు.

థామస్ ఫుల్లర్



మహనీయుడు మరణాసన్న దశలో మామూలు మాటలు మాట్లాడినా అవి దైవ వాక్యాలుగానే పరిణమిస్తాయి.

లియో టాల్‌స్టాయ్

# ఒక దీక్ష... ఎన్నో ఆలోచనలు!

*ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది.*

ఎం కె కుమార్

చరిత్రలో కొన్ని క్షణాలు ఉంటాయి. అవి యుద్ధాల వల్ల కాదు. ఎన్నికల వల్ల కాదు. ఒక మనిషి మౌనంగా కూర్చోవడం వల్ల పుడతాయి. మాట్లాడకపోవడం వల్ల వినిపిస్తాయి. తినకపోవడం వల్ల దేశాన్ని ఆలోచింపజేస్తాయి. సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష అలాంటి క్షణాల్లో ఒకటి. ఆకలి సాధారణంగా శరీరానికి సంబంధించిన విషయం. కానీ కొన్నిసార్లు ఆకలి ఒక రాజకీయ భాష అవుతుంది. ఒక నిరసన అవుతుంది. ఒక నైతిక ప్రశ్నగా మారుతుంది. ఒక వ్యక్తి తన శరీరాన్నే వాదనగా మార్చుకున్నప్పుడు, అతని శక్తి కండరాల్లో ఉండదు. అతని బలం అతని నిశ్శబ్దంలో ఉంటుంది. ఆ నిశ్శబ్దం అధికారాన్ని అవమానించదు. కానీ ప్రశ్నిస్తుంది. సమాధానం కోరుతుంది. ఈ దేశం నిరాహార దీక్షలను కొత్తగా చూడలేదు. మహాత్మా గాంధీ కాలం నుంచి ఈ నేల ఒక విచిత్రమైన రాజకీయ సత్యాన్ని తెలుసుకుంది. కొన్నిసార్లు ఖడ్గం చేయలేని పనిని ఉపవాసం చేస్తుంది. శబ్దం చేయలేని మార్పును మౌనం తీసుకొస్తుంది. అయితే ప్రతి నిరాహార దీక్ష చరిత్రలో నిలవదు. ప్రజల హృదయాలను తాకినప్పుడే అది ఉద్యమమవుతుంది. సోనం వాంగ్‌చుక్ విషయంలో ఆసక్తికరమైన విషయం ఆయన వ్యక్తిత్వంకాదు. ఆయన లేవనెత్తిన ప్రశ్నలు. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతి కేవలం వినియోగించాల్సిన వనరేనా? పర్వతాలు రాళ్ల కుప్పలా? నదులు కేవలం నీటి పైపులా? లేక ఇవన్నీ మన నాగరికతకు ఊపిరా? ఈ ప్రశ్నలు ఒక్క ప్రాంతానికి సంబంధించినవి కావు. ఇవి భవిష్యత్తు తరాల ప్రశ్నలు. మన కాలంలో అభివృద్ధి అనే పదం అత్యంత ఎక్కువగా వినిపిస్తోంది. కానీ అదే సమయంలో అడవులు తగ్గుతున్నాయి. నదులు ఎండిపోతున్నాయి. పర్వతాలు కోతలకు గురవుతున్నాయి. గాలి భారంగా మారుతోంది. అభివృద్ధి మనిషి కోసం జరగాలి. మనిషి ప్రకృతిని కోల్పోయేలా జరిగితే, అది అభివృద్ధి కాదు, భవిష్యత్తుపై అప్పు. ఈ ఉద్యమంలో మరో ఆశ్చర్యకరమైన అంశం జెన్‌జెడ్ యువత స్పందన. ఈ తరాన్ని చాలామంది మొబైల్ స్క్రీన్‌ల తరం అంటారు. కానీ అదే స్క్రీన్‌ల నుంచి ఒక సామాజిక చైతన్యం కూడా పుట్టవచ్చని ఈ సంఘీభావం చూపించింది. వారు కేవలం ఒక వ్యక్తికి మద్దతు ఇవ్వడం కాదు. ఒక ప్రశ్నకు మద్దతు ఇస్తున్నారు. 'భవిష్యత్తు ఎలా ఉండాలి?' అనే ప్రశ్నకు. యువత ఉద్యమాల్లో చేరడం కొత్త విషయం కాదు. కానీ నేటి యువత భావోద్వేగాలకంటే సమాచారంతో ముందుకు వస్తోంది. వారు పర్యావరణంపై చదువుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమాలను గమనిస్తున్నారు. తమ భవిష్యత్తు వాతావరణ మార్పులతో ముడిపడి ఉందని అర్థం చేసుకుంటున్నారు. అందుకే వారి సంఘీభావాన్ని కేవలం సోషల్ మీడియా ట్రెండ్‌గా తీసిపారేయలేం. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల బాధ్యత కేవలం పాలించడం కాదు. వినడం కూడా. ప్రతి నిరసన సరైందని చెప్పలేం. ప్రతి డిమాండ్‌ను అంగీకరించాల్సిన అవసరం కూడా లేదు. కానీ శాంతియుతంగా ప్రశ్నించే పౌరులను వినడం ప్రజాస్వామ్య పరిపక్వతకు సూచిక. ప్రశ్నలను అణచివేయడం కంటే వాటితో సంభాషించడం ఎప్పుడూ మెరుగైన మార్గం. ఈ ఉద్యమాన్ని చూసి మరో ప్రశ్న కూడా మన ముందుకొస్తుంది. మనం ప్రకృతిని ప్రేమిస్తున్నామా? లేక అవసరమైనంత వరకు మాత్రమే ఉపయోగించుకుంటున్నామా? హిమాలయాలు కేవలం పర్యాటక ప్రాంతాలు కావు. అవి భారతదేశ జలవనరుల హృదయం. వాటి ఆరోగ్యం దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. అక్కడ జరిగే మార్పులు వేల కిలోమీటర్ల



దూరంలో ఉన్న ప్రజల జీవితాలను కూడాప్రభావితం చేయగలవు. సోనం వాంగ్‌చుక్ గెలుస్తారా? ఓడిపోతారా? ఈ ప్రశ్నకు సమాధానం భవిష్యత్తు చెబుతుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన ఒక చర్చను ప్రారంభించారు. ఒక దేశం తన అభివృద్ధి నమూనాను మరోసారి పరిశీలించాలా అనే ప్రశ్నను ముందుంచారు. అదే ఒక ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన పని. ఎందుకంటే ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేయడం కాదు. ప్రతి రోజు మన భవిష్యత్తు గురించి మాట్లాడుకోవడం. ప్రకృతి గురించి ఆలోచించడం. భిన్నాభిప్రాయాలను వినడం. అధికారాన్ని ప్రశ్నించడం. సమాధానాలను కలిసి వెతకడం. ఒక మనిషి ఆకలి ఎన్నిరోజులు కొనసాగుతుందో తెలియదు. కానీ ఆ ఆకలి ఒక దేశపు మనస్సాక్షిని మేల్కొలిపితే, ఆ నిరాహార దీక్ష చరిత్రలో ఒక రాజకీయ సంఘటనగానే కాదు, ఒక నైతిక సంభాషణగా కూడా నిలిచిపోతుంది. ఒక దేశం బలం దాని సైన్యంలో మాత్రమే ఉండదు. దాని సంపదలో మాత్రమే ఉండదు. ఆ దేశంలో ఒక సాధారణ పౌరుడు అధికారాన్ని ప్రశ్నించగల ధైర్యంలో ఉంటుంది. ప్రశ్నించిన వ్యక్తిని శత్రువుగా కాకుండా, సంభాషణకు ఆహ్వానించే రాజకీయ సంస్కృతిలో ఉంటుంది. ఈ కారణంగానే సోనం వాంగ్‌చుక్ నిరాహార దీక్ష కేవలం ఒక ఉద్యమంగా మిగలలేదు. అది భారత ప్రజాస్వామ్యానికి ఒక అద్దంగా మారింది. నేడు ప్రపంచమంతా అభివృద్ధి గురించి మాట్లాడుతోంది. ఎత్తైన భవనాలు, విశాలమైన రహదారులు, వేగవంతమైన రైళ్లు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ ఇవన్నీ అభివృద్ధి సూచికలుగా మారాయి. కానీ ప్రకృతి నిశ్శబ్దంగా ఒక ప్రశ్న అడుగుతోంది. 'ఈ అభివృద్ధిలో నాకు చోటుందా?' అనే ప్రశ్న. ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా మనం ఎంత దూరం పరిగెత్తినా, ఒకరోజు అదే ప్రకృతి మనల్ని ఆపుతుంది. ప్రపంచ చరిత్ర చెబుతున్న ఒక నిజం ఉంది. ప్రకృతిని జయించాలని ప్రయత్నించిన నాగరికతలు చివరికి ప్రకృతి ముందు తలవంచాయి. నదులకు బంధించిన సమాజాలు వరదలను చూశాయి. అడవులను నరికిన దేశాలు కరవును అనుభవించాయి. పర్వతాలను పేల్చిన నాగరికతలు భూకంపాల భయాన్ని ఎదుర్కొన్నాయి. ప్రకృతి ప్రతీకారం తీర్చుకోదు. కానీ తన నియమాలను మాత్రం మార్చదు. ఈ నేపథ్యంలో యువత స్పందనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ఒకప్పుడు రాజకీయాలు పెద్దల విషయం అనుకునేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. వాతావరణ మార్పులు, ఉపాధి, విద్య, సాంకేతికత, స్వేచ్ఛ ఇవి యువత భవిష్యత్తును నేరుగాప్రభావితం చేస్తున్నాయి. అందుకే వారు ప్రేక్షకులుగా ఉండటానికి సిద్ధంగా లేరు. వారు ప్రశ్నిస్తున్నారు. చర్చిస్తున్నారు. భాగస్వాములు కావాలని కోరుకుంటున్నారు. అయితే ప్రతి ఉద్యమానికి ఒకప్రమాదం కూడా ఉంటుంది. అది వ్యక్తి చుట్టూ తిరగడం. ప్రజాస్వామ్యంలో వ్యక్తులు ముఖ్యమే. కానీ వ్యక్తుల కంటే విలువలు ముఖ్యమైనవి. ఒక ఉద్యమం ఒక నాయకుడి జీవితంతో ముగియకూడదు. అది సమాజంలో ఆలోచనగా మిగలాలి. పర్యావరణం గురించి, ప్రజల భాగస్వామ్యం గురించి, బాధ్యతాయుతమైన పాలన గురించి చర్చలు కొనసాగాలి. అదే ఒక ఉద్యమం నిజమైన విజయం. మీడియా పాత్ర కూడా ఇక్కడ అత్యంత కీలకం. వార్తలను చెప్పడం మాత్రమే కాదు. ప్రజలకు వివిధ కోణాలను అందించడం కూడా మీడియా బాధ్యత. ఒక ఉద్యమాన్ని పొగడడమో, పూర్తిగా ఖండించడమో కాదు దాని వెనుక ఉన్న ప్రశ్నలను సమాజం ముందు ఉంచడమే ప్రజాస్వామ్య మీడియా ధర్మం. ప్రజలు అన్ని వాదనలు విని తమ అభిప్రాయాన్ని ఏర్పరచుకునే అవకాశం కల్పించాలి. ప్రభుత్వాలకు కూడా ఒక చారిత్రక బాధ్యత ఉంది. శాంతియుత నిరసనలను బల హీనతగా కాకుండా ప్రజాస్వామ్య శక్తిగా చూడాలి. విభేదాలను అణచివేయడం తాత్కాలిక నిశ్శబ్దాన్ని తెచ్చిపెట్టవచ్చు. కానీ సంభాషణ మాత్రమే శాశ్వత విశ్వాసాన్ని నిర్మిస్తుంది. ప్రజాస్వామ్యం అనేది గెలుపుఓటమి రాజకీయాల కంటే, పరస్పర విశ్వాసం మీద నిలిచే వ్యవస్థ. సోనం వాంగ్‌చుక్ ఉద్యమం చివరకు విజయం సాధిస్తుందా? కాలమే సమాధానం చెబుతుంది. కానీ ఈ ఉద్యమం ఇప్పటికే ఒక విజయాన్ని సాధించింది. అది లక్షలాది మందిని ఆలోచింప జేసింది. అభివృద్ధి అంటే ఏమిటి? ప్రకృతితో మన సంబంధం ఎలా ఉండాలి? యువత పాత్ర ఏమిటి? ప్రభుత్వ బాధ్యత ఎక్కడ ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది? అనే ప్రశ్నలను మళ్లీ మన ముందుంచింది. ●

# ఆదాయపు పన్ను.. ప్రజల ఆర్థిక బాధ్యత



రామ కిష్టయ్య సంగన భట్ల

భారత ఆర్థిక చైతన్యానికి సంకేతంగా నిలిచే జులై 24 ఆదాయపు పన్ను దినోత్సవం. ఇది కేవలం ఓ చట్టబద్ధమైన విధానం రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతను, ప్రభుత్వానికి పౌరుల భాగస్వామ్యాన్ని, నైతికతను, పారదర్శకతను గుర్తుచేసే చైతన్య దినం. భారత దేశంలో ఆదాయపు పన్ను చట్టం మూలాలు బ్రిటిష్ కాలంలోకే వెళ్తాయి. 1857 సిపాయిల తిరుగు బాటుతో ఏర్పడిన ఆర్థిక లోటును తీర్చేందుకు 1860 జూలై 24న బ్రిటన్ ఆర్థిక మంత్రి సర్ జేమ్స్‌విల్సన్ పర్యవేక్షణలో ఆదాయపు పన్ను విధానం రూపొందించబడింది. గవర్నర్ జనరల్ లార్డ్ కేనింగ్ మద్దతుతో తొలిసారిగా భారత దేశంలో ఆదాయపు పన్ను అమలులోకి వచ్చింది. ఈ చరిత్రాత్మక నిర్ణయం భారత ఆర్థిక పరిపక్వతకు నాంది పలికింది. ఈ చారిత్రికతకు గౌరవ సూచకంగా భారత ఆదాయపు పన్నుశాఖ 2010 నుంచి ప్రతి సంవత్సరం జూలై 24ను ఆదాయపు పన్ను దినంగా అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా పన్ను చెల్లింపుదారుల పట్ల కృతజ్ఞత ప్రకటిస్తూ అవగాహన కార్యక్రమాలు, సాంకేతిక శిక్షణలు, విజేతల సన్మానాలు నిర్వహించబడుతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న ఆదాయపు పన్ను చట్టం 1961నాటి చట్టం, ఇది 1962 ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వచ్చింది. ఈచట్టం ప్రకారం వ్యక్తులు, కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు తమ ఆదాయానికి తగిన విధంగాపన్ను చెల్లించాల్సి ఉంటుంది. పన్ను వసూళ్లను పర్యవేక్షించే ఆదాయపు పన్ను శాఖ దీనిని నిష్ఠతో అమలు చేస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థలో ఆదాయపుపన్ను కీలకమైన వనరుగా నిలుస్తోంది. దేశానికి వచ్చే మొత్తం పన్ను ఆదాయంలో సగానికి పైగా ఆదాయపు పన్నుల ద్వారానేలభిస్తోంది.




2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రమే ఆదాయపు పన్నుల ద్వారా రూ.10లక్షల కోట్లకు పైగా ఆదాయం నమోదైంది. ఈ ఆదాయంతోనే ప్రభుత్వం ఆరోగ్యం, విద్య, రక్షణ, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెడుతోంది. పన్ను చెల్లించే వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఆదాయపు పన్ను శాఖ అనేక సంస్కరణలను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ఫేస్‌లెస్ అసెస్మెంట్ విధానం ద్వారా అవినీతి నివారణ, ఇఫైలింగ్ వేదిక ద్వారా సులభత, ప్రీఫిల్డ్ రిటర్న్‌లతో ప్రజలకు సమయాన్ని ఆదా చేసే మార్గం, డిజిటల్ చెల్లింపు పద్ధతుల ద్వారా పారదర్శకత పెరిగింది. అంతేకాక, ఆధునిక టెక్నాలజీని వినియోగించుకుని పన్ను చెల్లింపుదారుల అనుభవాన్ని మెరుగుపరచడం జరిగింది. పన్ను విధానంలో సామాజిక సమతుల్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అధిక ఆదాయం కలిగిన వారు అధిక పన్నుచెల్లిస్తే, తక్కువ ఆదాయం కలిగినవారు మినహాయింపులను పొందే విధంగా వ్యవస్థ రూపుదిద్దుకుంది. ఫలితంగా, సమాజంలోని బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. 2023-24లో దేశవ్యాప్తంగా 8.2 కోట్లకు పైగా పన్ను చెల్లింపుదారులు నమోదయ్యారు. వారిలో 60శాతం పాత పన్నువిధానాన్ని ఎంచుకోగా, మిగిలిన వారు కొత్త పన్ను విధానాన్ని అనుసరించారు. ఇది ఆదాయ స్థాయిలను బట్టి వ్యక్తులు ఎంచుకునే స్వేచ్ఛను సూచిస్తుంది. ఇదే ప్రజల ఆర్థిక చైతన్యానికి నిదర్శనం. పన్ను చెల్లించడాన్ని నేరుగా చట్టబద్ధ కర్తవ్యంగా కాక, దేశానికి చేసే సేవగా భావించాల్సిన అవసరంఉంది. ప్రతి పౌరుడు తన ఆదాయానికి తగిన విధంగా పన్ను చెల్లిస్తే మాత్రమే సమాజంలో సమతుల్యత, అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆదాయపు పన్ను దినం అంటే కేవలం పన్ను చట్టాన్ని గుర్తు చేసే రోజు కాదు. ఇది ప్రజల ఆర్థిక బాధ్యతకు గుర్తుగా నిలిచే అవిశ్రాంత పిలుపు. ఈ సందర్భంగా పన్ను చెల్లించు - దేశాన్ని నిర్మించు అనే నినాదం ప్రజల మనసుల్లో నాటుకోవాలి. జూలై 24 - ఇది దేశాభివృద్ధిలో పౌర సహకారానికి ఒక నిశ్చల గుర్తింపు, భవిష్యత్ భారత నిర్మాణానికి ప్రజల నైతిక ఆర్థిక చింతనకు నిలిచే శాశ్వత పిలుపు. ●

# ఉపాధ్యాయుడే భవిష్యత్ మార్గదర్శి

తరిగోపుల నారాయణస్వామి

విద్య అనేది ఏ రాష్ట్రానికైనా సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి పునాది. ఆ పునాదిని నిర్మించే ప్రధాన శిల్పి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో, వృత్తిపరమైన గౌరవంతో పనిచేసినప్పుడే విద్యార్థి అభ్యసన ఫలితాలు మెరుగుపడతాయి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో నేడు అనేక మంది ప్రభుత్వ ఉపాధ్యాయులుఎదుర్కొంటున్న పరిస్థితులను పరిశీలిస్తే, బోధన కంటేబోధనకు ఆటంకాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే భావన కలుగుతుంది. ఈ పరిస్థితి కేవలం ఉపాధ్యాయుని వ్యక్తిగత సమస్య కాదు, అది విద్యార్థి భవిష్యత్తు, పాఠశాల వాతావరణం, సమాజ అభివృద్ధితో ముడిపడి ఉన్న అంశం. ఒక ఉపాధ్యాయుని ప్రధాన బాధ్యత తరగతిగదిలో విద్యార్థులను బోధించడం. కానీ వాస్తవ పరిస్థితుల్లో బోధనేతర కార్యక్రమాలు రోజురోజుకూ పెరుగుతున్నాయనే అభిప్రాయం ఉపాధ్యాయుల్లో విస్తృతంగా వినిపిస్తోంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, నివేదికలు, డేటా నమోదు, ప్రత్యేక కార్యక్రమాలు, పరిపాలనా పనులు వంటి బాధ్యతలుబోధన సమయాన్నే ప్రభావితం చేస్తున్నాయని పలువురు ఉపాధ్యాయులు భావిస్తున్నారు. తరగతి గదిలో గడపాల్సిన సమయం కార్యాలయ సంబంధిత పనుల్లో గడిస్తే, విద్యార్థుల అభ్యసన నాణ్యతపై దాని ప్రభావం సహజంగానే ఉంటుంది. విద్యార్థి ముందు నిలబడే ఉపాధ్యాయుడు కేవలం పాఠ్య పుస్తకాన్ని బోధించే వ్యక్తి కాదు. ఆయన ఆలోచింపజేసే మార్గదర్శి. విలువలను నాటే వ్యక్తిత్వ నిర్మాత. అలాంటి బాధ్యతలను నిర్వర్తించాలంటే ఉపాధ్యాయునికి మానసిక ప్రశాంతత అత్యవసరం. అయితే నిరంతర పరిపాలనా ఒత్తిళ్లు, తరచూ మారే ఆదేశాలు, అదనపు బాధ్యతలు, అనిశ్చితి వంటి అంశాలు బోధనపై ప్రభావం చూపే అవకాశాన్ని విస్మరించలేం. ఇటీవలి కాలంలో యాభై సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయుల్లో కూడా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్‌కు సంబంధించిన ఆందోళనలు కనిపిస్తున్నాయి. అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులు మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాల్సిన పరిస్థితి మానసిక ఒత్తిడిని పెంచుతుందని వారు భావిస్తున్నారు. జీవిత అనుభవం, బోధనా అనుభవం, కుటుంబ బాధ్యతలు, ఆరోగ్య సమస్యలు, వయస్సు వంటి అంశాల మధ్య పరీక్షలకు సిద్ధమవడం సులభం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. నాణ్యమైనవిద్య లక్ష్యం ఎంత ముఖ్యమో, ఆలక్ష్యాన్ని అమలు చేసే విధానంలో మానవీయ కోణం కూడా అంతేముఖ్యమనే చర్చ అవసరం. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తరువాత ఉపాధ్యాయుల్లో కేటాయింపులపై ఏర్పడిన అనిశ్చితి కూడా చాలామందిలో ఆందోళనకు కారణమైంది. ఏ జిల్లాలో సేవలు కొనసాగుతాయో తెలియని పరిస్థితి కుటుంబ జీవితం, పిల్లల చదువులు, వృద్ధుల సంరక్షణ వంటి అనేక అంశాలను ప్రభావితం చేస్తుంది. ఉపాధ్యాయుడు పాఠశాలలో చిరునవ్వుతో కనిపించినా, మనసులో అనిశ్చితి ఉంటే అది బోధనలో ప్రతిఫలించే అవకాశం ఉంటుంది. ఆర్థిక అంశాలు కూడా ఉపాధ్యాయుల మనోధైర్యంపై ప్రభావం చూపుతాయి. పెండింగ్ డీఏలు, వేతన సవరణ ఆలస్యం, ఇతర ఆర్థిక అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు తరచూ తమ ఆందోళనలను వ్యక్తం చేస్తున్నాయి. ఆర్థిక భద్రత ఉద్యోగ సంతృప్తికి ఒక ముఖ్యమైన ఆధారం. కుటుంబ అవసరాలు, పిల్లల ఉన్నత విద్య, వైద్య ఖర్చులు, ద్రవ్యోల్బణం వంటి పరిస్థితుల్లో ఆర్థిక అనిశ్చితి ఉద్యోగి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేయవచ్చు. ఆర్జిత సెలవులు మంజూరులో ఆలస్యం లేదా పరిమితులపై కూడా ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశ్రాంతి అనేది విలాసం కాదు, అది వృత్తి సామర్థ్యాన్ని నిలబెట్టే అవసరం. శారీరకంగా, మానసికంగా పునరుత్తేజం పొందిన ఉపాధ్యాయుడే తరగతి గదిలో ఉత్సాహంగా బోధించగలడు. ఆదివారాలు, పండుగ సెలవులు, ఇతర విశ్రాంతి రోజుల్లో కూడా అధికారిక కార్యక్రమాలకు హాజరు కావాల్సి వస్తోందని పలువురు ఉపాధ్యాయులు చెబుతున్నారు. కుటుంబంతో గడపాల్సిన సమయం తగ్గిపోతే కుటుంబ బంధాలపై ప్రభావం పడుతుంది. ఉపాధ్యాయుడు కూడా ఒక కుటుంబ సభ్యుడే. ఆయనకు కూడా వ్యక్తిగత జీవితం ఉంటుంది. వృత్తి, కుటుంబం మధ్య సమతుల్యత కోల్పోతే ఉద్యోగంపై ఆసక్తి తగ్గే ప్రమాదం ఉంది. పదో తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం అవసరమే. కానీ అదే సమయంలో మిగతా తరగతుల విద్యార్థుల అభ్యసన కూడా సమానంగా ముఖ్యమే. ప్రారంభ తరగతులలో బలమైన పునాది ఏర్పడకపోతే పదో తరగతిలో మంచి ఫలితాలు ఆశించడం కష్టమే. కాబట్టి విద్యా విధానం మొత్తం పాఠశాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకోవాలి. ఒకే తరగతిపై అధిక దృష్టి కేంద్రీకరిస్తే మిగతా తరగతుల అభ్యసనలో ఖాళీలు ఏర్పడే ప్రమాదం ఉంటుంది. విద్య అనేది పరీక్షల కోసం మాత్రమే కాదు. జీవితాన్ని నిర్మించడానికి. పరీక్షలు అవసరమే కానీ పరీక్షలే విద్యకు కేంద్రబిందువుగా మారకూడదు. విద్యార్థిలో ప్రశ్నించే స్వభావం, సృజనాత్మకత, సహకార భావం, విలువలు, సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడమే అసలు విద్య లక్ష్యం. ప్రభుత్వ పాఠశాలలపై సమాజం నమ్మకం పెరగాలంటే మొదట ఉపాధ్యాయుడిపై వ్యవస్థ నమ్మకం చూపాలి. ప్రతిసమస్యకు ఉపాధ్యాయుడినే బాధ్యుడిగా చూడకుండా, ఆయనకు అవసరమైన వనరులు, సమయం, శిక్షణ, మానసిక భరోసా, పరిపాలనా సహకారం అందించడం మరింత ప్రయోజనకరం. ఉపాధ్యాయుడు భాగస్వామి, కేవలం ఆదేశాలు అమలు చేసే ఉద్యోగి మాత్రమే కాదు. విద్యా విధానాల రూపకల్పనలో తరగతి గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుల అనుభవాలను కూడా వినాలి. పాఠశాల వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని నిర్ణయాలు తీసుకుంటే అమలు సులభమవుతుంది. పైస్థాయిలోరూపొందిన విధానాలు నేలస్థాయిలో ఎలాపని చేస్తున్నాయో నిరంతరం సమీక్షించడంఅవసరం. ఉపాధ్యాయుడి మనసు ప్రశాంతంగా ఉంటే తరగతి గది సృజనాత్మకంగా మారుతుంది. ●

# ప్రజావాక్కు

## ప్రభుత్వ భూములాక్రమిస్తే జైలే గతి

ఈ మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబుప్రభుత్వ భూములు ఆక్రమిస్తే జైలే గతి అని ప్రకటించారు. అప్పుడే అటవీశాఖ మంత్రి పవన్ కళ్యాణ్ అటవీ భూములు ఆక్రమిస్తే తాట తీస్తాం అన్నాడు.. ఇద్దరి ప్రకటనలు చాలా బాగున్నాయి. అయితే అవి ఉత్తుత్తి ప్రకటనలుగానే మిగిలిపోయాయి అన్న అనుమానం వస్తుంది. ఎందుకంటే రాష్ట్రంలో దొంగ స్వాములు ప్రకాశంజిల్లాలో దొంగస్వామి, తిరుపతి జిల్లాలో కల్కి ఇద్దరు ప్రభుత్వ భూములు, దళితులభూములు, అటవీ భూములు అసైన్డ్ భూములు ఆక్రమించి ఆశ్రమాల పేరుతో రకరకాలుగా మోసం చేస్తున్నారు. ప్రకాశం జిల్లాలోని దొంగస్వామి ఆక్రమించిన భూముల ను స్వాధీనం చేసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ 2021లో ఆదేశం ఇచ్చింది. ఇంతవరకు అతీగతీ లేదు. కల్కి వందలాదిఎకరాలు అసైన్డ్‌పేదల భూములుఆక్రమించి ఆశ్రమం నిర్మించాడు. కలెక్టరు ఖాళీచెయ్యమంటే కోర్టుకు వెళ్ళాడు. అటవీ భూమిలో కట్టేపుల్ల విరిస్తే జైల్లో పెడతాం అనే అటవీశాఖవారు కల్కి విషయంలో ఎందుకీ మౌనం?

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## విద్యార్థుల గురించి ఆలోచించాలి?

జిల్లా కేంద్రంలో ఉన్నకాలేజీలు, అందులో కొన్నిఆర్ట్స్ గ్రూపులు గ్రామాలకు తరలించడం అనే ప్రచారం జరుగుతుంది. జులై 31వరకు అడ్మిషన్లు ఇంకా కొనసాగుతున్నాయి. 40 సీట్లు భర్తీ కాలేదు. తగిన వసతులు లేవు. ట్రైబల్ విద్యార్థులు ఏజెన్సీ దూర గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఆగష్టు మొదటి వారంలో టెస్టులు నిర్వహించడం కోసం షెడ్యూల్ వచ్చింది. నోట్ బుక్స్, టెక్స్ట్‌బుక్స్, స్టడీమెటీరియల్, యూనిఫామ్‌లుఇంకారాలేదు. అరకొర వసతులతో ఎలా చదవడం ?గ్రామాలలో తగిన రవాణా వసతులు లేక చాలా ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతవిద్యలతో ఉద్యోగాలుపొందేఅవకాశం కలిపించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## రేషన్ కేవైసీ చేసుకోవాలి

రాష్ట్రంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ త్వరితగతిన రేషన్ కార్డులో పేరు కలిగిన అందరూ వేలిముద్ర ద్వారా ఈ కేవైసీ చేసుకోవాలి. రేషన్ కార్డు ఈ చేసుకోకపోతే రేషన్ నుండి పేరుతొలగించే అవకాశం లేకపోలేదు. కావునఅందరూ చేసుకుని పథకాలకు అర్హులుగా ఉండగలరని అధికారులు సూచిస్తున్నారు.

- ఎం. శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## సరైన నిర్ణయం కాదు!

దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక సంస్థను ఏర్పాటు చేసుకోవడానికి, అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోరడానికి, హక్కులు నిరాకరించబడినప్పుడు పోరాడేందుకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి రాజ్యాంగం అందరికీ హక్కులను కల్పించింది. అందుకే 'నీట్'సహా వివిధ పోటీ పరీక్షలలో ప్రశ్నాపత్రాలు లీక్ కుంభకోణం, అవకతవకలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరుగుతున్నాయి. నీట్ పునఃపరీక్ష కారణంగా చాలామంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. తమపిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ప్రతిరోజూ కన్నీరు కార్చుతూ ఎంతో దుర్భరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. దీనికికారణం అవినీతిమయమైన విద్యా వ్యవస్థ కేంద్ర ప్రభుత్వ బాధ్యతారాహిత్యం. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్ సమంజసమైనదే.

- దాసం వెంకటరెడ్డి, ఊరదాళ్ళపాలెం

## కరోనా నిజమేనా?

మెడికల్ మాఫియా లేక కరోనా అనేది నిజమా అని నిర్ధారణ చేసుకోలేని స్థితిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కరోనా కేసులు నమోదు గురించి సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అధికారికంగా ఆంధ్రప్రదేశ్ వైద్యఆరోగ్యశాఖ, భారత ప్రభుత్వ ఆరోగ్య మంత్రిత్వ శాఖ లేదా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గాని ఎలాంటి ప్రకటన చేయలేదు. విజన్ కలిగిన ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిముందు జాగ్రత్త చర్యగా సోషల్ డిస్టెన్స్ పాటించే విధంగా లాక్‌డౌన్ ప్రకటించకుండా మహిళల ఉచిత బస్సు సౌకర్య ప్రయాణాన్ని రద్దు చేయాలి. ముఖ్యంగా కూరగాయలు చిరు వ్యాపారస్తులు స్నానపానాలు లేకుండా బస్సులు ఎక్కి మిగతా ప్రయాణికుల ఆరోగ్యంతో ఆటలాడుకుంటూ ఉన్నారు. ఉచిత బస్సు ప్రయాణం మహిళలకు లేకుండా చేస్తే అంత రద్దీ ఉండదేమో ప్రభుత్వం ఆలోచించాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## పెరుగుతున్న పర్యావరణ సమస్యలు

వైశాల్యంలో దేశంలోనే కీలక నగరంగా ఉన్న విశాఖపట్నం నేడు తీవ్రమైన పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోంది అని పలునివేదికలు తెలియచేస్తున్నాయి. ఇప్పటికే ఉన్న కాలుష్యానికితోడు, ప్రైవేట్‌రంగంలోని పోర్టు ను ఒడి వెలువడుతున్న కాలుష్యం గాజువాక, మల్కాపురం తదితరప్రాంతాలను పూర్తిగా కమ్మేయడం వలన ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. విలీన ప్రాంతాల్లో రోడ్లు, మంచినీటి సదుపాయాలు, వీధిలైట్లు, డ్రైనేజీవ్యవస్థ నేటికీఅధ్వాన్నంగా ఉన్నాయి.

-సి. రాజేందర్ , విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# పార్లమెంటులోనూ 'నీట్' రభస

## నాల్గోరోజూ ఉభయసభల్లో ప్రతిష్టంభన

### పలుమార్లు వాయిదాలతో కొనసాగిన సభలు

### పార్లమెంటు వెలుపలా అధికార, విపక్ష ఎంపీల నిరసనలు



**న్యూఢిల్లీ,జులై 23:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా నాలుగో రోజూ విపక్షాల నిరసనల్లోనే కొనసాగాయి. నీట్ ప్రశ్నాపత్రంలీక్ వ్యవహారంపై ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో గురువారం లోక్‌సభ, రాజ్యసభల్లో పలుమార్లు అంతరాయాలు చోటుచేసుకోగా, చివరకు ఇరు సభలను శుక్రవారానికి వాయిదా వేశారు. నీట్ పేపర్ లీక్ అంశంపై చర్చకు ముందు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షం పట్టుబడుతుండగా, ప్రభుత్వం మాత్రం ఎలాంటి ముందస్తు షరతులు లేకుండానే వెంటనే చర్చకు సిద్ధమని స్పష్టం చేసింది. సభ ప్రారంభానికి ముందు పార్లమెంట్ ప్రాంగణంలో అధికార, ప్రతిపక్ష ఎంపీలు పరస్పరం నినాదాలు చేస్తూ నిరసనలు చేపట్టారు. దీంతో సభల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. లోక్‌సభ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ప్రతిపక్ష సభ్యులు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో సభ పలుమార్లు వాయిదా పడింది.ప్రశ్నోత్తరాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా సభ్యులను శాంతించాలని కోరుతూ, ప్రశ్నోత్తరాల సమయం అత్యంత ముఖ్యమని అన్నారు. అనంతరం ప్రతి అంశంపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సభ్యులందరూ ప్రశ్నోత్తరాల తర్వాత జరిగే చర్చలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తర్వాత కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు సౌగత రాయ్, మహువా మొయిత్రా తదితరులు స్పీకర్ ఓం బిర్లాను కలిసి నీట్ అంశంపై చర్చకు అవకాశం కల్పించాలని కోరారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మాట్లాడుతూ, ప్రతిపక్షమే చర్చకు ముందస్తు షరతులు విధిస్తూ సభను అడ్డుకుంటోందని ఆరోపించారు. ఈ అంశంపై ప్రభుత్వ అభిప్రాయాన్ని కూడా వెల్లడించే అవకాశం ఉండాలని చెప్పారు. సభ పలుమార్లు వాయిదా పడిన అనంతరం శుక్రవారానికి వాయిదా వేశారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాతే చర్చ ప్రారంభమవుతుందని స్పష్టం చేశారు. కిరెన్ రిజిజు మరోసారి ప్రభుత్వం వెంటనే నీట్ అంశంపై చర్చకు సిద్ధంగా ఉందని, ప్రతిపక్షం షరతులు విధించవద్దని కోరారు. రాజ్యసభ ఉపాధ్యక్షుడు హరివంశ్ కూడా సభ్యులను సభ సజావుగా సాగేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కనీసం బిల్లులపై అయినా చర్చ జరిగేలా చూడాలని ఆయన కోరినా, ప్రతిపక్ష సభ్యులు నిరసనలు కొనసాగించడంతో సభను శుక్రవారానికి వాయిదా వేశారు. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా నాలుగో రోజూ ప్రతిష్ఠంభనలోనే కొనసాగాయి.

**నీట్ ప్రశ్నాపత్రం లీక్‌పై విపక్షం ఆందోళన తీవ్రం..**

లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమికి చెందిన ఎంపీలు గురువారం ఢిల్లీలోని మహాత్మాగాంధీ స్మృతివనంకు బయలుదేరారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటన నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులకు నివాళులర్పించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విపక్షం తెలిపింది.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సోషల్ మీడియాగా స్పందిస్తూ, ఇండియా కూటమికి చెందిన ఎంపీలు, నాయకులు ప్రశాంతంగా గాంధీ స్మృతికివెళ్తున్నారు. నీట్ పేపర్ లీక్‌కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులను స్మరించడానికి, వారి కుటుంబాలకు సంఘీభావం తెలిపేందుకు మేము అక్కడికి వెళ్తున్నామని పేర్కొన్నారు.

**జంతర్‌మంతర్‌లో విద్యార్థుల ఆందోళన ఉధృతం**

చర్చలకు మేం సిద్ధమేనని కేంద్రం ముందుకువచ్చినప్పటికీ విపక్షాలతోపాటు సిజెపి ప్రతినిదులు సైతం కేంద్ర మంత్రి ధర్మేంప్రదాన్ రాజీనామాచేయాలని పట్టుబడుతు తమ నిరసనలు జంతర్‌మంతర్‌వద్ద ఉధృతంచేసారు. ఢిల్లీ పోలీసులకు విస్తృతాధికారాలు కల్పించినప్పటికీ సిజెపి కార్యకర్తలు ఎక్కడా వెనుకంజవేయలేదు. జంతర్ మంతర్‌వద్ద తమ పోరాటం న్యాయంకోసమేనని, విద్యార్థుల భవిష్యత్తుకోసమేనని చెపుతూ నిరసనలు మరింతగాపెంచారు.అలాగే సుమారుగా 16 మెట్రోస్టేషన్లు మూతపడటంతో చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్ సమస్య పరిష్కరించకుంటే తానే జోక్యం చేసుకుంటాననికూడా హెచ్చరించడం ఆందోళన తీవ్రతను తెలియజేస్తోంది.

## పేపర్ లీకేజి కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు!

### ప్రధాని నరేంద్రమోడీ



**న్యూఢిల్లీ,జులై 23:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్ 2024 కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది.

## ప్రధాని హామీ ఇచ్చినా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే!

### మోడీ ట్వీట్‌కు రాహుల్, సిజెపి కౌంటర్



**న్యూఢిల్లీ,జులై 23:** ప్రధాని హామీ ఇచ్చినా నిరసనలు తగ్గేలా లేవు. పేపర్ లీక్ బాధ్యులను శిక్షిస్తామని ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రధాని ప్రకటించారు. యువత భవిష్యత్ సంక్షేమం తమకు ముఖ్యమని ప్రధాని పేర్కొన్నారు. ఈ ప్రకటన పైన సిజెపి, రాహుల్ స్పందించారు. ప్రధాని ఎన్ని చెప్పినా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తాము వెనక్కు తగ్గబోమని తేల్చి చెప్పారు. ఇప్పుడు ప్రధాని ఏ నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తి కరంగా మారుతోంది. ప్రధాని తాజా ప్రకటనపైన కాక్రోచ్ జనతాపార్టీ, రాహుల్ గాంధీ స్పందిం చారు. ఢిల్లీ కేంద్రంగా కొనసాగుతున్న నిరసనలు తీవ్ర స్థాయికి చేరు కున్నాయి. పొరుగు రాష్ట్రాల్లోనూ విస్తరిస్తున్నాయి. కాక్రోచ్ పార్టీల నేతలతో చర్చలకు సిద్దమని కేంద్రం ప్రతిపాదించింది. అయితే, తటస్థ వేదికల్లోనే చర్చలు చేస్తామని సిజెపి ప్రతినిధులు స్పష్టం చేసారు. మోడీ సోషల్‌మీడియా ప్రకటనపై స్పందించిన రాహుల్, కాక్రోచ్‌పార్టీలు ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని చెప్పారు.

# చర్చలకు మేమంతా సిద్ధం

### మీ అనుకూల సమయం చెపితే చర్చలు జరుపుదాం

### సిజెపి ప్రతినిధులకు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ పిలుపు

**న్యూఢిల్లీ,జులై 23:** నీట్ పేపర్ లీకేజీ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో ఇంకా నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ అంశంపై సిజెపి నేతలతో చర్చించేందుకు సిద్ధమని ప్రకటించింది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ గురువారం సిజెపి నేతలను చర్చలకు ఆహ్వానించారు. పేపర్ లీకేజీ అంశంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, నీట్ యూజీ పరీక్షలో అవకతవకలపై కఠిన చర్యలు తీసుకుంటామని జితేంద్ర సింగ్ మీడియాకు తెలిపారు. సిజెపి నేతలతో చర్చించేందుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రభుత్వం ఈ విషయంలో సిద్ధంగా ఉందన్నారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా ఆఫీసు లేదా ఇంటి వద్ద ఎక్కడైనా సిజెపి నేతలకు అనుకూలమైన చోట చర్చలు జరుపుతామన్నారు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రయత్నిస్తామన్నారు. ఇది దేశంలోని విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్య అని, చర్చలకు సహకరించాలని కోరారు. నిరసన చేస్తున్న విద్యార్థుల్ని కలిసేందుకు సిద్ధమన్నారు.

చర్చల కోసం కేంద్ర ప్రభుత్వ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, విద్యార్థులకు అనువైన చోట చర్చలు జరుపుతామని స్పష్టం చేశారు. నేతల్ని, విద్యార్థుల్ని కలిసి చర్చించడం ద్వారానే దీనికి పరిష్కారం లభిస్తుందన్నారు. మరోవైపు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. తాను జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నానని, ఈ రోజు నిరసనకు హాజరు కాలేనని సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. కొన్ని గంటలు విశ్రాంతి కావాలని, కోలుకుంటానని తెలిపారు. సాయంత్రానికల్లా నిరసన వేదిక వద్దకు తిరిగి వస్తానని వెల్లడించారు. జంతర్‌మంతర్ వద్ద ఇంటర్‌నెట్ సేవల్ని ప్రభుత్వం నిలిపివేసిందని సిజెపి ఆరోపించింది.



## ఢిల్లీ పోలీసులకు ఎన్ఎస్ఎ అధికారాలిచ్చిన లెఫ్టినెంట్ గవర్నర్

**న్యూఢిల్లీ,జులై 23:** నీట్‌పరీక్షల అవకతవకలపై ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆందోళనలు ఉద్రిక్తంగా మారుతున్న సమయంలో ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఎ) కింద ప్రత్యేక అధికారాలు కల్పిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులు చర్చనీయాంశమయ్యాయి. ఇది ప్రతి మూడు నెలలకోసారి జరిగే సాధారణ పునరుద్ధరణ ప్రక్రియేనని, దీనికి కొనసాగుతున్న నిరసనలకు ఎలాంటి సంబంధం లేదని ఢిల్లీ పోలీసులు స్పష్టం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఈ నెలలో జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 2026 జులై 19 నుంచి అక్టోబర్ 18 వరకు మూడు నెలల పాటు జాతీయ భద్రతా చట్టం1980 కింద నిర్బంధ ఉత్తర్వులు జారీచేసే అధికారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు అప్పగించారు. ఈనిర్ణయంపై పలు మీడియా సంస్థలు భిన్న కథనాలు ప్రచురించాయి. సిజెపి నిరసనలను అణచివేసేందుకే ఈ అధికారాలు ఇచ్చారని వార్తలు రావడంతో ఢిల్లీ పోలీసులు నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని మీడియా సంస్థలు నివేదిస్తున్నట్లుగా, సిజెపి నిరసనలను అణిచివేసేందుకు పోలీస్ కమిషనర్‌కు ఎన్ఎస్ఎ అధికారాలు ఇచ్చారనడంలో వాస్తవంలేదు. సిజెపి నిరసనలు తీవ్రరూపం దాల్చడానికి ముందే ఈ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రత్యేకంగా ఎలాంటి అభ్యర్థన చేయలేదు. మీడియా ఈ ఉత్తర్వులను తప్పుగా అన్వయించుకుందని ఢిల్లీ పోలీసులు తమ ప్రకటనలో వివరించారు.

## సమస్య పరిష్కరించకుంటే నేనే జోక్యంచేసుకుంటా

### మెట్రోస్టేషన్ల మూసివేతపై చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,జులై 23:** దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థుల నిరసనల కారణంగా పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారం గురువారం సుప్రీంకోర్టుకు చేరింది. స్టేషన్ల మూసివేతతో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్.. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన సిజెఐ, మధ్యాహ్న భోజన విరామ సమయానికి సమస్య పరిష్కారం కాకపోతే తానే స్వయంగా జోక్యం చేసుకుంటానని హామీ ఇచ్చారు. కాక్రోచ్ జనతా పార్టీ అనే సోషల్ మీడియా వేదిక ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళనలు తీవ్రరూపం దాల్చడంతో గత కొన్ని రోజులుగా సెంట్రల్ ఢిల్లీలోని పలు మెట్రోస్టేషన్లను అధికారులు మూసివేస్తున్నారు. ఇవాళ కూడా సుప్రీంకోర్టు మెట్రో స్టేషన్‌తో సహా మొత్తం 16 స్టేషన్లలో సేవలను నిలిపివేశారు.

## నీట్ నిరసనలకు విదేశీ నిధులు

### ఢిల్లీ హైకోర్టులో పిటిషన్

**న్యూఢిల్లీ,జులై 23:** నీట్ పేపర్ లీకేజీ నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ ఢిల్లీలో చలో పార్లమెంట్ నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఆ నిరసన వెనుక భారీ కుట్ర ఉన్నట్లు ఇవాళ ఢిల్లీ హైకోర్టులో పిటీషన్ దాఖలైంది. సంసద్ చలో నిరసనల కోసం విదేశీ నిధులు అందినట్లు ఆ పిటీషన్‌లో తెలిపారు. అయితే తక్షణమే విదేశీ నిధులపై ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టాలని పిటీషన్‌లో కోరారు. శుక్రవారం ఆ పిల్‌పై విచారణ చేపట్టనున్నట్లు ఢిల్లీ హైకోర్టు చెప్పింది. చీఫ్ జస్టిస్ డీకే ఉపాధ్యాయ, జస్టిస్ తేజస్ కరియాతో కూడిన ధర్మాసనం విచారించనున్నది. అడ్వకేట్ బారున్ కుమార్ సిన్హా ఆ పిటీషన్‌పై వాదించనున్నారు. సతీశ్‌కుమార్ అగర్వాల్ ఆ పిటీషన్ ఫైల్ చేశారు.

## జంతర్‌మంతర్ నిరసనల్లో విద్రోహ శక్తులు

### ఢిల్లీ పోలీసుల సంచలన పోస్టులు

**న్యూఢిల్లీ, జులై 23:** దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలపై పోలీసులు సంచలన ఆరోపణలు చేశారు. జంతర్‌మంతర్ వద్ద కొనసాగుతున్న విద్యార్థుల నిరసనల్లో సంఘ విద్రోహ శక్తులు చొరబడుతున్నాయని ఆరోపించారు. విద్యార్థుల మధ్య దాక్కుని ఉంటూనే కొందరు వ్యక్తులు ఒక్కసారిగా రాళ్లు, వాటర్ బాటిళ్లతో తమపై దాడులకు దిగుతున్నారన్నారు. దీంతో శాంతియుతంగా కొనసాగాల్సిన నిరసనలు కాస్తా సాయంత్రమయ్యేసరికి హింసాత్మకంగా మారుతున్నాయని ఢిల్లీ పోలీసులు చెప్పారు. పోలీసుల కథనంప్రకారం పగటి వేళల్లో నిరసనకారులు కవితలు చదవడం, నినాదాలు చేయడం వంటి శాంతియుత కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సాయంత్రం అవ్వగానే భారీ సంఖ్యలో గుమిగూడుతున్నారు. కొందరైతే పోలీసులే లక్ష్యంగా రాళ్లు రువ్వడం, రోడ్లెక్కి అల్లర్లు చేస్తుండటంతో ఉద్రిక్తత నెలకొంటోందని తెలిపారు.



## మాదకద్రవ్యాల అక్రమ రవాణా

### అమెరికాలో భారతీయుడి అరెస్టు

**వాషింగ్టన్, జులై 23:** కెనడా కేంద్రంగా నేర కార్యకలాపాలకు పాల్పడుతోన్న అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఎఫ్‌బిఐ చర్యలు చేపట్టింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, పంపిణీ, ఎగుమతికి సంబంధించిన ఆరోపణలపై లారెన్స్ బిష్ణోయ్, జగ్గు భగవాన్‌పురియా, రవీందర్ ధాండా గ్యాంగ్‌లను లక్ష్యంగా చేసుకుని ఆపరేషన్ హార్డ్ బాల్ పేరుతో దాడులు నిర్వహించింది. ఇందులో భాగంగా భారత్‌కు చెందిన హర్మన్‌వీర్‌సింగ్‌ను కాలిఫోర్నియాలో అరెస్టుచేసినట్లు ఎఫ్‌బిఐ వెల్లడించింది. ఎఫ్‌బిఐ వివరాల ప్రకారం.. రవీందర్ ధాండా ముఠా అమెరికా, కెనడా, మెక్సికో దేశాలకు భారీ మొత్తంలో కొకైన్, ఇతర మాదకద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తోన్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ ముఠాలో సభ్యుడైన హర్మన్‌వీర్ సింగ్‌పై జూన్ 23న అమెరికా ఫెడరల్ కోర్టు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా అతడిని అధికారులు అరెస్టు చేశారు.

## 'నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తా'

### పోలీసు బెదరింపు వీడియో వైరల్

**న్యూఢిల్లీ, జులై 23:** నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ముంబయిలో నిరసన చేస్తున్న కొందరు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న స్థానిక పోలీసులు.. వారిపై బెదరింపులకు పాల్పడినట్లు సమాచారం. మళ్లీ నిరసనల్లో పాల్గొంటే డ్రగ్స్ కేసులో ఇరికిస్తానని ఓ పోలీసు అధికారి బెదరించడం చర్చనీయాంశమైంది. 'నిరసనల్లో మళ్లీ మీరు నాకు కనిపిస్తే డ్రగ్స్ కేసులో ఇరికిస్తా. అప్పుడు మీ జీవితం నాశనమవుతుంది. బెయిల్ కూడా రాదు. జైలులోనే మగ్గిపోవాల్సి ఉంటుంది' అని విద్యార్థులను ఉద్దేశిస్తూ పోలీసు అధికారి చెబుతున్నట్లు ఆ వీడియోలో ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోను ముంబయి కాంగ్రెస్ సోషల్ మీడియలో పోస్టు చేసింది.

# అమెరికాపై 9/11 తరహా దాడులు

## ఇరాన్ తీవ్ర హెచ్చరికలు



**టెహ్రాన్, జులై 23:** పశ్చిమాసియాలో పరిస్థితులు మరింతగా దిగజారాయి. అమెరికా-ఇరాన్ పరస్పర దాడులు, ప్రకటనలతో ఘర్షణలు తీవ్రరూపందాల్చాయి. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ ఇకనుంచి ఏదైనా నౌకపై దాడి చేసినప్పుడల్లా ఆ దేశంలోని ఓ వంతెన లేదా విద్యుత్‌కేంద్రంపై బాంబులేసామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. వాటికి ఐఆర్‌జిసి నుంచి తీవ్ర స్పందన వచ్చింది. అమెరికా 9/11 తరహా దాడి చేస్తామని బెదరించింది. ఘర్షణలు ఇలాగే కొనసాగితే ఆ దేశం జాతీయ సంతాపదినాలు చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరికలు చేసింది. ఈ మేరకు ఇరాన్ ప్రభుత్వ అనుబంధ మీడియా సంస్థ తస్నీమ్ పేర్కొంది. వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రవాదుల దాడి (2001 దాడి) అమెరికా చరిత్రలో అత్యంత విషాదకర ఘటనగా మిగిలిపోయింది. సెప్టెంబరు 11, 2001న 4 నాలుగు విమానాలను అల్‌ఖైదా ఉగ్రవాదులు హైజాక్ చేసిన సంగతి తెలిసిందే. 19 మంది ఉగ్రవాదులు నాలుగు జట్లుగా విడిపోయి 'ట్విన్ టవర్స్'గా పిలుచుకునే ప్రపంచ వాణిజ్య సంస్థ భవంతులపై దాడులకు పాల్పడ్డారు. ఈ మారణహోమంలో మొత్తం 2,996 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 వేల మంది పౌరులు క్షతగాత్రులయ్యారు. అప్పుడు అమెరికా జాతీయ సంతాప దినాలు ప్రకటించింది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూనే ఇరాన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

**మేం చమురు అమ్మకపోతే..ఇంకెవరు అమ్ముకోలేరు: ఇరాన్**

అమెరికా బలగాలు హార్ముజ్‌కు దూరంగా ఉంటేనే ఆ జలసంధి భద్రంగా ఉంటుందని ఇరాన్ స్పీకర్ మహమ్మద్ ఘాలిబఫ్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. తాము చమురు అమ్మకపోతే.. ఇంకెవరూ అమ్మలేరని వ్యాఖ్యానించారు. టెహ్రాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీసేలా దాడులు చేశామని యుఎస్ సెంట్రల్ కమాండ్ తాజాగా ప్రకటించింది.

**సౌదీ చమురు ట్యాంకర్లపై దాడి చేశాం : హూతీలు**

ఎర్ర సముద్రానికి గేట్‌వే వంటి ఎల్-మాండెట్ జలసంధిని మూసివేస్తున్నట్లు యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. సౌదీ అరేబియా నౌకల రాకపోకలను అడ్డుకుంటామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో సౌదీకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై దాడులు చేశామని తాజాగా ప్రకటించారు.

# భారత్‌ను వేలెత్తి చూపేముందు.. ఇంట గెలవండి

## పాకిస్థాన్‌కు ఐరాసలో శాశ్వత ప్రతినిధి హరీశ్ చురకలు




**న్యూయార్క్, జులై 23:** ఐక్యరాజ్య సమితి వేదికగా పాకిస్థాన్‌కు భారత్ మరోసారి గట్టి కౌంటర్ ఇచ్చింది. ఉగ్రవాదాన్ని విదేశాంగ విధానంగా ఉపయోగిస్తున్న పాక్.. అసత్య ప్రచారంతో అంతర్జాతీయ వేదికను దుర్వినియోగం చేస్తోందని మండిపడింది. జమ్మూకాశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని స్పష్టం చేసింది. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పు లేదని భారత్ తేల్చి చెప్పింది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చ సందర్భంగా పాక్ కాశ్మీర్ అంశాన్ని లేవనెత్తింది. దీంతో భారత్ శాశ్వతప్రతినిధి పర్వతనేని హరీశ్ దాయాదికి దీటుగా బదులిచ్చారు. ఈ చర్చలో ఇతర అంశాలను ప్రస్తావించడం తమ ఉద్దేశంకాదని, కానీ పాక్ తప్పుడు ప్రచారం చేసేందుకు ఈ వేదికను దుర్వి నియోగం చేస్తుందని మండిపడ్డారు. జమ్మూకాశ్మీర్ భారత్‌లో అంతర్భాగమనేది చట్టపరమైన వాస్తవమని గుర్తు చేశారు. కాశ్మీర్‌కు సంబంధించి మిగిలి ఉన్న ఏకైక సమస్య పిఒకె మాత్రమేనని స్పష్టం చేశారు. సింధూ జలాల ఒప్పందంపై తమ విధానంలో ఎలాంటి మార్పు లేదని భారత ప్రతినిధి పునరుద్ఘాటించారు. పరస్పర విశ్వాసం, సత్సంకల్పంతోనే రెండు దేశాల మధ్య సహకారం సాధ్యమవుతుందని తెలిపారు. అయితే సీమాంతర ఉగ్రదాడులకు పాల్పడుతోన్న పాక్.. ఇలాంటి ఒప్పందాల నుంచి ప్రయోజనాలను కోరుకోవడం సరికాదని దుయ్యబట్టారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను వేలెత్తిచూపుతూ నిరాధార ఆరోపణలు చేయడంమాని.. పాక్ ముందుగా తమ దేశంలోని సమస్యలను పరిష్కరించుకోవాలని హితవు పలికారు.

# కొత్త వివాదం రేకెత్తించిన ఆర్ఎఎఫ్ అధికారిణి వాఖ్యలు

## కౌంటర్ ఇచ్చిన సిజెపి



**న్యూఢిల్లీ,జులై 23:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో ఆందోళనలు చేపట్టిన విద్యార్థులపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఎఎఫ్) అధికారిణి సోనియా సెహ్రావత్ సామాజిక మాధ్యమాల్లో చేసిన వ్యాఖ్యలు పెను వివాదానికి దారితీశాయి. నిరసనకారులను ఉద్దేశించి ఆమె బొద్దింకలు అని సంబోధించడం పట్ల సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సోమవారం పార్లమెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ నిరసనల క్రమంలో బందోబస్తు విధుల్లో ఉన్న సోనియా, తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో చనిపోయిన బొద్దింక ఫొటోను షేర్ చేశారు. తమను తాము సరిదిద్దుకోలేరు కానీ, దేశాన్ని బాగుచేయాలని చూస్తున్నారంటూ దానికి ఒక వ్యాఖ్యను జతచేశారు. సోనియా పోస్ట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు రావడంతో ఆమె దానిని వెంటనే తొలగించారు. ఈ నిరసనలకు నాయకత్వం వహిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ దీనిపై ఘాటుగా స్పందించింది. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిని ఒక ఆర్ఎఎఫ్ అధికారిణి బొద్దింకలతో పోల్చడం దిగ్భ్రాంతికరం. అయినా మేం బొద్దింకలమే బొద్దింకలకు చావుండదంటూ ఎక్స్ వేదికగా కౌంటర్‌ఇచ్చింది. సర్వీస్ నిబంధనల ప్రకారం, విధుల్లో ఉన్న అధికారులు వ్యక్తిగత సోషల్ మీడియా ఖాతాలలో రాజకీయ వ్యాఖ్యలు చేయడం లేదా యూనిఫాంలో ఉన్న ఫొటోలను ప్రొఫైల్ పిక్చర్‌గా ఉంచడం నిషిద్ధం. అయితే సోనియా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో యూనిఫాంలో ఉన్న ఫొటోనే ప్రొఫైల్ పిక్చర్‌గా వినియోగించారు. హర్యానాకు చెందిన సోనియా సెహ్రావత్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో 6 లక్షల మందికి పైగా ఫాలోవర్లు ఉన్నారు. ఆమె తరచూ తన వ్యక్తిగత అభిరుచులకు సంబంధించిన బైక్ రైడింగ్, వర్కవుట్ వీడియోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటారు.

## రాహుల్‌పై వాంగ్‌చుక్ సతీమణి ధ్వజం

### రాజకీయాలకు ఉద్యమం వాడుతున్నారని ఆరోపణలు



**న్యూఢిల్లీ,జులై 23:** కాంగ్రెస్ పార్టీపై, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై పర్యావరణవేత్త, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి అంగ్మో ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చేస్తున్న ఈ ఉద్యమాన్ని రాజకీయ నేతలు వాడుకోవడంపై ఆమె విమర్శలు వ్యక్తం చేశారు. సోమవారం సిజెపి చేపట్టిన నిరసన హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. దీన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్, ప్రియాంకా వంటి నేతలు ఢిల్లీలోని ప్రధానినివాసం ఎదుట నిరసనచేపట్టారు. ఈ అంశంపై వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి స్పందించారు. రాహుల్ గాంధీ ప్రధాని నివాసం ఎదుట దీక్ష చేపట్టడం సరికాదన్నారు. విద్యార్థులు చేపడుతున్న ఈ ఉద్యమాన్ని రాజకీయ నాయకులు తమ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష నాయకులకు చిత్తశుద్ధి ఉంటే జంతర్‌మంతర్‌వద్ద విద్యార్థులు చేపట్టిన దీక్షలో పాల్గొనాలని కోరారు. కాంగ్రెస్ చేపట్టిన దీక్షలో నిజాయితీ లేదన్నారు.

## నీట్ ఆందోళనలకు చిత్రపరిశ్రమ సంఘీభావం

**చెన్నై,జులై 23:** దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై నిరసనలు వెల్లువెత్తుతున్న వేళ, ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ విద్యార్థులకు తన మద్దతు ప్రకటించారు. కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనలకు సంఘీభావం తెలుపుతూ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఆయన ఒకపోస్ట్ చేశారు. ప్రస్తుత విద్యావ్యవస్థ భ్రష్టుపట్టిందని, దేశం తన బిడ్డలను నిరాశపరిచిందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ నిరసనలకు నసీ రుద్దీన్ షా, ప్రకాశ్ రాజ్, సల్మాన్ ఖాన్, మాధవన్, షబానా అజ్మీ, రాజ్‌కుమార్ రావు వంటి పలువురు సినీ ప్రముఖులు తమ మద్దతు ప్రకటించారు. తాజాగా కమల్ హాసన్ సైతం విద్యార్థుల పక్షాన గొంతు కలపడం విశేషం.

# సమృద్ధిగా వర్షాలు కురిసి రైతన్న సుభిక్షంగా ఉండాలి



## యాదాద్రిలో వరుణయాగం.. పాల్గొన్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

### స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు

**యాదాద్రి భువనగిరి బ్యూరో, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, వ్యవసాయ రంగం పున రుజ్జీవనం పొందాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధిం చాలని ఆకాంక్షిస్తూ దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గురు వారం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదగిరికొండపైని శివాలయంలో మూడు రోజులుగా శాస్త్రోక్తంగా కొన సాగుతున్న వరుణయాగంలో పాల్గొని యాగ కార్యక్రమాలను పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వర్షా భావ పరిస్థితులు తొలగి సమృద్ధిగా వర్షాలు కురవాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న ఈ యాగంలో మంత్రి ప్రత్యేకంగా పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. మంత్రి కొండా సురేఖ యాదాద్రి చేరుకోగానే జిల్లా పోలీసు అధికారులు గౌరవవందనంతో స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు పూర్ణకుంభ స్వాగతంతో ఆలయ మర్యాదల ప్రకారం గర్భాల యానికి తీసుకెళ్లగా, అక్కడ స్వామివారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ సాగిన ఈ పూజల్లో రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, రైతాంగ సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని మంత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ వేదపండితులు మంత్రికి వేదాశీర్వచనం అందించగా, ఆలయ కార్యనిర్వహణాధికారి భవానిశంకర్ స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటం, జ్ఞాపికను అందజేశారు. అనంతరం మంత్రి యాదగిరికొండపై ఉన్న శివాలయానికి చేరుకుని వరుణయాగంలో పాల్గొన్నారు. యాగశాలలో వేదపండితులు నిర్వహిస్తున్న హోమాలు, పూజా కార్యక్రమాలను పరిశీలించి యాగకుండం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. యాగవేదికపై వేదఘోషలు, మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, గత కొంతకాలంగా రాష్ట్రంలో వర్షపాతం తగ్గడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. వర్షాభావ పరిస్థితులు తొలగి చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు నిండాలని, భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయానికి ఊతమివ్వాలని వరుణదేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రైతు పంటలు సమృద్ధిగా పండితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, ప్రజలందరి జీవనోపాధి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించి దేశానికి ఆదర్శంగా నిలవాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు.
సనాతన ధర్మ పరిరక్షణలో యాదాద్రి క్షేత్రానికి ప్రత్యేక స్థానం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజల శ్రేయస్సు, ప్రకృతి సమతుల్యత కోసం నిర్వహించే వరుణయాగాలు భారతీయ సంస్కృతిలో విశిష్ట సంప్రదాయమని అన్నారు. శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు, అర్చకులను అభినందిస్తూ, ఆలయ అధికారులు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్న తీరు ప్రశంస నీయమని పేర్కొన్నారు.మంత్రి పర్యటన నేపథ్యంలో యాదాద్రి ఆలయ పరిసరాల్లో పోలీసులు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు లక్ష్మీ నారాయణ నాయక్ దంపతులు, ఆలయ ఇఒ భవాని శంకర్, ప్రధాన అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బండ్ల గణేశ్ ఆస్తుల వేలం పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 23:** ఆస్తి వేలం వివాదంలో సినీనిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. లోన్ వ్యవహారంలో యూనియన్ బ్యాంకు చర్యలను సవాలు చేస్తూ బండ్ల గణేశ్ న్యాయస్థానంలో వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. బండ్ల గణేశ్, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తిని యూనియన్ బ్యాంక్ వేలం వేసి స్వాధీనం చేసుకోవడంపై జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైదరాబాద్‌కు చెందిన మెస్సర్స్ పరమేశ్వర్ పాలీఫామ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు యూని యన్ బ్యాంక్ అందించిన రుణాలకు గాను బండ్ల గణేశ్, ఆయన కుటుంబ సభ్యులు తమ సొంత ఆస్తులను పూచీకత్తుగా తాకట్టు పెట్టారు. కార్పొరేట్ వివాద పరిష్కార ప్రక్రియ ట్రైబ్యునల్‌లో తనఖా పెట్టిన ఆస్తిని బ్యాంక్ వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియను సవాలు చేస్తూ రుణ వసూళ్ల ట్రిబ్యునల్ (డీఆర్‌టీ)ని బండ్ల గణేశ్ ఆశ్రయించారు. వేలం ప్రక్రియను రద్దు చేసింది. స్వాధీనం చేసుకున్న ఆస్తిని తిరిగి యజమానులకు అప్పగించాలని, కొనుగోలు దారుకు సొమ్మును వడ్డీతో సహా వాపసు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై యూనియన్ బ్యాంక్ హైకోర్టును ఆశ్రయించింది. ఆ ఉత్తర్వులను కొట్టివేస్తూ యూనియన్ బ్యాంక్ చర్యను సమర్థిస్తూ తీర్పును ఇచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ గణేశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కానీ బండ్ల గణేశ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. బ్యాంక్ వేలం వేసి స్వాధీనం చేసుకోవడంపై జోక్యం చేసుకునేందుకు అత్యున్నత సుప్రీంకోర్టు నిరాకరించింది.

## నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో కోఎంప్ట్ కెటిఆర్ బినామీ సంస్థ

### ప్రభుత్వ విప్‌లు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీలో ఉన్న కోఎంప్ట్ సంస్థ, పేరు మార్చుకున్న కెటిఆర్ బినామీ సంస్థ గ్లోబరీనానే అని ప్రభుత్వ విప్‌లు బల్మూరి వెంకట్, అద్దంకి దయాకర్ ఆరోపించారు. సిఎల్పీలో గురువారం మీడియాతో మాట్లాడుతూ గ్లోబరీనా సంస్థ కెటిఆర్ బినామీ సంస్థ, పేరు మార్చి, ధర్మేంద్రప్రధాన్‌తో కేంద్రంలో టెండర్లు ఇప్పించారని అన్నారు. రాష్ట్రంలో గ్లోబరీనా రాజుల భూములను, భవనలను ఇప్పటికీ కెటిఆర్ వాడుకుంటున్నారని తెలిపారు. 2019లో టెండర్ నిబంధనలకు విరుద్ధంగా గ్లోబరీనాకు కెటిఆర్ టెండర్ కట్టబెట్టారు. అంతకుముందే జెఎన్‌టియు కాకినాడ, జెఎన్‌టియు హైదరాబాద్‌లో గ్లోబరీనా సంస్థపై కేసులు నమోదు అయ్యాయి. బ్లాక్ లిస్ట్‌లో ఉండాల్సిన ఆ సంస్థకు కెటిఆర్ మన రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు, వాల్యుయేషన్ టెండర్ అప్పగించారు. అనాడు ఆ సంస్థకు ఉన్న ఒకే ఒక అర్హత కెటిఆర్‌కు చెందిన బినామీ సంస్థ కావడమే అని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీలో కెటిఆర్ పాత్ర ఉంది, ధర్మేంద్రప్రధాన్‌కు నీట్ పేపర్ లీక్ విషయంలో కెటిఆర్ సాయం ఉంది. రెండు పార్టీలు కలిసి దేశంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ఆరోపించారు. దేశంలో విద్యార్థుల పట్ల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న దాడులను కెటిఆర్ ఎందుకు ఖండించడం లేదని అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ ప్రశ్నించారు.



ధర్నాలో నినాదాలు చేస్తున్న మహిళా నేతలు

## కేంద్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి

### తెలంగాణ ఉమెన్ అండ్ ట్రాన్స్‌జెండర్ ఒఆర్‌జిఎస్ జెఎసి నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జులై 23, ప్రభాతవార్త:** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ తక్షణమే కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని తెలంగాణ ఉమెన్స్ అండ్ ట్రాన్స్ జెండర్ ఓఆర్‌జీఎస్ జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ప్రముఖ రచయిత రమా మేల్కొటి, సామాజికవేత్త సజయ, నిలా మానిన్, అంజురావు, వసుధ, దీప్తి, పీఓడబ్ల్యూ స్వరూప, భూమిక ఆర్గనైజేషన్ సాయిరాజు, జ్యోతి, తులసి చందు తదితరులు హాజరై తమ గళం వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను సంపూర్ణంగా ప్రక్షాళన చేయాలని, మన విద్యా వ్యవస్థను ప్రపంచానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసన కార్యక్రమంలో విద్యార్థులపై పెట్టిన అక్రమకేసులను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** నీట్ పరీక్ష పేపర్ లికేజ్ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ ఖండిస్తూ గురువారం హైదరాబాద్‌లో సిపిఐ శ్రేణులు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించాయి. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో లిబర్టీ చౌరస్తా నుండి ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీలో కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి మంత్రి ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని, ప్రజావ్యతిరేక విధానాలు అనుసరిస్తున్నా ప్రధాని మోడీ రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఈ.టి.నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, బాగం హేమంత్ రావు, వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, బొమ్మగాని ప్రభాకర్, పాలమాకుల జంగయ్య, దండి సురేష్, అందోజు రవీంద్ర చారి, మంద పవన్, తాంద్ర సదానందం, కలకొండ కాంతయ్య, ఆర్.అంజయ్య నాయక్, కర్రే బిక్షపతి, ఎస్.బాలరాజు, జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనలకు బాధ్యులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో ఉద్యమాలు చేస్తున్న విద్యార్థి, యువ జనుల పట్ల అరాచకంగా వ్యవహారిస్తూ గొడ్డులను బాదినట్టుగా నడిరోడ్ల మీద కింద పడేసి తొక్కుతూ, మహిళా విద్యార్థునులపై లాఠీ చార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఇలాంటి ఘటనలపై కచ్చితంగా సుప్రీంకోర్టు, హైకోర్టులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు.సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తి యువకులను బొద్దింకలు అని సంబోధించారని గుర్తు చేస్తూ, ఇప్పుడు ఆ బొద్దింకల ఆధ్వర్యంలోనే పెద్దఎత్తున కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగిస్తున్నారన్నారు. పదవులు పట్టుకుని వేలాడుతున్న కేంద్ర విద్యాశాఖ మంత్రి, ప్రధానమంత్రి బొద్దింకలా? లేక నీట్ పేపర్ లీకేజీలపై ఉద్యమిస్తున్న యువత బొద్దింకలా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# యువత గొంతు నొక్కితే బిజెపికి రాజకీయ పతనమే

## దేశ యువత ఆశలకు ప్రతీక రాహుల్‌గాంధీ

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** విద్యార్థుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు వారి గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశ యువత ఉద్యోగాలు అడిగితే లాఠీలు ఝుళిపించడంపరీక్షల్లో పారదర్శకత కోరితే నిర్బంధాలు పెట్టడం జవాబుదారీతనం కోరితే బెదిరింపులకు పాల్పడటం ఇదే బిజెపి పాలనకు అసలు ముఖచిత్రమని ఆయన విమర్శించారు. ఢిల్లీలో జరుగుతున్న తాజా పరిణామాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో తీవ్రస్థాయిలో స్పందించారు. 'ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదని ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా అణచివేయడమే ప్రజాస్వామ్యానికి అసలైన ముప్పు' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థుల మధ్యకు వెళ్లి వారి ఆవేదనను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నిజమైన ప్రజానాయకుడిగా నిలిచారని ఆయన కొనియాడారు. అసత్య ప్రచారాలతో, విద్వేష రాజకీయాలతో, దర్యాప్తు సంస్థల భయంతో ప్రజల స్వరాన్ని శాశ్వతంగా అణచివేయలేరని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. 'విద్యార్థుల కలలను సంకెళ్లతో బంధించలేరనీ, యువత ఆశయాలను జైళ్ల గోడల మధ్య నిర్బంధించలేరనీ రాజ్యాంగాన్ని ఎవరూ ఓడించలేరని' ఆయన అన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు కేవలం అధికార మార్పు కోసం జరిగే ఎన్నికలు కావని, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, యువత భవిష్యత్తును కాపాడే ఎన్నికలుగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశానికి సమగ్ర, సమానత్వ, రాజ్యాంగబద్ధ ప్రత్యామ్నాయాన్ని అందిస్తుందన్నారు. 'ప్రజల గొంతును వినే ప్రభుత్వాలే చరిత్రలో నిలుస్తాయి. అహంకారంతో ప్రజాస్వామ్యాన్ని అణచివేయాలని చూసే ప్రభుత్వాలకు ప్రజలే తగిన తీర్పు ఇస్తారు' అని హెచ్చరించారు.

## యువతకు విదేశీ ఉపాధి కల్పనకు కెరీర్ కన్సల్ట్స్‌తో టామ్‌కామ్ ఎంఒయు

### మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త :** ప్రభుత్వం యువతకు నైతిక, పారదర్శక, సుస్థిర విదేశీ ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ కెరీర్ కన్సల్ట్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం చేసుకొందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీలు గనుల శాఖ మంత్రి, టామ్‌కామ్ చైర్మన్ డా. జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం మంత్రి సమక్షంలో టామ్‌కామ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. నిర్మల కాంతి వెస్లీ, కెరీర్ కన్సల్ట్ సిఇఒ మేనేని రోహిత్ రావు మధ్య కుది రిన ఈ అవగాహన ఒప్పందం చేసుకొన్నారు. ఎంఒయు మంత్రి మేనేని రోహిత్‌కు కాంతి వెస్లికి అధికారికంగా ఒప్పంద పత్రం అందజేసి మాట్లాడుతూ తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మరింత విస్తరించేందుకు వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, ఫిన్లాండ్, ఇటలీ, నార్వే వంటి దేశాల్లో ఉపాధి అవకాశాలు లభించేందుకు అభ్యర్థులకు నైపుణ్యాభివృద్ధి, భాషా శిక్షణ, నైతిక నియామకాలు, అంతర్జాతీయ యజమానులతో అనుసంధానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ కెరీర్ మార్గదర్శకత్వం, విదేశీ ఉపాధి సేవల్లో ప్రముఖ సంస్థ అయిన కెరీర్ కన్సల్ట్స్, టామ్‌కామ్‌తో కలిసి అభ్యర్థులను గుర్తించడం, కెరీర్ కౌన్సెలింగ్, భాషా శిక్షణ, ఇంటర్వ్యూ సిద్ధత, డాక్యుమెంటేషన్, వీసా సహాయం, విదేశీ ఉద్యోగాల్లో నియామకం, అలాగే ఉద్యోగంలో చేరిన అనంతరం అవసరమైన సహాయాన్ని అందించనుందనీ ఆయన వివరించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో, టామ్‌కామ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. నిర్మల కాంతి వెస్లీ, ఐఏఎస్ పరిపాలనా మార్గదర్శకత్వంలో టామ్‌కామ్ నైతిక నియామక విధానాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణ విదేశీ ఉపాధి వ్యవస్థను మరింత బలోపేతం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, టామ్‌కామ్ జనరల్ మేనేజర్ నాగభారతి, టామ్‌కామ్ అధికారులు షబానా, అనిల్, జపాన్ ప్రతినిధి సయూరి మత్సునో, అలాగే కెరీర్ కన్సల్ట్స్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులు దారిమళ్లిస్తే ఊరుకోం

### కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ హెచ్చరిక

**సిరిసిల్ల బ్యూరో, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం కరెంట్ బిల్లులు, సిబ్బంది జీతభత్యాలకు మళ్లించడం దుర్మార్గమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్లలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నిధుల మళ్లింపు కోసం సర్పంచులను బెదిరించి, ఒత్తిడికి గురిచేయడం నిబంధనలకు పూర్తి విరుద్ధమని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీల కరెంట్ బిల్లులు, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తన తీరు మార్చుకోకపోతే కేంద్రానికి లేఖ రాస్తామని, అవసరమైతే ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీ ఖాతాల్లోనే జమ చేసే అంశాన్ని పరిశీలిస్తామని హెచ్చరించారు. తెలంగాణలో జరుగుతున్న అంతో ఇంతో అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమ వుతోందని బండి సంజయ్ పేర్కొన్నారు. గత 12 యేళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్లు ఇచ్చినా, కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన గత రెండున్నరేళ్లుగా మున్సిపాలిటీలకు, పంచాయతీలకు నయాపైసా ఇవ్వలేదని విమర్శించారు. కేంద్రం అమృత్ 1 కింద రూ.1660 కోట్లు,



అమృత్ 2 కింద రూ.3,429 కోట్లు తెలంగాణకు కేటాయించిందని, కేంద్ర నిధులను ఏ లక్ష్యం కోసం కేటాయించారో దానికే వాడాలని, దారి మళ్లిస్తే నిధులు ఆగిపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## ఇంజినీరింగ్ రెండో విడతలో 80,167 మందికి సీట్ల కేటాయింపు

### 25లోపు ఫీజు చెల్లించి 28లోగా కాలేజీల్లో చేరాలి

**హైదరాబాద్, జులై 23,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా గురువారం రెండో విడత సీట్ల కేటాయింపు చేశారు. 80,167 మందికి సీట్లు కేటాయించగా.. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 25లోపుగా కాలేజీకి చెందిన ట్యూషన్ ఫీజును చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుందని, ఈ నెల 28లోగా కాలేజీల్లో నేరుగా చేరాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. రెండో విడత సీట్ల కేటాయింపు సమయానికి 94,424 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. వాటిలో 80,167 సీట్లను కేటాయించారు. మొత్తం సీట్లలో 84.9 శాతం సీట్లను రెండో విడతలో కేటాయించారు. ఎప్ సెట్-2026లో రెండో విడతతో కలిపి 92,192 మంది ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. వారిలో రెండో విడతలో 60,792 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం సీట్లలో 80,167 సీట్లను కేటాయించగా మరో 14,257 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొదటి విడతలో సీట్లు పొందిన విద్యార్థుల్లో 37,442 మంది ఆప్షన్లను మార్చుకోలేదు. 34,828 మంది తాము చేరిన కాలేజీలు కాకుండా ఇతర కాలేజీల్లో చేరడం కోసం ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 176 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 94,424 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. అందులో 80,167 సీట్లను రెండో విడతలో కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 6329 సీట్లను కేటాయించారు. ఒక గవర్నమెంట్ కాలేజీలో 214 సీట్లు ఉంటే 56(26.26శాతం) సీట్లను కేటాయించారు. 21 యూనివర్సిటీ కాలేజీల్లో 6437 సీట్లకుగానూ 4853 సీట్లను(75,4శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లకుగానూ 1384 సీట్లను(99.9శాతం) కేటాయించగా కేవలం ఒక్క సీటు మాత్రమే ఖాళీగా ఉంది. 152 ప్రైవేటు కాలేజీల్లో 86,387 సీట్లనుగాను 73,874 సీట్లను(85.5శాతం) కేటాయించగా.. మరో 12,513 సీట్లు ఖాళీగా ఉన్నాయి. మొత్తం కేటాయింపు చేసిన సీట్లలో కంప్యూటర్ సైన్స్‌లో 66,482 సీట్లు ఉండగా అందులో 58,364 సీట్లను కేటాయించారు. 88 శాతం సీట్లను రెండో విడతలే కేటాయించారు. ఎలాక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ విభాగంలో 18,805 సీట్లకుగానూ 15,109 సీట్లను(80శాతం) కేటాయించారు. సివిల్, మెకానికల్ ఇతర బ్రాంచ్‌లకు సంబంధించి 7918 సీట్లకుగానూ 5848 సీట్లను(74శాతం) కేటాయించారు.

# విపక్షాల తప్పుడు ప్రచారంపై జనాన్ని చైతన్యపరచండి

### కాంగ్రెసు అధికార ప్రతినిధులతో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ భేటీ

**హైదరాబాద్, జులై 23,ప్రభాతవార్త:** తెలంగాణలో గత పాలనవైఫల్యాలను సవరణ చేస్తూ ప్రజాస్వామిక పాలనతో ముందుకు తీసుకెళుతున్నామని, ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయనీ కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వాస్తవాలు తెలుసుకొనేలా చైతన్యం చేయాలని పిసిసి చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మహేశ్‌కుమార్‌గౌడ్ పార్టీ అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ ప్రజాసంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లే విధానం, ప్రతిపక్షాల విమర్శలకు వాస్తవాలతో సమాధానం ఇవ్వడం వంటి అంశాలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. పార్టీ అధికార ప్రతినిధులు మీడియా చర్చల్లో సమన్వయంతో వ్యవహరించాలని, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను స్పష్టంగా వివరించాలని సూచించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలపై పార్టీ వైఖరిని బలంగా వినిపించడంతో పాటు, వాస్తవాల ఆధారంగా ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలు, ప్రజా సమస్యలపై కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలను మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా మరింత ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణపై కూడా సమావేశంలో చర్చించారు. సమావేశంలో పార్టీ అధికార ప్రతినిధులు, మీడియా విభాగం ప్రతినిధులు ఇతర ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

# కరవు ముప్పుపై హైఅలర్ట్

### వరి వద్దు.. ఆరుతడి పంటలే మేలు

### మూడు జిల్లాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష




మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జులై 23, ప్రభాతవార్త:** ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను ముందుగానే ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికా రులు సమన్వయంతో పనిచేయాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. గురువారం హుస్నాబాద్ ఇంటిగ్రేటెడ్ ఆఫీసర్ కాంప్లెక్స్‌లో సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ పీఠభూమి ప్రాంతం కావడంతో సాధారణ పరిస్థితుల్లోనే వర్షాల కొరత ఉంటుందని, ఈసారి ఎల్‌నినో ప్రభావం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున సమస్యలు రాకముందే అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వచ్చే యేడాది జూన్ వరకు తగిన వర్షపాతం ఉండకపోవచ్చని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ప్రతిశాఖ ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ రూపొందించి సమన్వ యంతో అమలు చేయాలని ఆదేశించారు. కరవు తీవ్రత పెరిగితే తాగునీరు, సాగునీరు, పశుగ్రాసంపై తీవ్ర ప్రభావం పడుతుందని, రైతులు వరి సాగుకు దూరంగా ఉండాలని, మొక్కజొన్న, కందులు, పప్పుదినుసులు, చిరుధాన్యాలు వంటి ఆరుతడి పంటల సాగు వైపు మళ్లాలని సూచించారు.
మార్కెట్ అవకాశాలు ఉన్నందున కూరగాయల సాగును కూడా ప్రోత్సహించాలని సూచించారు. మూడు జిల్లాల్లో తాగునీటి సమస్య రాకుండా అందుబాటులో ఉన్న నీటి వనరులను ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని, ఎల్‌ఎండీ నుంచి హుస్నాబాద్ నియోజకవర్గానికి నిరంతర తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామపంచాయతీలు, విద్యుత్ శాఖ సమన్వయంతో విద్యుత్ పొదుపుపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు అర్హులైన రైతులకు పాడిపశువుల యూనిట్లు అందిస్తామని, పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినోను జాతీయ విపత్తుగా గుర్తించే అం శాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు చర్యలు చేపడతామని వెల్లడించారు. అభివృద్ధి పనులపైనా మంత్రి సమీక్ష నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల, 250 పడకల ఆసుపత్రి, పీజీ మెడికల్ కళాశాల, కరీంనగర్-హుస్నాబాద్ ఫోర్‌లైన్ రహదారి, అక్కన్నపేట-హుస్నాబాద్ రహదారి విస్తరణ, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తయితేనే నియోజకవర్గంలోని పంట పొలాలకు శాశ్వత సాగునీరు అందుతుందని, కాలువల భూసేకరణకు రూ.250 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు. హుస్నాబాద్‌లో 3 వేల ఎకరాల్లో అర్బన్ ఫారెస్ట్ పార్క్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, భైరవస్వామి ఆలయం, సర్వాయి పాపన్న కోట, మహాసముద్రం గండి ప్రాంతాలను అనుసంధానిస్తూ పర్యాటక అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక, రెవెన్యూ, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, మిషన్ భగీరథ, గ్రౌండ్ వాటర్, పంచాయతీరాజ్, ప్రణాళిక, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగి తొలగింపుపై టెక్ మహీంద్రా ఎదుట ధర్నా

**హైదరాబాద్ (దుండిగల్), జులై 23, ప్రభాతవార్త :** దుండిగల్ సర్కిల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో ఉన్న టెక్ మహీంద్రా సంస్థలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగిని విధుల నుంచి తొలగించారంటూ సంస్థ యాజమాన్యంపై ఆరోపణలు చేస్తూ సదరు ఉద్యోగి సంస్థ ప్రధాన గేటు ఎదుట గురువారం నిరసనకు దిగారు. తనను అన్యాయంగా వేధించి ఉద్యోగం నుంచి తొలగించారని ఆరోపిస్తూ బాధితురాలు భావన మీడియాతో మాట్లాడారు. భావన తెలిపిన వివరాల ప్రకారం తన కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుండటంతో సిక్ లీవ్ తీసుకోవాల్సి వచ్చిందని, దీనికి సంబంధించి ముందస్తుగా యాజమాన్యానికి సమాచారం ఇచ్చినప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోకుండా తనపై ఉద్దేశపూర్వకంగా వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను వివరించినప్పటికీ విధులకు హాజరుకావాలంటూ వరుసగా ఈమెయిల్లు పంపారని, అనంతరం ఎలాంటి న్యాయసమ్మత కారణం లేకుండానే ఉద్యోగం నుంచి తొలగించారని వాపోయారు. ఈ ఘటనపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో యాజమాన్యంపై ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.



## ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం: కె.కేశవరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై23:** ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి.. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆ గుర్తింపు కమిటీ ఛైర్మన్ కె. కేశవరావు వెల్లడించారు. గురువారం అమరవీరుల స్మారక చిహ్నం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 16 రోజులు వివిధ సంఘాలతో చర్చించామని వివరించారు. ఉద్యమకారులను ఎలా ఎంపిక చేయాలి? ఎలా గౌరవించాలి అనే దానిపై అన్ని పార్టీల నుంచి అభిప్రాయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని పార్టీలు స్వాగతించాయని తెలిపారు. సంఘాల నుంచి వచ్చిన సూచనలను ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. ఈ చర్చలకు 13 వేల మంది హాజరయ్యారని వివరించారు. దాదాపు వెయ్యి మంది సూచనలు చేశారని చెప్పారు. అయితే ఈ సమావేశాలు ముగియలేదని అన్నారు. వీటిపై ఆన్‌లైన్‌లో అభిప్రాయాలు కూడా తీసుకుంటామని తెలిపారు. అందుకు సంబంధించిన తేదీలు ప్రకటించి.. ఉద్యమకారులు, సంఘాల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. ఉద్యమకారులకు తగిన గౌరవం దక్కేలా ఈ కమిటీ పని చేస్తుందని ఛైర్మన్ కేశవరావు వివరించారు. త్వరలో వివిధ జిల్లాల్లో పర్యటించి.. ఉద్యమకారులు, సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. అందుకు సంబంధించిన భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని చెప్పారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను గౌరవిస్తామని తెలిపారు. ఆయనను కూడా ఈ చర్చలకు ఆహ్వానిస్తామని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడా సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిసెంబర్‌లోపే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ దయాకర్ వివరించారు.

## హీరో బాలకృష్ణ మోకాలి ఆపరేషన్ సక్సెస్

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త :** టాలీవుడ్ అగ్ర నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు మోకాలి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైంది. ఆయనకు హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు మూడు గంటల పాటు కొనసాగిన ఈ శస్త్రచికిత్స ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా పూర్తయినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. బాలకృష్ణ ఎడమ మోకాలిలోని కార్టిలేజ్ టెండన్ గాయానిని నయం చేసేందుకు ఈ శస్త్రచికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. ఆపరేషన్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వెల్లడించారు. కాకినాడ పోర్ట్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న ఎన్‌బికె 111 సినిమా చిత్రీకరణలో ఒక భారీ యాక్షన్ సీన్ చేస్తుండగా బాలయ్య మోకాలికి తీవ్ర గాయమైన సంగతి తెలిసిందే. ప్రాథమిక చికిత్స అనంతరం ఆయన ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. ప్రస్తుతం బాలకృష్ణ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, శస్త్రచికిత్స అనంతర వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఏఐజీ ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. బాలకృష్ణ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు

## భవనం పైనుంచి దూకి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య



మబ్బు విష్ణువర్ధన్‌రెడ్డి

**హైదరాబాద్ (నార్సింగి), జులై 23, ప్రభాతవార్త :** భవనం పైనుంచి దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... గండిపేట మండలం పుప్పాలగూడ ప్రాంతానికి చెందిన మబ్బు విష్ణువర్ధన్‌రెడ్డి(27) నానక్‌రాంగూడలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. విష్ణువర్ధన్‌రెడ్డి ఎప్పటిలాగే ఈ నెల 22వ తేదీ రాత్రి కంపెనీలో పని ముగిం చుకొని ఇంటికి వచ్చాడు. 23న తెల్లవారు ఝామున అపార్టుమెంట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో అపస్మారక స్థితిలో పడి ఉండడంను కుటుంబ సభ్యులు గుర్తించారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడి వద్దకు వెళ్లి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. పని ఒత్తిడి కారణంగా అపార్టుమెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక ప్రమాదవశాత్తు కిందపడ్డాడా? అన్నది దర్యాప్తులో తేలుతుందని పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

## నేటి నుంచి పాలిటెక్నిక్ కాలేజీల్లో డి.ఫార్మసీలో అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

**హైదరాబాద్, జులై 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల్లో రెండేళ్ల డిప్లొమా ఇన్ ఫార్మసీ (డి.ఫార్మసీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి డి ఫార్మసీలో ప్రవేశం కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు సాంకేతిక విద్యా మండలి కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డి.ఫార్మసీలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇంటర్మీడియట్ పరీక్షలో ఎంపీసీ, బైపీసీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ 12 సంవత్సరాల ఉన్నత మాధ్యమిక విద్యా బోర్డు పరీక్ష (రెగ్యులర్ స్ట్రీమ్ మాత్రమే), ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ) న్యూఢిల్లీచే ఆమోదించబడిన దానికి సమానమైన గుర్తింపు పొందిన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని ప్రకటించారు. నేటి(శుక్రవారం) నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు.

## నేడు బిఆర్ఎస్‌వి తలపెట్టిన నిరసనకు పోలీసుల అనుమతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై23:** శుక్రవారం బీఆర్ఎస్‌వీ తలపెట్టిన నిరసనకు పోలీసుల అనుమతి ఇచ్చారు. రేపు ఇందిరాపార్క్ వద్ద ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అనుమతి ఇచ్చారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జిని ఖండిస్తూ బీఆర్ఎస్‌వీ నిరసన చేపట్టనుంది. నిరసనలో కేటీఆర్, ఇతర నేతలు పాల్గొననున్నారు.

## పావురం వ్యర్థాల వల్ల ఆరోగ్య సమస్యలు

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై23:** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో పావురాలకు విచ్చలవిడిగా ఆహారం వేయడం వల్ల ప్రజారోగ్యం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్న అంశంపై తెలంగాణ హైకోర్టు కీలకంగా స్పందించింది. ఈ సమస్యను నియంత్రించేందుకు ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నాయో మూడు వారాల్లో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. గురువారం ఈ అంశంపై ప్రజాప్రయోజన పిటీషన్‌ను విచారించిన ధర్మాసనం సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు చేసింది. ముషీరాబాద్‌కు చెందిన డాక్టర్ రాధేశ్యాం ఉపాధ్యాయ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని నివాస ప్రాంతాలు, ప్రభుత్వ ఆస్పత్రులు, చారిత్రక కట్టడాల వద్ద పెద్ద ఎత్తున పావురాలకు ఆహారం వేయడం వల్ల పావురాల సంఖ్య విపరీతంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. దీంతో పావురాల విసర్జన కారణంగా పరిసరాలు అపరిశుభ్రంగా మారడమే కాకుండా ప్రజారోగ్యానికి కూడా ముప్పు ఏర్పడుతోందని పిటిషన్‌లో వివరించారు. ఈ వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. అనిల్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. వాదనలు విన్న అనంతరం తెలంగాణ ప్రభుత్వం, జీహెచ్ఎంసీ ఈ సమస్యపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను మూడు వారాల్లో కౌంటర్ రూపంలో సమర్పించాలని ఆదేశించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

# వచ్చే నెలలోనూ ఎల్‌నినో ప్రభావం

### రైతులు వరి సాగుపై పునరాలోచించాలి

### 23 జిల్లాల్లో లోటు వర్షపాతం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వచ్చే నెలలో కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగనున్నాయని, సెప్టెంబర్ నాటికి దాని తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఇది డిసెంబర్ నాటికి తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే సూచనలు ఉన్నాయన్నారు. హైదరాబాద్ సచివాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఖరీఫ్‌తో పాటు, రబీ సీజన్‌పై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఎగువ రాష్ట్రాల్లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాకపోవడంతో అక్కడి నుంచి గోదావరి, కృష్ణా నదులకు పెద్దఎత్తున వరదలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని, ఒకటి రెండు జిల్లాలు మినహా ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు. గత రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగు చేయాలని నిర్ణయించుకోవద్దని స్పష్టం చేశారు. భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్నాయని, బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దని సూచించారు. మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి ఉందని, ప్రతి జిల్లాలోని ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వ సామర్థ్యంపై మండలాల వారీగా రైతులకు నిరంతరం సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత సీజన్‌తో పోల్చితే ఈ సారి దాదాపు 23 శాతం మేర సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి మండలానికి, ప్రతి గ్రామానికి కూడా ప్రత్యేక అధికారులను నియమించే అంశంపై చర్చించలేన్నారు. ఈ సంవత్సరం 58 వేల కోట్ల రుణాన్ని లక్ష్యంగా పెట్టుకొని, ఇప్పటి వరకు 20 వేల కోట్లు రైతులకు రుణాలుగా అందించామని వివరించారు. నాబార్డు అందించే 498 కోట్లను తెప్పుకునేవిధంగా ప్రణాళికలు సిద్ధం చేసి ఫైనాన్స్ డిపార్ట్ మెంట్ కి అందించాలని తెలిపారు. డ్రిప్ పరికరాలు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైతే రైతు వేదికలను విత్తనాల పంపిణీ కేంద్రాలుగా వినియోగించాలని సూచించారు. అవసరమైతే నేషనల్ సీడ్ కార్పొరేషన్ నుంచి విత్తనాలు తెప్పించాలని, ఆ సంస్థ విత్తనాలపై 50 శాతం వరకు సబ్సిడీ అందించే అంశంతో కేంద్రంతో చర్చించాలని సూచించారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు, ఎరువులు రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని చెప్పారు. పశుగ్రాసం, పశువైద్య సేవలను సిద్ధంగా ఉంచడం, జిల్లా, మండల స్థాయిలో పర్యవేక్షణ కమిటీలు, కంట్రోల్ రూములు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్రమోహన్, డైరెక్టర్ బి. గోపి తదితరులు పాల్గొన్నారు.

## రూ.లక్ష కోట్లు ముంచిన కెసిఆర్‌ను కాపాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

### నిజామాబాద్ ఎంపి ధర్మపురి విమర్శలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 23:** తెలంగాణలో సాగు, తాగు, థర్మల్ పవర్ ప్లాంట్లకు నీరు అందడం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పేర్కొన్నారు.రూ. లక్ష కోట్లు ముంచిన కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి కాపాడుతున్నాడని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్, కేటీఆర్ దోచుకున్న పైసలను ప్రస్తుతం వారి నుంచి సీఎం రేవంత్ దోచుకుంటున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబం వద్ద సీఎం రేవంత్ రెడ్డి ఎంత తీసుకున్నాడ? ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి ఎంత ఇచ్చాడు అని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రశ్నించారు. గురువారం న్యూఢిల్లీలో బీజేపీ ఎంపీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సంపద లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును ఏం చేద్దామనుకుంటున్నారని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అవినీతి చేసినవారు, ప్రస్తుతం కాపాడే వ్యక్తి బాగానే ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కానీ మధ్యలో రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. 2023లోనే కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని వివరించారు. 2019లోనే మూడు బ్యారేజీల వద్ద పనులు ప్రారంభించిన వెంటనే పగుళ్లు వచ్చాయని పేర్కొందని తెలిపారు. 2023, అక్టోబర్‌లో మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లు ఇసుక కారణంగా కుంగిపోయాయని ఎన్డీఎస్ఏ వివరించిందని అన్నారు. డీపీఆర్ అనుమతులు లేకుండానే కాళేశ్వరం నిర్మించారని విమర్శించారు. ఈ బ్యారేజీలను ముందస్తు ప్రణాళిక ప్రకారం కాకుండా వేరే చోట నిర్మించారని ఆరోపించారు. కాంట్రాక్టర్లకు కమీషన్లు ఇవ్వాలనే ఆతృతతో ఆగం ఆగంగా నిర్మించారని తెలిపారు.డిజైన్లు ఎందుకు మార్చారు.

అందుకు సంబంధించిన ఫైళ్లు అడిగితే జవాబు ఇవ్వలేదని బీజేపీ ఎంపీ మండిపడ్డారు. అన్నారం, సుందిళ్ల కూడా మేడిగడ్డ మాదిరిగానే ఉన్నాయని అన్నారు. మూడు బ్యారేజీలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన చోట తిరిగి రిపేర్లు చేయాలని ఎన్డీఎస్ఏ సూచించిందని వివరించారు.కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ఈ 30 నెలలుగా సీఎం రేవంత్ రెడ్డి ఏం చేసిందని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం సీబీఐ విచారణకు ఎందుకు ఇవ్వలేదని తెలంగాణ సీఎంను ఈ సందర్భంగా ఆయన సూటిగా ప్రశ్నించారు. రూ.30 వేల కోట్ల విలువైన పనులు జరిగిన తర్వాత ఎన్డీఎస్ఏ దగ్గరకు వచ్చారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో రూ. లక్ష కోట్లు నీళ్లలో పోయాయని కేంద్ర జలశక్తి మంత్రి పార్లమెంట్‌లో చెప్పారని గుర్తు చేశారు.

# ఇరాన్‌పై యుద్ధం తక్షణమే నిలిపివేయాలి

### అధ్యక్షుడు ట్రంప్‌ను ఆదేశించిన అమెరికా ప్రతినిధుల సభ

### డెమొక్రాట్ల తీర్మానానికి మద్దతుగా మరో నలుగురు

### రిపబ్లికన్లు కూడా తీర్మానానికి మద్దతు





**వాషింగ్టన్, జులై 23:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై కొనసాగిస్తున్న సైనిక చర్యలను వెంటనే నిలిపివేయాలని అమెరికా ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) గురువారం తీర్మానం ఆమోదించింది. ట్రంప్ ప్రభుత్వ ఇరాన్ విధానంపై కాంగ్రెస్ నుంచి వచ్చిన అత్యంత గట్టి రాజకీయ సవాళ్లలో ఇది ఒకటిగా భావిస్తున్నారు. ఈ తీర్మానానికి నలుగురు రిపబ్లికన్ పార్టీ సభ్యులు తమ పార్టీ వైఖరికి భిన్నంగా డెమోక్రాట్లకు మద్దతు ఇవ్వడంతో అవసరమైన మెజారిటీ లభించింది. దీంతో ట్రంప్ ప్రభుత్వం చేపడుతున్న ఇరాన్ సైనిక చర్యలపై కాంగ్రెస్‌లో ద్వైపాక్షిక ఆందోళన వ్యక్తమైనట్లు స్పష్టమైంది. యుద్ధాధికారాలపై కాంగ్రెస్ జోక్యంఈ తీర్మానాన్ని అమెరికా వార్ పవర్స్ చట్టం కింద ప్రవేశపెట్టారు. ఈ చట్టం ప్రకారం యుద్ధానికి సంబంధించిన కీలక నిర్ణయాల్లో కాంగ్రెస్‌కు రాజ్యాంగబద్ధమైన అధికారం ఉంటుంది. తీర్మానానికి మద్దతు తెలిపిన సభ్యులు మాట్లాడుతూ, కాంగ్రెస్ అనుమతి లేకుండానే ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై సైనిక చర్యలను పెంచిందని ఆరోపించారు. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాల్లో కాంగ్రెస్ తన అధికారాన్ని తిరిగి వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.

**నలుగురు రిపబ్లికన్ల తిరుగుబాటు**

ఈ ఓటింగ్‌లో నలుగురు రిపబ్లికన్ సభ్యులు పార్టీ విప్‌ను ధిక్కరించి డెమోక్రాట్లకు మద్దతు ఇవ్వడం విశేషంగా మారింది. ఇరాన్‌తో దీర్ఘకాలిక యుద్ధం కొనసాగితే ఆర్థిక, రాజకీయ పరమైన భారం పెరుగుతుందనే ఆందోళన కొంతమంది రిపబ్లికన్ నేతల్లో కూడా ఉందని ఈ పరిణామం సూచిస్తోంది. ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరగడం, ప్రపంచ నౌకాయాన మార్గాల్లో అంతరాయాలు ఏర్పడటం, మధ్యప్రాచ్యంలో పరిస్థితులు మరింత ఉద్రిక్తమయ్యే ప్రమాదంపై ట్రంప్ ప్రభుత్వానికి రెండు ప్రధాన పార్టీల నుంచీ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**తీర్మానం వల్ల ఏమవుతుంది?**

ఈ తీర్మానం ప్రకారం, కాంగ్రెస్ నుంచి స్పష్టమైన అనుమతి లభించని పక్షంలో ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా సైనిక చర్యలను అధ్యక్షుడు నిలిపివేయాలని ఆదేశిస్తుంది. ఈ తీర్మానం ఆమోదం పొందిన వెంటనే సైనిక చర్యలు ఆగిపోవు. దీనికి చట్టబద్ధమైన అమలు జరగాలంటే సెనేట్ కూడా దీనిని ఆమోదించాలి. ఆ తర్వాత అధ్యక్షుడి స్పందన కూడా కీలకంగా మారుతుంది. వైట్ హౌస్ మాత్రం ఇరాన్‌పై కొనసాగుతున్న సైనిక చర్యలను సమర్థిస్తోంది.

# పేదలకు ఉచితంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 23:** ఇందిరాగాంధీ గరీబీ హఠావో నినాదం మాటలకే పరిమితం అయిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బిఆర్ఎస్ హయాంలో ఉచితంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 6 లక్షలు తీసుకుని సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెబుతోందని చెప్పారు. సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎట్టి పరిస్థితుల్లో పేదలు అంగీకరించమని తేల్చిచెప్పారు. ఎన్నికల మేనిఫెస్టో చెప్పినట్లుగా పేదలకు ఉచితంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.తమ విజ్ఞప్తిని అంగీకరిస్తే సిఎం రేవంత్ రెడ్డికి సన్మానం చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ వచ్చి 30 నెలలు అయినా హైదరాబాద్ నగరంలో ఒక్క ఇల్లు నిర్మించలేదు..కానీ, సిఎం మాత్రం ప్యాలెస్‌లు కట్టుకుంటున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ళు కడతామని మంత్రులు హడావుడి చేస్తున్నారని పేర్కొన్నారు. భారీ హోర్డింగ్‌లు, ప్రకటనలు ఇస్తూ ప్రచారం చేస్తున్నారని అన్నారు.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద గురువారం బిఆర్ఎస్ ఎంఎల్ఎలు కె.పి.వివేకానంద, మాధవరం కృష్ణా రావు,ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సిలు శంభీపూర్ రాజు, దాసోజు శ్రవణ్, సురభి వాణీదేవిలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్ నగరంలో బిఆర్ఎస్ హయాంలో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు నిర్మించామని తెలిపారు. పేదరికంతో ఆర్థిక ఇబ్బందుల్లో వారి నుంచి రూ.6 లక్షలు తీసుకుని ఇళ్లు ఇవ్వడం ఏంటి అని ప్రశ్నించారు. ప్రభుత్వం బోగస్ మాటలు మాట్లాడుతోందని మండిపడ్డారు.

### హైదరాబాద్‌లో ఆగస్టు 28 నుంచి 30 వరకు

# క్రెడాయ్ ప్రాపర్టీ షో 2026





**హైదరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** భారతదేశంలోని ప్రైవేట్ రియల్ ఎస్టేట్ డెవలపర్ల అత్యున్నత సంస్థ క్రెడాయ్ హైదరాబాద్‌లో ఆగస్టు 28 నుండి 30 వరకు హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రాపర్టీ షో 2026ని నిర్వహించనున్నట్లు గురువారం ప్రకటించింది. “రేటు ఆగదు- డిమాండ్ తగ్గదు నినాదంతో ప్రాపర్టీ షోను నిర్వహిస్తున్నట్టు వెల్లడించింది. కొనుగోలుదారుల విశ్వాసం, నిరంతర డిమాండ్ స్థిరమైన ధరల పెరుగుదలకు మద్దతునిస్తాయని, హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి, నగరాన్ని తమ శాశ్వత నివాసంగా మార్చుకోవడానికి, గృహ కొనుగోలుదారులకు నమ్మకం, భరోసాతో కూడిన పిలుపునిస్తూ, వారిని శక్తివంతం చేయాలనే నిబద్ధతను ప్రతిబింబించే శక్తివంతమైన సందేశం ఇదన్నారు. ప్రపంచ పోకడలు మారుతున్నప్పటికీ, హైదరాబాద్ యొక్క పటిష్టమైన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగం, విశిష్టమైన జీవన ప్రమాణాలు ఆస్తుల విలువలను ముందుకు నడిపిస్తున్నాయని, ఎన్నటికీ జరగని మార్కెట్ పతనం ఎదురుచూడకుండా కొనుగోలుదారులను ఇప్పుడే కొనుగోలు చేయమని క్రెడాయ్ ప్రోత్సహిస్తోందని, నగరంతో పాటే వృద్ధి చెందే ఆస్తులను సొంతం చేసుకోమని కోరుతుంది. దీర్ఘకాలిక గృహ యాజమాన్య భద్రత, అభివృద్ధి జీవన నాణ్యతను అందించే స్థిరమైన, అవకాశాలతో భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న మహానగరంగా హైదరాబాద్ పరిణామాన్ని ఈ ఇతివృత్తం ప్రతిబింబిస్తుందని క్రెడాయ్ పేర్కొంది. క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎన్. జైదీప్ రెడ్డి, ప్రెసిడెంట్‌ఎలెక్ట్ బి. జగన్నాథరావులతో సహా సీనియర్ క్రెడాయ్ హైదరాబాద్ నాయకత్వం ఈ క్రెడాయ్ హైదరాబాద్ ప్రాపర్టీ షో గురించి గురువారం ప్రకటించింది. ఈ సందర్భంగా క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ ఎన్. జైదీప్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాపర్టీ ధరలు తగ్గుముఖం పడతాయనే ఆశతో కొనుగోలుదారులు ఎదురుచూడడం మనం తరచుగా చూస్తుంటాం కానీ హైదరాబాద్‌లో వాస్తవికత ఏమిటంటే, మన మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరిస్తున్నాయని, నాణ్యమైన స్థలాలకు డిమాండ్ గణనీయంగా పెరుగుతుందన్నారు. రేట్ ఆగదు, డిమాండ్ తగ్గదు అనే విధంగా నగరంలో ఆర్థిక సత్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఇక్కడ ఆస్తి విలువలు నగరం అద్భుతమైన వృద్ధికి నేరుగా ముడిపడి ఉంటాయన్నారు. రానున్న ఆగస్టులో అత్యుత్తమమైన రెరా ఆమోదిత ప్రాజెక్ట్‌లను ఒకే చోటకు తీసుకురావడం ద్వారా, కుటుంబాలు ఇక వేచి చూడకుండా, ముందడుగు వేసి ఈరోజే తమ సురక్షి తమైన భవిష్యత్తులో పెట్టుబడి పెట్టేలా వారికి ఆత్మవిశ్వాసం కల్పించాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు.

## రెడ్కో డిఇ వెంకటరమణ చంచల్‌గూడ జైలుకు తరలింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై23:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెడ్కో డిఇ ముత్యం వెంకటరమణకు నాంపల్లి ఎసిబి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా, ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆరున్నర దశాబ్దాల చరిత్రలో ఎసిబి తొలిసారి అతి ఖరీదైన అవినీతి తిమింగలాన్ని పట్టుకొంది. రెడ్కోకో డీఈగా పనిచేస్తున్న వెంకటరమణ నివాసాలలో ఎసిబి అధికారులు బుధవారం సోదాలు నిర్వహించిన సంగతి విదితమే. ఆయనతో పాటు బంధువుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. తనిఖీల సమయంలో వెంకటరమణ భారీగా అక్రమాస్తులు సంపాదించినట్లు గుర్తించారు. 7 ప్రాంతాల్లో ఏకకాల దాడుల్లో భారీగా నగదు, ఆస్తి పత్రాలు, 2.09 కేజీల బంగారం, బ్యాంకు బ్యాలెన్స్‌లు, వాణిజ్య భవనాలు, ఫ్లాట్లను ఎసిబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తన భార్య పేరిట పలు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, అనేక భవ నాలు, ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు. మొత్తం ఆస్తుల విలువ రూ.400 కోట్లకు పైగా ఉంటుందని ఎసిబి అధికారులు తాజాగా అంచనా వేశారు. బుధవారం రెడ్కో డిఇ ముత్యం వెంకటరమణను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు గురువారం ఉదయం నాంపల్లిలోని ఎసిబి కోర్టులో హాజరుపర్చారు. న్యాయమూర్తి అతడికి 14 రోజులపాటు రిమాండ్ విధించారు. దీంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. . ఎస్‌పీడీసీఎల్‌లో పని చేస్తున్నప్పుడు 2019లో రూ.25,000 లంచం తీసుకుంటూ రమణ గతంలో రెడ్‌హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. ఆ కేసు ఇంకా విచారణ దశలోనే ఉండగా, తాజాగా ఎసిబి జరిపిన దాడుల్లో రూ.28.14 కోట్ల (రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం) అక్రమ ఆస్తులు బయట పడ్డాయి. ఇది గతంలో ఆర్అండ్‌బీ ఈఎన్‌సీకి సంబంధించి నమోదైన రూ.17.94 కోట్ల రికార్డును అధిగమించింది. కాగా డిఇ ఆస్తులు బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం రూ.400 కోట్లకు పైగా ఉంటాయనేది ఎసిబి అధికారుల అంచనాగా ఉంది.



ముత్యం వెంకటరమణ

## జల్‌శక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌తో రాష్ట్ర బిజెపి ఎంపిల భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై23:** రాష్ట్ర బిజెపి ఎంపీలు కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిశారు. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో సిఆర్ పాటిల్‌తో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా ఉన్నారు. రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులు, కాళేశ్వరం అంశాలపై వీరి మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం.బుల్లెట్ ట్రైన్‌కు జహీరాబాద్ స్టాప్ ఇవ్వాలి: కేంద్ర మంత్రిని కలిసిన బిఆర్ఎస్ బృందం ప్రతిపాదిత హైదరాబాద్-ముంబాయి హైస్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) మార్గంలో జహీరాబాద్ స్టేషన్ ను చేర్చడంతో పాటు స్టాప్ కూడా మంజూరు చేయాల్సిందిగా రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు భారత రాష్ట్ర సమితి విజ్ఞప్తి చేసింది.బుల్లెట్ ట్రైన్ కారిడార్‌కు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)లో తెలంగాణలోని జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను చేర్చుతూ స్టాప్ మంజూరు చేయాల్సిన ఆవశ్యకత,అవసరాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యాన ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్,కే.మాణిక్ రావు, మెదక్ డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎం.శివకుమార్ లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు వివరించారు.పార్లమెంట్ ప్రాంగణంలోని ఛాంబర్ లో గురువారం వారు రైల్వే మంత్రితో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా వారు దేశంలో ప్రపంచ స్థాయి రవాణా వ్యవస్థలు, పారిశ్రామిక కారిడార్లు, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ లు, తయారీ రంగం ద్వారా మౌలిక సదుపాయాలను విప్లవాత్మకంగా అభివృద్ధి చేస్తున్న కేంద్ర ప్రభుత్వ దూరదృష్టిని అభినందించారు. ప్రతిపాదిత హైదరాబాద్-ముంబాయి హైస్పీడ్ రైలు కారిడార్ దేశ ఆర్థిక సమగ్రత, పారిశ్రామికాభివృద్ధి, ప్రాంతీయ అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసే జాతీయ ప్రాజెక్ట్ అని మంత్రికి అందజేసిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

## విదేశీ కుట్రలు, విచ్ఛిన్నకర శక్తులతో దేశంలో అలజడులకు కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల కుట్ర

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 23:** దేశంలో అశాంతిని సృష్టించి, యువతను రెచ్చగొట్టడం ద్వారా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని దెబ్బతీయడానికి కాంగ్రెస్, వామపక్షాలు మరియు విదేశీ విచ్ఛిన్నకర శక్తులు పెద్ద ఎత్తున కుట్ర పన్నుతున్నాయని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్ తరహాలో భారతదేశంలో కూడా అశాంతిని, హింసను సృష్టించేందుకు కొన్ని అల్ట్రాలెఫ్ట్, సాఫ్ట్‌లెఫ్ట్ శక్తులు, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏఎస్ఏ వంటి పాత సంఘాల నాయకులు కొత్త పేర్లతో “కాక్రోచ్ జనతా పార్టీ“ వంటి వేదికలను ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు. పుణే, ముంబై, హైదరాబాద్ మరియు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన కార్యక్రమాల వెనుక ఈ దేశ వ్యతిరేక శక్తుల హస్తం ఉందన్నారు. ఈ ఉద్యమాలకు ఖలిస్తాన్ శక్తుల నుంచి రూ. 10 కోట్లు, కతార్, కెనడా, పాకిస్తాన్ మరియు బంగ్లాదేశ్ ల నుంచి ఆర్థిక, వ్యూహాత్మక మద్దతు అందుతోందని ఆధారాలతో సహా సంచలన విషయాలు బయటపెట్టారు. ఏ ఖలిస్తానీ శక్తులైతే రాహుల్ గాంధీ గారి నానమ్మను పొట్టనబెట్టుకున్నారో, అదే శక్తులతో రాహుల్ గాంధీ జతకట్టడం సిగ్గుచేటని విమర్శించారు. నీట్ ఎగ్జామినేషన్ లీకేజీ వ్యవహారంపై మాట్లాడిన రాంచందర్ రావు గారు, లీకేజీ విషయం తెలిసిన వెంటనే ఎన్డీయే ప్రభుత్వం తక్షణమే స్పందించి 31 మందిని అరెస్ట్ చేసిందని తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు బాంబు బెదరింపు

**శంషాబాద్, జులై 23, ప్రభాతవార్త :** శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడంతో కలకలం రేపింది. వెంటనే సెక్యూరిటీసిబ్బంది అప్రమత్తమై తనిఖీలు చేపట్టారు.గురువారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో టేకాఫ్ అవుతున్న విమానంలో బాంబు ఉందంటూ గుర్తుతెలియని ఆగంతకుడు మెయిల్ పంపాడు.అప్రమత్తమైన సిఐఎస్ఎఫ్ అధికారులు,బాంబ్ స్క్వాడ్ బృందాలు విమానాశ్రయంలో పరిసరాల్లో తనిఖీలు చేపట్టారు.అయితే ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు అధికారులు చేపట్టారు.అయితే మెయిల్ పంపిన గుర్తు తెలియని వ్యక్తి ఎవ్వరనా దానిపై అధికారులు విచారణ చేపట్టారు.

# జి.ఓ నం.3ని పునరుద్ధరిస్తాం

## గిరిజనుల ప్రయోజనాలు పరిరక్షిస్తాం: మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**విజయవాడ,జూలై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గిరిజన హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా బలమైన చట్టం తీసుకొస్తామని ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. గిరిజన సంఘాల నుంచి వచ్చిన సూచనలు, వినతులను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. గుమ్మిడి సంధ్యారాణి, ఏజెన్సీ ప్రాంత ఎమ్మెల్యేలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ జీవో నంబర్3 పునరుద్ధరణతో పాటు గిరిజనుల రాజ్యాంగబద్ద హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. జీవో నంబర్3కు కూటమి ప్రభుత్వం గానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగానీ ఏనాడూ వ్యతిరేకం కాదని, ఆదివాసీలకు శాశ్వత న్యాయం జరిగేలా చట్టపరంగా బలమైన పరిష్కారం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జీవో3 చరిత్రను వివరిస్తూ.. 1986లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జీవో275 ద్వారా గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. అనంతరం 2000 లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో నంబర్3ను ప్రవేశపెట్టి ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధ్యాయ పోస్టులను 100 శాతం స్థానిక గిరిజనులకే కేటాయించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు.సుప్రీంకోర్టులో జీవో నంబర్ 3 రద్దుకు గత ప్రభుత్వ వైఫల్యమే కారణమని మంత్రి విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవో3 పునరుద్ధరణకు నాటికి నూరు శాతం సానుకూలంగా ఉన్నారని, ఈసారి తీసుకొచ్చే చట్టం కోర్టుల్లోనూ నిలిచేలా అందరూ సహకరించాలని మంత్రి కోరారు. గిరిజనుల భూహక్కులను పరిరక్షించే 1/70 చట్టం ఉందని అది వారి ప్రాథమిక హక్కు అని, దానిని ఏ ప్రభుత్వం కూడా పక్కన పెట్టబోదని మంత్రి స్పష్టం చేశారు. ఈ అంశంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాలను గిరిజనులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.

# ఎండుతున్న పంటలు..కుములుతున్న రైతులు

## ఎల్‌నినోతో తగ్గిన నీటిమట్టం

## ఫసల్ బీమాకు అధికారులు సూచనలు


**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లో గురువారం ఆచార్య ఎన్.జి రంగా యూనివర్సిటి సీనియర్ శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయిలో వరి పంటను పరిశీలించారు. ముందస్తు ఖరీఫ్ సీజన్‌లో శ్రీకాళహస్తి వ్యవసాయడివిజన్లో రైతులు సుమారు 33వేల ఎకరాల్లో వరిపంటను వేసారు. శ్రీకాళహస్తి వ్యవసాయ సబ్‌డివిజన్‌లో రైతులు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ఆదేశాలను ఖాతరు చేయక వరిపంటను పోలో మని సాధారణ విస్తీర్ణంకన్నా అధికంగా పంటలు వేసారు.ఎల్‌నినో ప్రభావంతో పంట పిలక దశ నుంచి పరిపక్వత దశకు చేరుకుంది. ఈ పరిస్థితిలో నీటి కొరతతో చేతికొచ్చిన పంట కళ్ళ ముందే ఎండుతుంటే రైతులు తల్లడిల్లుతున్నారు. అనూహ్యంగా బోర్లలో నీరు అడుగింటడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గొలు పెడుతుండటంతో వ్యవసాయశాఖ సహాయ సంచాలకు రమేష్‌రెడ్డి వారి సహచరులతో అన్ని మండలాల్లో పంటల పరిస్థితిని పరిశీలించారు. నివేదికలు తయారు చేస్తున్నారు. ంరైతులకు అవగాహన కల్పిస్తూ 'పంటల భీమాను' తప్పని సరిగా చేసుకోవాలని ఆగస్టు 15వరకు అవకాశం ఉందని చైతన్య పరుస్తున్నారు.ఈ నేపథ్యంలో బుధవారం ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీకాళహస్తి మండలంలోని కమ్మకొత్తూరు, ఏర్పేడు మండలంలోని దుర్గిపేరి గ్రామాల్లో చేతికొచ్చిన వరి పంట ఎండుతుండటంతో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈసందర్భంగా దిక్కుతోచని స్థితిలో ఉన్న అన్నదాతలు మాట్లాడుతూ తాము ముందస్తుగానే మేనెలలోనే వరి పంటను వేస్తా మన్నారు. జూన్ నెలలో ఊహించని విధంగా ఎండలతో చెరువులు ఎండాయని బోర్ల నీరు అడుగింటి పోయిందని శాస్త్రవేత్తలకు వివరించారు.

**రైతులకు పలు సూచనలు:**

ఎండుతున్న పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు అన్నదాతలకు పలు సూచనలు చేస్తూ విత్తనాలు,పురుగుమందులు, ఎరువులు కొనుగోలు చేయాలన్నా అన్నదాత సుఖీభవ, ఎఎంకిసాన్, ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన స్కీం కింద ఇన్సు రెన్స్ లబ్ది పొందాలన్నా, తప్పని సరిగా ప్రతి ఒక్క రైతు సమీప రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్ర దించాలన్నారు. అంతేకాక ఎల్‌నినో ప్రభావంతో ఎండలుఅధికమై నీరు ఆవిరిగా మారి బోర్లు ఎండిపోయాయన్నారు. ప్రభుత్వం సహాయం అందాలంటే ప్రతి రైతు తమ పంటకు సంబంధించి బీమా చేసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనల్లో సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రమీల, డాక్టర్ సంధ్యారాణి, సహాయ సంచాలకులు ధనంజయరెడ్డి, శ్రీకాళహస్తి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు పి.రమేష్‌రెడ్డితో కలిసి విస్తృతంగా పరిశీలించారు. ఏర్పాట్లను వ్యవసాయాధికారి మమతారెడ్డి, రైతు సేవా కేంద్రం సిబ్బంది తేజస్విని, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం వరి పంటను పరిశీలిస్తున్న ఆచార్య రంగా వర్సిటీ శాస్త్రవేత్తలు



గురువారం న్యూఢిల్లీలో బిజెపి కార్యనిర్వాహక కార్యదర్శి బిఎల్ సంతోష్‌తో జనసేన ఎంపిలు

# బిఎల్ సంతోష్‌ని కలిసిన జనసేన ఎంపీలు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** భారతీయ జనతాపార్టీ ప్రధాన (ప్రచార) కార్యదర్శి బి ఎల్ సంతోష్ ని గురువారం ఢిల్లీలో జనసేన ఎంపీలు లింగమనేని రమేష్ , వల్లభనేని బాల శౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా సంతోష్‌ని జనసేన ఎంపీలు సత్కరించారు. మోడీ నాయకత్వంలో భారత దేశ అభ్యున్నతికి కూటమి పక్షాలన్ని సంఘటితంగా కృషి చేద్దామని సంతోష్ వ్యాఖ్యానించారు.

# విజయవాడ, విశాఖపట్నంలో కేంద్ర జిఎస్‌టిఎటి బెంచ్‌ల ప్రారంభం

**విజయవాడ,జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (జీఎస్‌టీఏటీ) విజయవాడ, విశాఖపట్నం బెంచ్‌లు గురువారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమాన్ని కేంద్ర జీఎస్‌టీఏటీ ఉపాధ్యక్షులు. సభ్యులు (న్యాయ), (ఆంధ్రప్రదేశ్) భాస్కర్ రెడ్డి వేమిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంచ్‌ల ప్రారంభోత్సవం ఒక చారిత్రక మైలురాయి అన్నారు. రెండు బెంచ్‌లలోనూ అప్పీళ్ల విచారణలు ప్రారంభోత్సవం జరిగిన అదే రోజే ప్రారం భమయ్యాయన్నారు. పన్ను చెల్లింపుదారులకు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవం తమైన న్యాయాన్ని అందించడంతోపాటు, కేంద్ర జీఎస్‌టీ అప్పీళ్ల విచారణలో ఏకరూపత, సమర్థతను నిర్ధారించడం పట్ల ట్రిబ్యునల్ నిబద్ధత కలిగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌టీఏటీ (ఆంధ్రప్రదేశ్) సభ్యులు (సాంకేతిక) సతీష్ కుమార్ అగర్వాల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ ఎ.బాబు, స్పెషల్ కమిషనర్ నూతులపాటి సౌమ్య, కమిషనర్ (అప్పీ ల్స్) దేవేష్ గుప్తా, కమిషనర్ (కస్టమ్స్) ఆర్కే రామన్, కమిషనర్ (సీజీ ఎస్‌టీ) అరుణ్ రిచర్డ్, అదనపు కమిషనర్ (కస్టమ్స్) లక్ష్మీ నారాయణ, అదనపు కమిషనర్ (సీజీఎస్‌టీ) జి రాజుయాదవ్, డిప్యూటీ రిజిస్ట్రార్ (జీఎస్‌టీఏటీ ఏపీ) వివిఎస్ కిషోర్ రాయలు,కోర్టుఅధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) వినయ్ కృష్ణ దాసి, కోర్టు అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) సి.హెచ్.ప్రత్యూష, అకౌంట్స్ అధికారి (జీఎస్‌టీఏటీ ఏపీ) శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన ట్యాక్స్ బార్ సీనియర్ సభ్యులు, ట్యాక్స్ నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆఫీస్‌పై దాడిని ఖండిస్తున్నాం

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య

**విజయవాడ.జులై23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంపై బిజెపి మూకల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు ఈశ్వరయ్య నేడు ఒక ప్రకటన విడుదల చేశారు. రాహుల్, ప్రియాంక గాంధీ అరెస్టులకు నిరసనగా జరుగుతున్న కాంగ్రెస్ పార్టీ ర్యాలీపై బిజెపి ఘర్షణకు దిగటం దుర్మార్గం. నరేంద్ర మోడీ దేశ ప్రధానిగా ఒక బాధ్యతాయుత స్థానంలో ఉన్నారనే విషయాన్ని విస్మరించి, కేవలం బిజెపి నేతగానే శ్రేణులు చూడటం అవివేకమన్నారు. బిజెపి దాడుల వెనక రాష్ట్ర ప్రభుత్వం సహకారం ఉండి ఉంటుందన్న పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వత్తాసు లేకుండా ఏపీలో బిజెపి దాడులకు తెగబడే సాహసం చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులు, ఉన్మాద చర్యలు అత్యంత హేయం. దాడికిపాల్పడిన బిజెపి మూకలను తక్షణమే అరెస్ట్ చేయాలని కోరుతున్నామన్నారు.

# నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై తీర్పు రిజర్వ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కేసులో నిందితుడిగా ఉన్న కృష్ణలంక పీఎస్ సస్పెండెడ్ సీఐ నాగరాజు పోలీసు కస్టడీ విచారణపై సుప్రీంకోర్ట్ తీర్పు రిజర్వ్ చేసింది. సిఐడి కస్టడీలో నాగరాజును విచారించేందుకు హైకోర్టు షరతులు విధించింది. హైకోర్టు షరతులను సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ సవాలు చేసింది.జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం సీఐడీ పిటిషన్‌పై విచారణ జరిపింది. ఈ విచారణకోసం నాగరాజును 160కి.మీ. తీసుకొచ్చి మళ్లీపంపించాల్సి ఉంటుందని సీఐడీ స్పష్టం చేసింది.

ఇలా చేస్తే కేసు దర్యాప్తుపై తీవ్ర ప్ర భావం చూపుతుందని సీఐడీ తెలిపింది. ఇరు వర్గాల వాదనల తర్వాత సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# పంపిణీ చేసిన ఇళ్ల పట్టాలు రద్దు చేయండి: హైకోర్టు

**విజయవాడ.జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నాయకుడు పేర్ని నాని, ఆయన కుమారుడు మచిలీపట్నంలో పంపిణీ చేసిన నకిలీ ఇంటి పట్టాలను రద్దు చేయడానికి నాలుగు వారాల్లోగా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. రోడ్లు, శ్మశాన వాటికలు,డ్రైనేజీ, పోరంబోకు వంటి ప్రభుత్వ భూముల్లో పట్టాల అక్రమ పంపిణీకి సం బంధించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉన్న అధికారులపై తీసుకున్న చర్యల గురించి నివేదిక సమర్పించాలని కూడా కోర్టు ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది. మచిలీపట్నంలో ఎన్నికలకు ముందు వైఎస్సార్సీపీ నేత నాని, ఆయన కుమారుడు కిట్టు, వైఎస్సార్సీపీ నాయకులు నకిలీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసినప్పటికీ ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ టీడీపీ నేత ఐ. దిలీప్‌కుమార్ గతేడాది హైకోర్టులో పిల్‌వేశారు. పిటిషనర్ తరఫున న్యాయవాది మల్లవోలు నిఖిత వాదనలు వినిపించారు. నకిలీ పట్టాలు పంపిణీ చేసింది వాస్తవమేనంటూ అధికారులు తేల్చారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం నకిలీ పట్టాల రద్దుకు నాలుగు వారాల్లో చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. పేర్ని నాని తరఫున న్యాయవాది వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. రాజకీయ ప్రయోజనం కోసం ఈ పిల్ దాఖలు చేశారన్నారు. పిటిషనర్‌పై క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ విషయాలను పిల్‌లో దాచి పెట్టారన్నారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వాస్తవాలను గోప్యంగా ఉంచి పిల్ దాఖలు చేసినట్లు తేలితే పిటిషనర్‌కు ఖర్చులు విధిస్తామని స్పష్టం చేసింది.

# ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించిన ఉద్యోగ సంఘాల జెఎసి



గురువారం ఎంఎల్ఏ బొజ్జల సుధీర్ రెడ్డిని కలసి ఉద్యోగ సంఘాల నాయకులు

**శ్రీకాళహస్తి,జులై 23 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండున్నర సం వత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్ర భుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేదని ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతూ రాష్ట్ర జేఏసి నాయకులు ఎంఎల్‌ఏలకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ నేపథ్యంలో గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. రాష్ట్ర జేఏసి పిలుపు మేరకు శ్రీకాళహస్తి నియోజకవర్గ జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ సారథ్యంలో ఉద్యోగులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల బాధలను చెంచురత్నం యాదవ్ వివరించారు. ఉద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారన్నారు.అయితే ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పిఆర్‌సికి సంబంధించి కమిషన్ వేయటంలో చొరవ చూపలేదన్నారు ఇక ఐఆర్ ఇవ్వాల్సి ఉందన్నారు. ఉద్యోగులకు 5డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని సరెండర్ లీవ్‌కు సంబంధించి కూడా అపరిష్కృతంగా ఉందన్నారు.ఈ సమస్యలను ఎంఎల్ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖమంత్రి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు ఉద్యోగులతో సహకరించాలని కోరారు.

జేఏసి నాయకుల అభ్యర్థనను స్వీకరించిన శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందన్నారు.నేడు రాష్ట్ర జేఏసి సంఘ నాయకులు అందించిన వినతి పత్రంలోని డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తామన్నారు. రాబోవు శాసనసభ సమావేశాల్లో ఉద్యోగుల సమస్యలకు సంబంధించి చర్చించి పరిష్కరించేందుకు తన వంతు సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ మేరకు ఉద్యోగ సంఘాల జేఏసి చైర్మెన్ చల్లా చెంచురత్నం యాదవ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేష్,కార్యదర్శి వెంకటముని, శ్రీనివాసులు,బాలు తదితరులు పాల్గొన్నారు.

# గ్లోబల్ లూనార్ మిషన్‌కు ఎపి విద్యార్థిని ఎంపిక

## ధవళేశ్వరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కందుల జెస్సీ

### జెస్సీకి మంత్రి లోకేష్ అభినందన



**విజయవాడ.జూలై23,ప్రభాతవార్తప్రతినిధి:**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అరుదైన అంతర్జాతీయ ఘనతను సొంతం చేసుకుంది. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, ప్రపంచంలోనే మొట్టమొదటి గ్లోబల్ ఆల్‌గర్ల్స్ లూనార్ క్యూబ్‌శాట్ మిషన్ అయిన 'మిషన్ శక్తిశాట్" కు ఎంపికయ్యారు.ఈ విజయంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. జెస్సీని అభినందిస్తూ ఎక్స్(ట్విట్టర్) వేదికగా ప్రశంసలు కురిపించారు. 'విద్యా రంగంపై మేం ఎందుకు ఇంతగా పెట్టుబడి పెడుతున్నామో అప్పుడప్పుడు ఇలాంటి కథలు గుర్తుచేస్తుంటాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రభుత్వ పాఠశాల నుంచి అంతర్జాతీయ అంతరిక్ష మిషన్‌కు ఆమె ప్రయాణం, కలలు కనే ప్రతి యువతకు స్ఫూర్తిదాయకం' అని పేర్కొన్నారు.' జెస్సీ, నువ్వు ఆంధ్రప్రదేశ్ గర్వపడేలా చేశావు. చంద్రుడిని, ఆపై శిఖరాలను అందుకోవాలని ఆశిస్తూ నీకు శుభాకాంక్షలు' అంటూ లోకేశ్ తన పోస్టులో అభినందనలు తెలిపారు. ఈ మిషన్‌లో భాగంగా జెస్సీ శాటిలైట్ రూపకల్పనలో అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో కలిసి పని చేయనున్నారు. ఈ శాటిలైట్‌ను అక్టోబర్ 11న శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ప్రయోగించనున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అంతరిక్ష ప్రయోగంలో భాగస్వామి కావడం రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచింది.

# చెరువు కబ్జా చేసిన భూమన: టిడిపి జెబి శ్రీనివాస్




**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి మొత్తం బతుకు కబ్జాతోనే ప్రారంభమైందని. భూమి లాక్కుని ఇల్లు కట్టావని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి జెబి శ్రీనివాస్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గురూవారం సాయంత్రం తిరు పతిలో మీడియా సమావేశం నిర్వహించారు. తిరుచానూరులో స్వర్ణ ముఖి నది ఒడ్డున భూమిని కబ్జా చేసిన ఘనత భూమనదేనన్నారు. గతంలోనే ఈ విషయం చెప్పాననని, ఇప్పుడు విజిలెన్స్ విచారణతో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారని అన్నారు.కోట గోడలు కట్టి స్వర్ణ ముఖి నదిని పూడ్చి మొత్తం 9 ఎకరాలు ఆక్రమించుకున్నావని ఆరోపించారు. అది మాదే అని మీడియాతో చెబుతు న్నావన్నారు. 24 ఎకరాలు మీదే అయితే. 2024 ఎన్నికల అఫిడవిట్ లో సుమారు 15ఎకరాలు మాత్రమే మీ కుటుంబ పేరుతో పొందుపరిచావని, మిగిలిన 9 ఎకరాలు ఆక్రమించినట్టు ఒప్పుకున్నటేగా అని వ్యాఖ్యలు చేశారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కుమారమ్మ ,అన్నా అనిత, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్,తిరుపతి క్లస్టర్ ఇన్చార్జులు శ్రీధర్ వర్మ,దంపూరి భాస్కర్ యాదవ్,మునిశేఖర్ రాయల్, కృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

# థాయ్‌లాండ్‌లో మెరిసిన పద్మావతి వర్సిటీ విద్యార్థినులు

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళవిశ్వవిద్యాలయంకు చెందిన ఇద్దరు విద్యార్థినులు థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ నాయకత్వ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. బయోటెక్నాలజీ విభాగానికి చెందిన పి. హరిణి సూర్యం, ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విభాగానికి చెందిన జి. శ్రీ సాయి హర్షిత థాయ్‌లాండ్‌లోని ప్రిన్స్ ఆఫ్ సాంగ్‌క్లా యూనివర్సిటీ (పీఎస్‌యూ), పట్టానీ క్యాంపస్ నిర్వహించిన ఐదు రోజుల "లీడర్‌షిప్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్" అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొన్నారు. భారత్, మలేషియా, ఫిలిప్పీన్స్, థాయ్‌లాండ్ దేశాలకు చెందిన విద్యార్థులతో కలిసి వీళ్ళునాయకత్వ లక్షణాలు, బృందంగా పనిచేసే విధానం, భిన్న సంస్కృతుల గురించి అవగాహన పెంపొందించుకున్నారు. అలాగే ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అనుభవాత్మకంగా నేర్చుకున్నారు.

హరిణి సూర్యం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మంచి అవగాహనతో పాటు కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం లభించిందని చెప్పారు. సాయి హర్షిత మాట్లాడుతూ, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి పనిచేయడం వల్ల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, జట్టుగా పనిచేసే సామర్థ్యం, ప్రపంచ దృక్పథం మరింత మెరుగుపడ్డాయని తెలిపారు. విద్యార్థినులను వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమా వెన్నం, రిజిస్ట్రార్ ఆచార్యఆర్. ఉషా, సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డీన్ ఆచార్య పి. విజయలక్ష్మి ్మ అభినందించారు.

# నిరుద్యోగులను మోసగించిన కేసులో ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లకు రిమాండ్

**విజయవాడ,జులై 23,ప్రభాతవార్తప్రతినిధి:** నిరుద్యోగులను మోసం చేసిన కేసులో నిందితులు ముసునూరి సౌజన్య, శ్రీనివాస్‌లను విజయ వాడ న్యాయస్థానం గురువారం రెండు వారాల పాటు రిమాండ్ విధిం చింది. నిందితులను విజయవాడ పోలీసులు హైదరాబాద్‌లో అదు పులోకి తీసుకున్నారు. వారిని విచారించిన తరువాత బుధవారం అధికారికంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రకటించారు.వారిని బుధవారం రాత్రే న్యాయస్థానానికి తరలించారు. అయితే సమయం ముగియడంతో న్యాయమూర్తి ఇంటికి తీసుకెళ్లారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయమూర్తి అందులో మార్పులు చేయాలని దర్యాప్తు అధికారికి సూచించారు. నివేదికలో మార్పులు చేసి గురువారం ఉదయం న్యాయస్థానంలో ప్రవేశపెట్టాలని సూచించడంతో నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.రిమాండ్ రిపోర్టులో మార్పుల అనంతరం నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా వారి న్యాయమూర్తి రిమాండ్ విధించారు. విజయవాడ శివారులోని పెదపులిపాక గ్రామానికి చెందిన ముసునూరి శ్రీనివాస్, సౌజన్యలు భార్యాభర్తలు. సౌజన్య గతంలో పటమట పంటకాలువ రోడ్డులోని ఒక సంస్థలో పని చేసింది. స్టూడెంట్ వీసా ప్రాసెస్ గురించి తెలుసుకుని నిరుద్యోగులను మోసం చేయవచ్చని భావించింది. ఒక పథకం ప్రకారం భర్తతో కలిసి విజయవాడ, విశాఖపట్నం, హైద రాబాద్‌లో ఫ్లైయింగ్ బోర్డర్స్ కన్సల్టెన్సీ కార్యా లయాలను ఏర్పాటు చేసింది. సోషల్ మీడియా, యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగులను ఆకర్షించారు. ఈ నెల 19న అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే షేక్ సలమా అనే యువకుడికి విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మోసం చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను అరెస్టు చేసినట్లు విజయవాడ డీసీపీ గుణ్ణం రామకృష్ణ తెలిపారు.ఇక స్కిల్డ్, సెమీ స్కిల్డ్, అన్ స్కిల్డ్ కేటగిరిల పేరుతో యూరప్ దేశాలైన నెదర్లాండ్స్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, ఫిన్లాండ్‌తదితర దేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వారిని నమ్మించారు. ఒక్కొక్కరి వద్ద రూ. 8 లక్షల నుంచి రూ. 13లక్షల వరకు వసూలు చేశారు. ఇలా విజయవాడలో 700 మంది నుంచి రూ.11 కోట్లు, విశాఖపట్నంలో 130 మంది నుంచి రూ.2.2 కోట్లు వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో దాదాపు 2,400 మంది వీరి కార్యాలయానికి వచ్చినట్లు గుర్తించారు. అక్కడ ఎంత మందిని మోసం చేసింది ఇంకా తెలియరాలేదు. నిరుద్యోగుల నుంచి ప్రాసెసింగ్ రుసుములు వసూలు చేసి, వారికి నకిలీ ఇంటర్వ్యూలు నిర్వహించే వారు. తమ సంస్థ ప్రతినిధులనే విదేశీ కంపెనీ ప్రతినిధులుగా నటింపచేసేవారు. తర్వాత ఇంటర్వ్యూల్లో ఫెయిల్ అయ్యారని అభ్యర్థులకు నకిలీ ఫీడ్‌బ్యాక్ ఇచ్చేవారు. దీనిపై కొంత మంది అనుమానం వ్యక్తం చేయగా వారి చరవాణి నంబర్లను బ్లాక్ చేశారు. ఇలా తెలుగు రాష్ట్రాల్లో అనేక మందిని మోసం చేశారు. మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో ఈ మోసం డొంక కదిలింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగానే అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసు నమోదైంది. దీంతో పోలీసులు నిందితులను గుర్తించి ఆకస్మాత్తుగా దాడి చేసిఅరెస్టు చేశారు. భార్యాభర్తలపై మొత్తం 8 కేసులు నమోదయ్యాయని పోలీసులు వెల్లడిం చారు. 2011లోనే సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక మోసం కేసు నమోదైంది. 2024లో మాచవరం పీఎస్‌లో, 2025లో అన్న మయ్య జిల్లా పీలేరు పోలీస్ స్టేషన్‌లో, 2026లో తెలంగాణ రాష్ట్రంలోని జగిత్యాల మహిళా పీఎస్, బేగంపేట పీఎస్, కామారెడ్డి జిల్లా బిక్నూర్ పీఎస్, విజయవాడ మాచవరం, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన డబ్బులతో కారు లోన్ (రూ.3.3 లక్షలు), రూ.71.45 లక్షల విలువైన బంగారం, రూ.2.25 కోట్ల విలువైన స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా ఏమైనా కొనుగోలు చేశారా అనే దానిపై వాకబు చేస్తున్నారు,



# డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పిహెచ్‌డి ఫెలోషిప్‌ను దక్కించుకున్న విమల

**విజయవాడ.జూలై 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాస్త్రవేత్త విమల బత్తినేని అరుదైన ఘనత సాధించారు. డెన్మార్క్ ప్రతిష్టాత్మక డారా పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను దక్కించుకున్నారు. దీని విలువ సుమారు 25 లక్షల డానిష్ క్రోనార్లు (దాదాపు రూ.3.6 కోట్లు). 2026 సెప్టెంబర్ నుంచి యూనివర్సిటీ ఆఫ్ సదర్న్ డెన్మార్క్‌లో మూడేళ్ల పీహెచ్‌డీ ప్రారంభించనున్నారు. సామాజిక మాధ్యమం లిం క్డిన్‌లో ఈ విషయాన్ని విమల వివరిస్తూ ఈ విజయం వెనుక ఎన్నో తిరస్కరణలు, అనిశ్చితి దాగి ఉన్నాయని చెప్పారు. అనేక పీహెచ్‌డీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని, డారా ఫెలోషిప్‌కు చేసిన తొలి ప్రయత్నం కూడా విఫలమైందని గుర్తు చేశారు. అయితే ప్రతి తిరస్కరణ తనకు కొత్త పాఠం నేర్పిందని పేర్కొన్నారు.విమల 2019 నుంచి 2023 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని రేకులకుంట హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్‌లో శాస్త్రవేత్తగా పనిచేశారు. అనంతరం భర్త ఉద్యోగరీత్యా డెన్మార్క్‌కు వెళ్లడంతో, అక్కడే పరిశోధన రంగంలో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆమె చేపట్టనున్న ఫాబా లూప్ పరిశోధనలో ప్రొటీన్ అధికంగా ఉండే ఫాబా బీన్స్ సాగును విస్తరించడం ద్వారా సోయా దిగుమతులపై డెన్మార్క్ ఆధారపడడాన్ని తగ్గించవచ్చా అనే అంశాన్ని అధ్యయనం చేయనున్నారు.



# అంతర్జాల సదస్సుకు ఆచార్య రాచపాలెం

**తిరుపతి, జులై 23 ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం నిర్వహిస్తున్న అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్యఅతిథిగా కేంద్ర సాహిత్యఅకాడమీ అవార్డుగ్రహీత, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడు సాహితీ విమర్శకులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి హాజరు కానున్నారు. తెలుగు సాహిత్య విమర్శ "నాడు నేడు" అనే అంశంపై ఆయన కీలక ప్రసంగం చేస్తారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంటకు ఈ వెబినార్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. "నెలనెలా తెలుగు వెన్నెల" పేరుతో ఉత్తర టెక్సాస్ తెలుగు సంఘం "సాహిత్య వేదిక" వెబినార్ సదస్సును నిర్వహిస్తోంది. ఈనెల 26వ తేదీ జరిగే 228 వ అంతర్జాల సాహిత్య సదస్సుకు ముఖ్య అతిథిగా ఆచార్య రాచపాలెంను ఆహ్వానించినట్లు సంఘం అధ్యక్షులు మాధవి లోకిరెడ్డి, సమన్వయకర్త దయాకర్ మాడ వెల్లడించారు. మాతృభాషను అభిమానించి, తెలుగు సాహిత్యాన్ని ఆస్వాదించాలని వారు కోరారు.

# ఆరోగ్యానికి ఉల్లికాడ

వంటకు రుచిని అందించే ఉల్లికాడలు ఆరోగ్యాన్నీ పరిరక్షిస్తాయి. యాంటీ ఆక్సిడెంట్లు సహా పలుపోషకాలు మెండుగా ఉండే వీటివల్ల కలిగే మరిన్ని ప్రయోజనాలను తెలుసుకుందాం..



◆ రోజూ వంటల్లో ఈ కాడలను ఉపయోగించడం మంచిది. వీటిలోని విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్లు మన శరీరంలో వ్యాధినిరోధక శక్తిని పెంచి సీజన్లలో వచ్చే అనారోగ్యాలను దరికి చేరనివ్వవు. అలాగే వీటిలోని యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్ లక్షణాలు ఇన్ఫెక్షన్లకు గురి కాకుండా పరిరక్షిస్తాయి. దగ్గు, జ్వరం ఉన్నప్పుడు ఈ కాడలతో చేసే సూప్ ఉపశమనాన్ని అందిస్తుంది. ◆ మెనోపాజ్ తర్వాత కాల్షియం లోపించడంతో ఎముకలు బలహీనపడతాయి. ఈ సమస్యను అధిగమించాలంటే తరచూ ఉల్లికాడలను ఆహారంలో చేర్చుకోవడం మంచిది. వీటిలోని కాల్షియం, కె విటమిన్ ఎముకలను బలంగా ఉంచుతాయి. అలాగే వీటిలోని సి విటమిన్ రక్తపోటు, కొలెస్ట్రాల్‌ను తగ్గించి హృద్రోగాలను దరి చేరనివ్వదు. ◆. ఉల్లికాడల్లోని పీచు జీర్ణశక్తిని మెరుగ్గా ఉంచుతుంది. దీనివల్ల మలబద్ధక సమస్య ఉండదు. అధికబరువుకు దూరంగా ఉండొచ్చు. అలాగే వీటిలోని ఎ,సి,కె విటమిన్లు, కెరోటినాయిడ్స్ కంటి ఆరోగ్యాన్ని మెరుగ్గా ఉంచుతాయి. ◆ వీటిలోని బయోఫ్లావనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ ప్యాంక్రియాటిక్, పేగు కేన్సర్ వంటివి దరి చేరకుండా చేస్తాయి. అధిక ఈస్ట్రోజన్‌ను తొలగించే సామర్థ్యం ఉల్లికాడల్లో ఉంటుంది. ఇవి రొమ్ము కేన్సర్‌ను నిరోధిస్తాయి. ◆ ఈ కాడల్లోని యాంటీఆక్సిడెంట్స్, పొటాషియం చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిలోని అమినోయాసిడ్స్ చర్మకణాల ఉత్పత్తికి దోహదపడతాయి. సాగే గుణాన్ని, తేమని అందిస్తాయి. చర్మాన్ని పొడిబారకుండా ఉంచడంతో వృద్ధాప్య లక్షణాలు త్వరగా దరిచేరవు. ◆ వీటిలోని మెగ్నీషియం కండరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఉల్లికాడల సూప్ తీసుకుంటే కండరాల నొప్పుల నుంచి ఉపశమనాన్ని పొందొచ్చు. అలాగే ఉల్లికాడల్లో పుష్కలంగా ఉండే సల్ఫర్ సమ్మేళనాలు మన శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతాయి. దీనివల్ల మధుమేహ సమస్యకు దూరంగా ఉండొచ్చు. ❑

## వీటితో బోలెడు లాభాలు..

పొయ్యి మీద అన్నం ఉడుకుతోంది. మూత తీయడానికి సమయానికి హోల్డర్ కానీ, బట్ట కానీ లేదు. గాజు సీసా మూత బిగుసుకు పోయింది. ప్రయత్నిస్తుంటే చేతికి జారిపోతుంది. వెల్లుల్లిపై పొట్టు తియాలి. వీటన్నింటికి వేర్వేరు పరికరాలకోసం వెతక్కండి. సలికాన్ ట్రైవెట్స్ సెట్ ఒకటి ఇంట్లో ఉంటే చాలు. ఇవి వంటింట్లో ఎన్నో రకాలుగా ఉపయోగ



పడాయి. వీటిపై ఉండే డిజైన్ తేనెటీగలు పెట్టే హనీకాంబ్‌లా ఉంటుంది. దీంతో వేడిపాత్రల్ని పట్టుకోవచ్చు. ఇవి వేడికి కరగవు. మూతలు తీయడానికి అనుకూలంగా ఉంటాయి. వెల్లుల్లి పొట్టుని వీటితో నలిపి తీయడం తేలిక.



వేర్వేరు రంగుల్లో దొరుకుతాయి కాబట్టి డైనింగ్ టేబుల్‌పైన టీకప్పులు పెట్టుకొనే కోస్టర్లుగా కూడా

# ఆమె సంకల్పానికి సెల్యూట్

**కట్టుకున్నవాడు కళ్లెర్ర చేసాడని కన్నీళ్ల ధారతో బతికేలా నారీమణులెవ్వరూ లేరిక్కడ..**

అది నిరూపించే ఓ నిదర్శనాన్ని చెప్పుకోవాలి. బాల్య వివాహానికి బలైన ఓ అబల జీవితంలో ఓడిపోయానని అనుకోలేదు. తమిళనాడుకు చెందిన



ఎస్.అంబిక 14 యేళ్ల వయసులో ఓ కానిస్టేబుల్‌ని వివాహం చేసుకుంది. అప్పటికి ఎస్ఎస్ఎల్‌సి కూడా చదవలేదు. ఓ రోజున డిఐజి పెరేడ్ కోసం భర్త గ్రౌండ్స్‌కు వెళ్లగా తిరిగొచ్చిన తర్వాత పోలీసు రాజసాలను అడిగి తెలుసుకుంది. అప్పుడే ఆమె మనసులో తొలిసారి బీజం పడింది తానెందుకు 'పోలీసుదొర'నవకూడదని. "కష్టపడతానంటే తాను సహకరిస్తానని" భర్త అనగానే ఎగిరిగంతేసింది. ఒక పక్క పతి, పిల్లల సేవ; మరోపక్క 'ఐపిఎస్' కావాలనే కోర్కె బలీయంగా ఉండడంతో అదే గమ్యానికి చేరుకోవాలనే తపన పడింది. మూడుసార్లు పరీక్ష రాసింది. అయినా ఫలితం లేదు. "ఇక చాల్లే" అన్న భర్త పిలుపుకు మరో ఛాన్స్ చూద్దామని ఒప్పించింది. ఈసారి సాధించింది. 2008లో ఉత్తీర్ణత, ఆపై ప్రభుత్వ ట్రైనింగ్ పూర్తి చేసి ముంబై నార్త్ జోన్ డిసిపిగా ఉద్యోగ బాధ్యతలు తీసుకుంది. అంచెలంచెలుగా ఎదిగింది. "సాధించాలనే తపన ఉంటే తప్పక సాధించగలమనే" దానికి అంబిక ఉద్యోగపర్వం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి కలిగిస్తుంది. అంతగా ప్రోత్సహించిన పతిదేవుడుండడం అదృష్టమే మరి. ❑

## లక్ష్మీదేవి అనుగ్రహం

జీవితంలో ఆర్థికపరమైన సమస్యలు నిరాశా నిస్పృహలను కలిగిస్తూ ఉంటాయి. అవసరాలకి సరిపోయేంత సంపాదన ఉన్నప్పటికీ, ఏదో ఒక ఆపదో .. అనారోగ్యమో వచ్చి అది ఖర్చు అవుతూ ఉంటుంది. ఆత్మాభిమానం పక్కన పెట్టేసి .. ఎవరినో ఒకరిని అప్పు అడగవలసి వస్తూ ఉంటుంది. లక్ష్మీదేవి అనుగ్రహం తమ యందు లేదని అప్పుడే అనుకోవడం జరుగుతూ ఉంటుంది. అమ్మవారి అనుగ్రహం కావాలంటే ఆ తల్లికి నచ్చేలా నడచుకోవలసి ఉంటుంది. ఇంట్లోని వారంతా ఉదయాన్నే నిద్రలేచి .. స్నానం చేసి పూజా మందిరంలో దీపారాధన చేయాలి. పూజా మందిరాన్ని పూలతో అలంకరించి ఆరాధన చేయాలి. ఆరోగ్యంగా వున్న వాళ్లంతా బద్ధకాన్ని వదిలిపెట్టి శ్రమించవలసి ఉంటుంది. ఇక ఇంట్లోని వాళ్లంతా కూడా ఎలాంటి గొడవలు పెట్టుకోకుండా ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ఏ ఇల్లయితే పరిశుభ్రంగా .. మంగళ ప్రదంగా .. ప్రశాంతంగా ఉంటుందో, అక్కడ అమ్మవారు ఉండటానికి ఇష్టపడుతుంది. అహం భావాన్ని వదిలేసి .. 



అందరిపట్ల ఆత్మీయ భావనతో ఎవరైతే వుంటారో అలాంటివారి పట్ల అమ్మవారి అనుగ్రహం ఉంటుంది.

# జుట్టు రకాన్ని బట్టే తలస్నానం !



తలస్నానం చేసే విషయంలో అందరూ ఒకే పద్ధతిని అనుసరిస్తుంటారు. ఈ క్రమంలో కొందరు రెండు, మూడు రోజులకోసారి తలస్నానం చేస్తే.. మరికొందరు వారానికోసారి మాత్రమే తలస్నానం చేస్తుంటారు. కానీ.. జుట్టు రకాన్ని బట్టి తలస్నానం చేసే విషయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలి ఫలితంగా కుదుళ్లు బలహీనపడడం, జుట్టు పొడిబారడం, చిట్లిపోవడం.. వంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చని వారు సూచిస్తున్నారు. మరి, జుట్టు రకాన్ని బట్టి తలస్నానం చేసే విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? తెలుసుకుందాం. ..

**సెమీ కర్లీ హెయిర్ ..** సెమీ కర్లీ హెయిర్ ఉన్న వారు వారంలో రెండు లేదా మూడుసార్లు తలస్నానం చేయాలంటున్నారు సౌందర్య నిపుణులు. ఒక వేళ మీ జుట్టు బాగా ఒత్తుగా ఉన్నట్లయితే వారానికి రెండుసార్లు చేసినా సరి పోతుంది. అయితే ఈ క్రమంలో నూనె ఆధారిత షాంపూలను ఎంచుకోకపోవడమే మంచిది.

**కర్లీ హెయిర్...** కర్లీ ఎయిర్.. ఇలాంటి జుట్టు కావాలని ప్రతి ఒక్క అమ్మాయీ కోరుకుంటుంది. అందుకు కారణాలూ లేకపోలేదు. కర్లీ హెయిర్ ఉంటే జుట్టు కాస్త పలుచగా ఉన్నప్పటికీ.. ఒత్తుగా ఉన్నట్లు కనిపిస్తుంది. అంతేకాదు.. ఇలాంటి కురులు అలల్లా ఎగురుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదంతా బాగానే ఉంది కానీ ఉంగరాల జుట్టున్న వారికి ఎదురయ్యే సమస్యల్లా.. జుట్టు త్వరగా పొడిబారి పోవడమే..కాబట్టి గాఢత తక్కువగా ఉండే షాంపూతో వారానికి ఒకటి లేదా రెండుసార్లు మాత్రమే తలస్నానం చేయడం మంచిది. అలాగే కురులు తేమను కోల్పోకుండా పట్టులా ఉండాలంటే తల స్నానం చేసే గంట లేదా రెండుగంటల ముందు జుట్టు కుదుళ్ల నుంచి చివర్ల వరకు నూనెతో మసాజ్ చేసుకోవాలి.

**పొడి జుట్టా? ..** పొడిబారిన జుట్టు ఉన్న వారి సమస్యలు అన్నీ ఇన్నీ కావు. ఇలాంటి జుట్టున్న వారు తమ కేశాలకు రంగు వేసుకున్నా, హెయిర్ డ్రయర్స్ వాడినా జుట్టు గడ్డిలా మారడం, కుదుళ్లలో దురద, అలర్జీలు రావడం.. వంటి సమస్యలు తలెత్తుతాయి. **నిర్జీవమైపోవడం..** వంటి సమస్యలూ ఎదురవుతుంటాయి. అయితే ఈ సమస్యలన్నింటికీ చెక్ పెట్టాలంటే సహజమైన షాంపూలను ఎంచుకోక తప్పదు. వీటిలో హానికారక రసాయనాలు ఉండవు కాబట్టి జుట్టుకు ఎలాంటి డ్యామేజ్ అయ్యే అవ కాశమే ఉండదు. అలాగే పొడి జుట్టు ఉన్న వారు వారానికి రెండు సార్లు తలస్నానం చేయడం,

**ఆయిలీ హెయిర్...** కుదుళ్లలో ఉండే నూనె గ్రంథులు అధికంగా నూనెలను ఉత్పత్తి చేయడం వల్ల కుదుళ్లు, జుట్టు జిడ్డుగా మారతాయి. ఫలితంగా చుండ్రు, దురద సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఆయిలీ హెయిర్ ఉన్న వారు రోజు విడిచి రోజు తలస్నానం చేయక తప్పదు. అలాగే నూనె ఆధారిత షాంపూలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. కండిషనర్‌ను కూడా జుట్టు చివర్లకు మాత్రమే రాసుకోవాలి. తద్వారా కుదుల్లలో అధిక నూనె ఉత్పత్తి కాకుండా నియంత్రించవచ్చు. ❑

## సొరకాయ బర్ఫీ



**కావలసిన పదార్థాలు:** సొరకాయ ఒకటి (చిన్నది, లేతది), చక్కెర: ఒక కప్పు, కండెన్స్‌డ్ మిల్క్: అర కప్పు, చిక్కటి పాలు: అర కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, నెయ్యి: అరకప్పు, గ్రీన్‌ఫుడ్ కలర్: చిటికెడు, తరిగిన బాదం పప్పు: పావు కప్పు.

**తయారీ విధానం :** సొరకాయ తొక్క, లోపల గుజ్జు కూడా తీసేసి సన్నగా తురమాలి. సొరకాయ తురుమును పల్చని గుడ్డలో వేసి, నీరు పోయేలా గట్టిగా తిప్పాలి. స్టవ్‌మీద కడాయి పెట్టి పావు కప్పు నెయ్యివేసి వేడయ్యాక.. సొరకాయ తురుము వేసి, సన్నని మంటపై మూతపెట్టకుండా వేయించాలి. బాగా వేగిన తురుములో చక్కెర, కండెన్స్‌డ్ మిల్క్, పాలు, యాలకులపొడి వేసి దగ్గరపడేవరకు కలుపుతూ ఉడికించాలి. మిశ్రమం దగ్గరపడ్డాక గ్రీన్ ఫుడ్ కలర్, బాదం తరుగు, మిగిలిన నెయ్యి వేసి బాగా కలిపి నెయ్యి రాసిన ప్లేట్లో పరచాలి. చల్లారిన తర్వాత ముక్కల్లా కోసుకుంటే నోరూరించే సొరకాయ బర్ఫీ సిద్ధం. ❑

# 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఫైనల్ ట్రైలర్ విడుదల



మార్వెల్ స్టూడియోస్ తెరకెక్కించిన 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' సినిమా ఫైనల్ ట్రైలర్ విడుదలైంది. టామ్ హాలండ్ స్పైడర్‌మ్యాన్‌గా నటిస్తున్న నాలుగో సోలో సినిమా ఇది. ఈ చిత్రం జూలై 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ట్రైలర్‌లో 'స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్' తర్వాత జరిగిన సంఘటనలను చూపిం చారు. అందరి జ్ఞాపకాల నుంచి పీటర్ పార్కర్ పూర్తిగా మాయమైన తర్వాత అతను ఒంటరిగా ఎలా జీవిస్తున్నాడో చూపించారు. అలాగే తన ప్రేమికురాలు ఎంజే (జెండయా)తో గడిపిన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యే సన్నివేశాలు ట్రైలర్‌లో ఉన్నాయి. దీంతో ఈ సినిమా ఎమోషనల్‌గా ఉండబోతుందనే విషయం మరోసారి స్పష్టమైంది. అలాగే ఈ ట్రైలర్‌లో మార్క్ రఫాలో హల్క్ పాత్రలో కనిపించనున్నట్లు కూడా అధికారికంగా చూపిం చారు. దీంతో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో మరో ఆసక్తికరమైన అధ్యాయానికి ఈ సినిమా నాంది పలకనుంది. ఈ చిత్రానికి డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వం వహించారు. క్రిస్ మెకెన్నా, ఎరిక్ సోమర్స్, జస్టిన్ కురిట్జ్‌కెస్ కథను అందించగా కెవిన్ ఫైగీ, ఏమీ పాస్కల్, అవి ఆరాడ్, రాచెల్ ఓకానర్ నిర్మాతలుగా వ్యవహరించారు. ఈ సినిమాలో టామ్ హాలండ్, జెండయా, సేడీ సింక్, జేకబ్ బటాలన్, జాన్ బెర్నాల్, ట్రామెల్ టిల్మన్, మైకేల్ మాండో, మార్క్ రఫాలో కీలక పాత్రల్లో నటించారు. 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' జూలై 30న ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో విడుదల కానుంది.

తెర

## 'మారెమ్మ' సెప్టెంబర్ 10న గ్రాండ్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ సోదరుడి తనయుడు, నటుడు రఘు కుమారుడు మాధవ్ విలేజ్ యాక్షన్‌డ్రామా 'మారెమ్మ'తో హీరోగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్ర నిర్మాతలు సినిమా థియేట్రికల్ రిలీజ్ డేట్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 10, 2026న థియేటర్లలో విడుదల కానుందని ప్రకటిం చారు. కొత్తగా విడుదలైన పోస్టర్‌లో మాధవ్ యుద్ధంలో పోరాడి వచ్చినట్టుగా ఇంటెన్స్ అవతార్‌లో ఆకట్టుకుం టున్నారు. ఈ పోస్టర్‌లో ఆయన పాత్రలోని రా ఇంటెన్సిటీతో పాటు భావోద్వేగాలను బలంగా చూపించారు. హీరోకు, పవిత్రమైన ఆవుకు మధ్య కనిపించే పేస్ ఆఫ్, ఈ సినిమా కథా నేపథ్యాన్ని ఆసక్తికరంగా ప్రజెంట్ చేస్తోంది. మారెమ్మ చిత్రంతో మంచాల నాగరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతుండగా, మోక్ష ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తోంది. మయూర్ రెడ్డి బండారు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్, టీజర్, పాటలు, ఇటీవల విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌తో గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడంలో మేకర్స్ విజయవంతమయ్యారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కు తున్న 'మారెమ్మ' స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు, బలమైన భావోద్వేగాలతో మేళవించిన యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. మాధవ్ తన నటనకు పూర్తి స్థాయిలో అవకాశం ఉన్న పాత్రలో, యాక్షన్‌తో పాటు హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలను ఆవిష్క రించనున్నారు. ఈ చిత్రంలో దీపా బాలు కథా నాయికగా నటిస్తున్నారు. ప్రశాంత్ ఆర్. విహారి సంగీతం అందిస్తుండగా, ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీ, దేవ్ రాథోడ్ ఎడిటింగ్, రాజ్‌కుమార్ మురుగేసన్ ఆర్ట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

# నేడు 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రం విడుదల



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫోటో', 'బేబి') వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కేఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్ లో రూపొందు తున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలోడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. నటుడు నరేష్ మాట్లాడుతూ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్ చేస్తున్నాను. ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన డైరెక్టర్ రవి కి థ్యాంక్స్. హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ మాట్లాడుతూ నా కెరీర్ బిగినింగ్ లోనే ఇలాంటి మంచి క్యారెక్టర్ దక్కడం సంతోషంగా ఉంది. హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ శిల్పకళావేదికలో మెగాస్టార్, పవర్ స్టార్ సినిమాల ఎన్ని ఈవెంట్స్ చూసి ఉంటాం. ఎక్కడో మా ఊర్లో ఉండి టీవీలో మెగాస్టార్ సినిమా ఈవెంట్స్ చూసేవాడిని. ఇప్పుడు నేను హీరోగా నటించిన సినిమా ఈవెంట్ కు మెగాస్టార్ చిరంజీవిఅతిథిగా రావడం నా జీవితంలో మర్చిపోలేని సందర్భం.మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ టైటిల్ వినగానే నాకు చెన్నైతో ఉన్న అనుబంధం, ప్రేమ గుర్తుకువచ్చాయి. ఆ రోజుల్లో చెన్నై నగరానికి వెళ్లినప్పుడు అక్కడి స్టూడియోలు చూసినప్పుడు ఇక్కడ కదా మన ఆశలు నెరవేరేది అనిపించేది. ఈ స్టూడియోల్లో కదా మనం నటుడిగా పేరు తెచ్చుకుని నిలదొక్కుకోవాలి అనే ఆశ కలిగేది. అదే చెన్నై రోడ్ల మీద అవకాశాల కోసం తిరిగాం. అదే రోడ్ల మీద స్టార్స్ స్టేటస్ లో కార్లలో తిరిగాం. ఆ రోజులన్నీ చెన్నై లవ్ స్టోరీ టైటిల్ అనగానే మదిలో మెదిలాయి. ఈ టైటిల్ ఆ మ్యాజిక్ ఉంది. ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని మాట్లాడుతూ చెన్నై లవ్ స్టోరీ ఈవెంట్ కు గెస్ట్ గా వచ్చిన మెగాస్టార్ చిరంజీవికి థ్యాంక్స్. ఈ సినిమా గ్లింప్స్ చూసినప్పటి నుంచే ఇది సూపర్ హిట్ అనే నమ్మకం కలిగింది. ప్రొడ్యూసర్, స్టోరీ రైటర్ సాయి రాజేష్ మాట్లాడుతూ జులై 24 శుక్రవారం విడుదల కానున్న చెన్నై లవ్ స్టోరీ సినిమా ప్రేక్షకులను కన్నువిందు చేయనుందని బంపర్‌హిట్ కానుందని ఆశభావం వక్తం చేశారు.



## 'రోమాంచకం' 'రాధా రమణ' పాట రిలీజ్

సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీబ్లాక్ బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా "రోమాంచకం". సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన "రోమాంచకం" సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ ఆడియెన్స్ ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటున్నాయి. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "రోమాంచకం" సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'రాధా రమణ' రిలీజ్ చేశారు. ఈ పాటకు ప్రముఖ గీత రచయిత చంద్రబోస్ అందమైన సాహిత్యాన్ని అందించగా... మ్యూజిక్ డైరెక్టర్ వాసుకి వైభవ్ మెమొరబుల్ ట్యూన్ తో కంపోజ్ చేసి శ్రావ్యంగా పాడారు. హీరో హీరోయిన్స్ మధ్య బ్యూటిఫుల్ పొయెటిక్ రొమాంటిక్ మేకింగ్ తో ఈ పాటను చిత్రీకరించారు. 'రాధా రమణ' పాట ఎలా ఉందో చూస్తే రాధా రమణ రాగాలు మనసున మోగే వేళలో..ఏదో తపన తాగేసి వయసులు ఊగే వేళలో..ఓ కన్నా నీ అందమే. .అలలై అలలై ముంచే, కన్నుల్లో అందుకే కలలే కథలే పెంచే, ఆవేశమే తెరచాటుగా లాగగా, బిడియాల ఆదేశమే పొరపాటనీ ఆపగా, ఈ ఊగిసలో, ఊయలలో, ఉందనా లేదనా..అని సాగుతూ ఈ పాట ఆకట్టుకుం టోంది. "రోమాంచకం" సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు తెరపైకి రాబోతోంది. ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా సెప్టెంబర్ 3వ తేదీ నుంచి ప్రేక్షకుల్ని థియేటర్స్ లో ఎంగేజ్ చేయబోతోంది మూవీ.

## 'రంభ ఊర్వశి మేనక' 'నా కంటి మీద కునుకే' రిలీజ్



గత కొన్నేళ్లుగా విభిన్న పాత్రలు, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలతో ప్రేక్షకులను అలరించిన అల్లరి నరేష్, ఇప్పుడు తన మార్క్ కామెడీ జోనర్ 'రంభ ఊర్వశి మేనక'తో సిద్ధమయ్యారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో తెరకెక్కు తున్న ఈ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌ను అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. Comedy Goes Cosmic అనే ట్యాగ్‌లైన్‌తో రూపొందు తున్న ఈ సినిమా అల్లరి నరేష్ మార్క్ వినోదంతో మేళవించిన వినూత్న కథగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా మ్యూజికల్ జర్నీకి శ్రీకారం చుడుతూ మేకర్స్ తొలి పాట 'నా కంటి మీద కునుకే'ను విడుదల చేశారు. అల్లరి నరేష్, సురభిపై చిత్రీకరించిన ఈ పాట సినిమాలోని రొమాంటిక్ కోణాన్ని పరిచయం చేస్తూనే, గ్రామీణ నేపథ్యంలో సాగే కథకు అందమైన అనుభూతిని అందిస్తోంది. పచ్చని పల్లె అందాల నడుమ తెరకెక్కిన ఈ పాటలో, తన కలల రాణిపై మనసుపడిన యువకుడు తన ప్రేమను, అభిమానాన్ని అందంగా ప్రజెంట్ చేశారు. అల్లరి నరేష్, సురభి మధ్య కనిపించే సహజమైన కెమిస్ట్రీ ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సంగీత దర్శకుడు చైతన్ భరద్వాజ్ గ్రామీణ సంగీతపు మాధుర్యాన్ని మోడరన్ ఆర్కెస్ట్రేషన్‌తో మేళవిస్తూ హాయిగా సాగే మెలోడీని అందించారు. భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం ప్రేమలోని మధురమైన భావాలను అందంగా ఆవిష్కరించగా, ధనుంజయ్ సీపాన తన వోకల్స్‌తో పాటకు మరింత భావోద్వేగాన్ని తీసుకొచ్చారు. జిత్తు మాస్టర్ అందించిన కోరియోగ్రఫీ, అందమైన లొకేషన్స్‌తో కలిసి కనుల విందుగా వుంది. ఈ చిత్రంలో వెన్నెల కిశోర్, వీకే నరేష్, శ్రీనివాస్‌రెడ్డి, మురళీధర్‌గౌడ్ తదితర ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## 'సమ్మర్ హాలిడేస్'లో 'సహజ నటి' జయసుధ

కథా బలమున్న చిత్రాలను ప్రేక్షకులకు అందిస్తూ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్‌గా, డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు ధీరజ్ మొగిలినేని. ఆయన తన ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై 'సమ్మర్ హాలిడేస్' అనే చిల్డ్రన్ మూవీని త్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాను మన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసే ఒక అందమైన కథతో దర్శకుడు శ్రీకర్ రూపొందిస్తు న్నారు. ఈ చిత్రంలో మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, బేబి ఖుషి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. త్వరలోనే "సమ్మర్ హాలిడేస్" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి సహజ నటి జయసుధ క్యారెక్టర్ పోస్టర్ రిలీజ్ చేశారు. "సమ్మర్ హాలిడేస్" సినిమాలో అమ్మమ్మ సుశీలమ్మ పాత్రలో జయసుధ ఆకట్టుకోనున్నారు. ప్రేమానురాగాలు పంచే అమ్మమ్మ సుశీలమ్మ పాత్ర ప్రేక్షకుల మనసుకి హత్తుకోనుంది.



## ప్రపంచ జూ. స్క్వాష్ క్వార్టర్ ఫైనల్‌కు అనాహత్



**న్యూఢిల్లీ:** ప్రపంచ స్క్వాష్ జూనియర్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్‌ల మహిళల క్వార్టర్ ఫైనల్స్‌కు అనాహత్ సింగ్ చేరుకుంది. టాప్ సీడెడ్ భారత క్రీడాకారిణి అనాహత్ సింగ్ మలేషియాకు చెందిన డోయ్స్ యే సాన్ లీని సునాయాసంగా ఓడించింది. గత ఏడాది కాంస్య పతక విజేత అయిన అనాహత్, ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో తన 13/16వ సీడ్ ప్రత్యర్థిని 11-4, 11-8, 11-3 తేడాతో ఓడించి, తదుపరి ఈజిప్టుకు చెందిన 5/8వ సీడ్ హబీబా రిజ్క్‌తో తలపడనుంది. మహిళల విభాగంలో, ఈజిప్ట్‌కు చెందిన హబీబా రిజ్క్ నాలుగు గేమ్‌ల పోరులో అమెరికాకు చెందిన షార్లెట్ స్జెను ఓడించగా, బెల్జియంకు చెందిన సవన్నా మోక్సామ్ వెనుకబడి ఉన్నప్పటికీ పుంజుకుని హాంకాంగ్, చైనాకు చెందిన ఎనా క్వాంగ్‌ను 3-1 తేడాతో ఓడించింది. మరో జిప్సీ క్రీడాకారిణి మాలికా ఎల్కరక్సీ, అమెరికాకు చెందిన దియా యాదవ్‌పై విజయంతో తదుపరి రౌండ్‌లోకి ప్రవేశించగా, నంబర్ 1 సీడ్ మొహమద్ జకారియా పాకిస్థాన్‌కు చెందిన నౌమాన్ ఖాన్‌పై గెలిచి ముందంజ వేశాడు. ఫ్రాన్స్‌కు చెందిన అమీర్ ఖలీద్‌జౌస్సెలిన్, ఇంగ్లాండ్‌కు చెందిన రోనీ హిక్లింగ్‌పై వరుస గేమ్‌లలో విజయం సాధించగా, హాంకాంగ్, చైనాకు చెందిన హెలెన్ టాంగ్, మలేషియాకు చెందిన హార్లీన్ టాన్‌పై విజయంతో ముందంజ వేసింది. పురుషుల విభాగంలో, టాప్‌ఎనిమిది సీడ్‌లకు సంబంధించి అనేక అనూహ్య ఫలితాలు నమోదయ్యాయి. భారత ఆటగాడు ఆర్యవీర్ దీవాన్ (5/8) అమెరికాకు చెంఇన యాసీన్ షాలాబీ చేతిలో వరుస గేములలో ఓడిపోయాడు. ప్రస్తుత ఆసియా అండర్ 19 ఛాంపియన్ అయిన అతను అమెరికా ప్లేయర్ చేతిలో 4-11, 1-11, 5-11 తేడాతో పరాజయ పాలయ్యాడు.

## చైనా ఓపెన్‌లో సింధు ఓటమి

### ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ నిష్క్రమణ



**న్యూఢిల్లీ:** చైనా ఓపెన్ 2026, రౌండ్ ఆఫ్ 16లో చెన్ యుఫెయ్ చేతిలో భారత్ షట్లరున పీవీ సింధు ఓటమి పాలవ్వగా, ఆయుష్ శెట్టి, లక్ష్య సేన్ పరాజయం పాలై టోర్నీ నుండి నిష్క్రమించారు. చైనాకు చెందిన చెన్ యుఫెయ్ గురువారం భారత క్రీడాకారిణి పివి సింధును 16-21, 22-20, 21-18 తేడాతో ఓడించి, చైనా ఓపెన్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లోకి ప్రవేశించింది. రెండో గేమ్‌లో సింధుకు నాలుగు మ్యాచ్ పాయింట్లు లభించినప్పటికీ, చెన్ పుంజుకుని మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, భారత షట్లర్ ఆరంభంలో ఆధిక్యంలో ఉన్నప్పటికీ, చివరి దశలో చెన్ దూసుకువచ్చి టైను ముగించింది. ఇక భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టి ప్రస్థానం కూడా చివరి 16 రౌండ్‌లో ముగిసింది. అతను ఒక గేమ్ ఆధిక్యాన్ని కోల్పోయి ఐర్లాండ్‌కు చెందిన న్హాట్ గుయెన్ చేతిలో 21-15, 13-21, 20-22 తేడాతో ఓడిపోయాడు. ప్రపంచ 28వ ర్యాంకర్ శెట్టి, రెండో గేమ్ ఓడిపోయిన తర్వాత కోలుకుని, నిర్ణయాత్మక సెట్‌లో 19-15 ఆధిక్యం సాధించినప్పటికీ, తన ప్రత్యర్థిని ఆ స్థితి నుండి తొలగించలేకపోయాడు. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష్య సేన్ 19-21, 11-21 తేడాతో ఓడిపోవడంతో, చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది. కెనడాకు చెందిన విక్టర్ లాయ్ చేతిలో లక్ష ్య సేన్ 1921, 1121 తేడాతో ఓడిపోవడంతో, ఆ రోజు చివర్లో టోర్నమెంట్‌లో భారత్ పోరాటానికి తెరపడింది.

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ ఖరారు

### జూన్ 9న నుండి 13 వరకు




ఆట

**న్యూఢిల్లీ:** ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ 2027లో జరగనుంది. దీనికి సంబంధించి ఫైనల్ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ఫైనల్ లండన్‌లోని ఓవల్ స్టేడియంలో జరుగుతుంది. ఫైనల్ జూన్ 9న ప్రారంభమై జూన్ 13 వరకు కొనసాగుతుంది. ఈ టోర్నీ 2025లో ప్రారంభమైంది. టెస్ట్ ఛాంపియన్‌షిప్ రెండేళ్ల పాటు కొనసాగుతుంది. ఇందులో 9 జట్లు పాల్గొంటున్నాయి. అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు ఫైనల్ కు చేరుకుంటాయి. 2027 తర్వాత 2029, 2031 టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ల ఫైనల్స్ ఇంగ్లాండ్‌లో జరుగుతాయని ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది. గత సంవత్సరం జూన్ 17న బంగ్లాదేశ్‌శ్రీలంక మ్యాచ్‌తో టెస్ట్ ఛాంపియన్‌షిప్ సైకిల్ ప్రారంభమైంది. ఆస్ట్రేలియా ప్రస్తుతం 8 మ్యాచ్‌లలో ఏడు విజయాలతో, 87.5 శాతం పాయింట్లతో పట్టికలో అగ్రస్థానంలో ఉంది. డిఫెండింగ్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా 75 శాతం పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. 2023లో భారత్‌ను ఓడించి ఆస్ట్రేలియా టైటిల్ గెలుచుకోగా, 2025లో ఫైనల్‌లో దక్షిణాఫ్రికా చేతిలో ఓడిపోయింది. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలోని భారత జట్టుకు ఈ ఐసీసీ టెస్ట్ ఛాంపియన్‌షిప్ సీజన్ అంతగా కలిసి రాలేదు. ఆ జట్టు తొమ్మిది మ్యాచ్‌లలో కేవలం నాలుగింటిలో మాత్రమే విజయం సాధించింది. గతేడాది ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌ను భారత్ డ్రా చేసుకోగా, వెస్టిండీస్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకుంది. స్వదేశంలో జరిగిన సిరీస్‌లో దక్షిణాఫ్రికా భారత్‌ను క్లీన్ స్వీప్ చేసింది. భారత జట్టు ఇప్పుడు వచ్చే నెలలో శ్రీలంకతో రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడనుంది.

## కామన్వెల్త్ గేమ్స్‌లో మాల్టాపై భారత్ విజయం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026లో మహిళల బౌల్స్ జంటల ప్రారంభ మ్యాచ్‌లో మాల్టాపై భారత్ విజయం సాధించింది. గురువారం జరిగిన మహిళల జంటల విభాగంలో రూపా రాణి టిర్కీ, పింకీ సింగ్, మాల్టాకు చెందిన కోనీ రిక్సన్, రెబెక్కా రిక్సన్‌లను ఓడించడంతో, భారత్ తన కామన్వెల్త్ గేమ్స్ ప్రచారాన్ని విజయంతో ప్రారంభించింది. గ్రూప్ దశ ఆరంభ మ్యాచ్‌లో పోటీపడిన భారత ద్వయం, హోరాహోరీగా సాగిన పోరు అనంతరం టై బ్రేక్‌లో విజయం సాధించింది. పింకీ సింగ్ రాణించడంతో భారత్ ఉత్కంఠభరితమైన తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. భారత్ తొలి అర్ధభాగంలో రెండు పాయింట్లు సాధించి బలమైన ఆరంభాన్ని అందుకుంది. ఆ తర్వాత మాల్టా రెండో అర్ధభాగంలో ఒక పాయింట్‌తో ఆధిక్యాన్ని తగ్గించింది. భారత జంట తొలి సెట్ మిగిలిన భాగమంతా ఆధిపత్యం కొనసాగించి, దానిని 7-1 తేడాతో సునాయాసంగా కైవసం చేసుకుంది. రెండవ సెట్‌లో మాల్టా బలంగా పుంజుకుంది. తొలి ఎండ్‌లో పింకీ సింగ్ అద్భుతమైన ఫైనల్ బౌల్ వేసి భారత్‌కు ఆరంభ ఆధిక్యాన్ని అందించగా, రెండవ ఎండ్‌లో మాల్టా పుంజుకుని స్కోర్లను సమం చేసింది. మూడో ఎండ్‌లో భారత్ మళ్లీ ఆధిక్యం సాధించగా, నాలుగో ఎండ్‌లో మాల్టా స్కోరును సమం చేసింది. ఆ తర్వాత మాల్టా ఐదో ఎండ్‌ను కైవసం చేసుకుని రెండో సెట్‌ను గెలుచుకోవడంతో,



మ్యాచ్ టైబ్రేక్‌కు దారితీసింది. టైబ్రేక్ కూడా అంతే ఉత్కంఠభరితంగా సాగింది. మాల్టా మెరుగైన ఆరంభం చేసినప్పటికీ, పింకీ సింగ్ మరోసారి ఒత్తిడిలో రాణించి, కీలకమైన చివరి బంతితో భారత్ నిర్ణయాత్మక ఎండ్‌ను కైవసం చేసుకుని విజయాన్ని ఖాయం చేసుకోవడంలో సహాయపడింది.



## కామన్వెల్త్‌లో తొలిపతకాన్ని ఖరారు చేసిన బాక్సర్ లవ్లీనా

**న్యూఢిల్లీ:** స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో గురువారం జరిగిన ప్రారంభోత్సవానికి ముందే, మహిళల 75 కేజీల విభాగంలో బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధించడంతో, 2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారతదేశానికి తొలి పతకం ఖరారైంది. 28 ఏళ్ల లవ్లీనా పోటీపడనున్న విభాగంలో కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. ఫలితంగా, ఈ భారత క్రీడాకారిణికి సెమీఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం లభించింది, ఇది ఆమెకు కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేస్తుంది. ఒలింపిక్ కాంస్య పతక విజేత లవ్లినా జూలైలో జరిగే సెమీఫైనల్స్‌లో టువాలుకు చెందిన గిరీతీశి తాఫాకితో తలపడనుంది.

లవ్లినాకు ఇది తొలి కామన్వెల్త్ గేమ్స్ పతకం. 2022లో బర్మింగ్‌హామ్‌లో జరిగిన గత ఎడిషన్‌లో, లోవ్లినా లైట్ మిడిల్‌వెయిట్ కేటగిరీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది, అక్కడ ఆమె వేల్స్‌కు చెందిన రోసీ ఎక్లెస్ చేతిలో ఓడిపోయింది. వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చానుతో పాటు, గురువారం జరిగే ప్రారంభోత్సవానికి లవ్లీనాను భారత పతాకధారిగా ఎంపిక చేశారు.

## మెర్సిడిస్ బెంజ్ కొత్త కారు విడుదల!



**ముంబయి,జులై 23:** లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ ఇండియా, భారత మార్కెట్లో తన ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ పోర్ట్‌ఫోలియోను మరింత బలోపేతం చేసింది. దేశంలోనే తొలి ఎలక్ట్రిఫైడ్ ఏఎమ్‌జీ ఈక్లాస్ సెడాన్ అయిన మెర్సిడెస్‌ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్ 4మేటిక్‌ప్లస్‌ను గురువారం లాంచ్ చేసింది. ఏఎమ్‌జీ బ్రాండ్ అందించే అద్భుతమైన పనితీరుతో పాటు ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ టెక్నాలజీ అందించే ఇంధన సామర్థ్యం ఈ కారు సొంతం. ఈ కొత్త సెడాన్ రెండు వేరియంట్లలో అందుబాటులో ఉంది. పెర్ఫార్మెన్స్ ఎడిషన్ ధర రూ. 1.45 కోట్లు కాగా, రేసింగ్ ఎడిషన్ ధర రూ. 1.48 కోట్లుగా (రెండు ధరలూ ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. పెట్రోల్ ఇంజిన్, ఎలక్ట్రిక్, ప్లగ్‌ఇన్ హైబ్రిడ్ వంటి విభిన్న పవర్‌ట్రెయిన్ ఆప్షన్లను వినియోగదారులకు అందించాలనే తమ వ్యూహంలో భాగంగా ఈ కారును విడుదల చేసినట్లు మెర్సిడెస్‌బెంజ్ పేర్కొంది. ఈ సందర్భంగా మెర్సిడెస్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోశ్ అయ్యర్ మాట్లాడుతూ భారత ఆటోమోటివ్ పరిశ్రమలో ఈక్లాస్ సుదీర్ఘకాలంగా సేవలు అందిస్తున్న మోడల్. కొత్త ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్, అద్భుతమైన పనితీరు, రోజువారీ వినియోగానికి అవసరమైన సౌలభ్యం, ఎలక్ట్రిక్ సామర్థ్యం వంటి అంశాలను ఒకేచోట అందిస్తోంది. రేస్ ట్రాక్ మీద అవసరమైన పెర్ఫార్మెన్స్‌ను, రోజువారీ ప్రయాణాలకు కావాల్సిన ప్రాక్టికాలిటీని ఈ సెడాన్ సమన్వయం చేస్తుందని వివరించారు. మెర్సిడెస్ ఏఎమ్‌జీ ఈ 53 హైబ్రిడ్‌లో 3.0లీటర్ ఇన్‌లైన్ సిక్స్‌సిలిండర్ టర్బోచార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చారు. ఇది 449 హార్స్‌పవర్ శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీనికి ఏఎమ్‌జీ స్పీడ్‌షిఫ్ట్ టీసీటీ 9జీ ట్రాన్స్‌మిషన్‌లో అనుసంధానించిన 120 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌ను జతచేశారు. ఈ రెండూ కలిసి ఏకంగా 585 హెచ్‌పీ (రేస్ స్టార్ట్ ఫంక్షన్‌తో 612 హెచ్‌పీ) శక్తిని, 750 ఎన్ టార్క్‌ను విడుదల చేస్తాయి. ఈ కారు కేవలం 3.8 సెకన్లలో 0 నుంచి 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. దీని గరిష్ఠ వేగాన్ని ఎలక్ట్రానిక్‌గా గంటకు 250 కిలోమీటర్లకు పరిమితం చేశారు.

## నాలుగోరోజూ సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు!

**ముంబయి,జులై 23:** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న భౌగోళిక ఉద్రిక్తతలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం ప్రభావంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా నాలుగో ట్రేడింగ్ సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. రియాల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్,మౌలిక వసతులు (ఇన్‌ఫ్రా), పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది. ఆటో మరియు మీడియా రంగాల షేర్లు మాత్రమే స్వల్ప లాభాలను నమోదు చేశాయి.బీఎస్‌ఈ సెన్సెక్స్ 363.66 పాయింట్లు క్షీణించి 76,391.39 వద్ద ముగియగా, ఎన్ఎస్‌ఈ నిఫ్టీ50 సూచీ 126.65 పాయింట్లు పడిపోయి 23,896.60 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస



ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 2.25 శాతం, నిఫ్టీ 1.90 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ పతనానికి ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్ షేర్లు కారణమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.01 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం క్షీణించాయి. బిఎస్ఇలో మొత్తం 1,637 షేర్లు లాభపడగా, 2,585 షేర్లు నష్టపోయాయి. మరో 181 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్‌లో సెప్టెంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 4.01 డాలర్లు పెరిగి 98.08 డాలర్లకు చేరుకుంది. ముడిచమురు ధరల పెరుగుదలతో పాటు డాలర్ బలపడటంతో రూపాయి బలహీనపడింది. డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 96.5600 వద్ద ట్రేడైంది. అంతకుముందు సెషన్‌లో ఇది 96.5300 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 1%తగ్గి రూ.1,44,222కు చేరుకుంది. త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో పలు కంపెనీల షేర్లలో భారీ కదలికలు నమోదయ్యాయి.ఎటర్నల్ షేరు 0.95 శాతం పెరిగింది.

## ఇన్ఫోసిస్ తొలి త్రైమాసిక లాభం 8.6% తగ్గుదల




**బెంగళూరు,జులై 23:** దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ తొలి త్రైమాసికంలో నికరలాభం 8.6 శాతం తగ్గి రూ.7,769 కోట్లకు చేరింది. గత త్రైమాసికంలో ఇది రూ.8,501 కోట్లుగా నమోదైంది. మార్కెట్ అంచనాలు రూ.7,774 కోట్లుగా ఉన్నాయి. అదే సమయంలో కంపెనీ ఆదాయం మాత్రం పెరుగుదలను నమోదు చేసింది. గత త్రైమాసికంలోని రూ.46,402 కోట్లతో పోలిస్తే 3.9 శాతం పెరిగి రూ.48,211 కోట్లకు చేరుకుంది. వడ్డీ, పన్నుల ముందు లాభం 4.3 శాతం పెరిగి రూ.10,163 కోట్లకు చేరగా, గత త్రైమాసికంలో ఇది రూ.9,743 కోట్లుగా నమోదైంది. కంపెనీ ఎబిడిటా మార్జిన్ 20.99 శాతం నుంచి 21.08 శాతానికి పెరిగి 9 బేసిస్ పాయింట్ల వృద్ధిని నమోదు చేసింది. రాబడులపరంగా 1.5 శాతం నుంచి 3.5 శాతం వృద్ధి ఉంటుందని పేర్కొనగా, తాజా అంచనాలో దానిని 1.5 శాతం నుంచి 3 శాతం మధ్యకు సవరించింది. ఆపరేటింగ్ మార్జిన్ మార్గదర్శకత్వాన్ని మాత్రం 20 నుంచి 22 శాతం వద్ద యథాతథంగా కొనసాగించింది.ఎఐ సేవల ద్వారా బలమైన వృద్ధికంపెనీ సీఈఓ సలిల్ పారేఖ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల్లో అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ కృత్రిమ మేధస్సు ఆధారిత సేవలకు మంచి డిమాండ్ కొనసాగుతోందని తెలిపారు. జూన్ త్రైమాసికంలో స్థిర కరెన్సీ ప్రాతిపదికన కంపెనీ ఆదాయం 1 శాతం పెరిగిందని చెప్పారు. మొత్తం తొలి త్రైమాసిక ఆదాయంలో ఎఐ సేవల వాటా 8.2 శాతంగా నమోదైందని కంపెనీ నాయకత్వ మార్పులో భాగంగా అశిష్ కుమార్ దాస్‌ను 2027 మార్చి 31 వరకు సిఇఒడిజిగ్నేట్‌గా నియమించింది. అనంతరం ఏప్రిల్ నుంచి ఆయన పూర్తి స్థాయి సీఈఓ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉద్యోగులకు రెండు విడతల్లో వేతన పెంపుఇన్ఫోసిస్ సిఎఫవో జయేష్ సంగ్‌రాజ్‌కా మాట్లాడుతూ, ఉద్యోగుల వార్షిక వేతన పెంపును రెండు విడతల్లో అమలు చేయనున్నట్లు తెలిపారు. షేర్ ధత్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు బీఎస్‌ఈలో ఇన్ఫోసిస్ షేరు రూ.1,051.80 వద్ద స్వల్ప నష్టంతో ముగిసింది. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు షేరు ధర 35 శాతానికి పైగా క్షీణించగా గత 12 నెలల్లో సుమారు 33.5 శాతం పడిపోయింది.

## రాబడుల్లో వృద్ధి, తగ్గిన మీషో నష్టాలు!

**ముంబయి,జులై 23:** ఈకామర్స్ సంస్థ మీషో తొలి త్రైమాసికంలో తన పనితీరును మెరుగుపరుచుకుంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే కంపెనీ నికర నష్టం దాదాపు సగానికి తగ్గగా, ఆదాయం భారీగా పెరిగింది. కంపెనీ రూ.132.8 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఈ నష్టం రూ.289.3 కోట్లుగా ఉంది. మరోవైపు, కంపెనీ ఆదాయం 48.3 శాతం పెరిగి రూ.3,713 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,504 కోట్లు.వడ్డీ, పన్నులు, తరుగుదల, అమోర్టైజేషన్‌కు ముందు లాభనష్టం పరంగా కూడా కంపెనీ మెరుగుదల నమోదు చేసింది. ఎబిడిటా నష్టం రూ.264.4 కోట్ల నుంచి రూ.224.7 కోట్లకు తగ్గింది. వ్యాపార విస్తరణలో భాగంగా, తన అనుబంధ సంస్థ మీషో గ్రోసరీస్లో రూ.75 కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. జూన్ త్రైమాసికంలో కంపెనీ నెట్ మెర్చండైజ్ విలువ 34 శాతం పెరిగి రూ.11,614 కోట్లకు చేరుకుంది. మార్కెట్‌ప్లేస్ ఆదాయం 48 శాతం పెరిగి రూ.3,707 కోట్లకు చేరింది. వినియోగదారులు, ఆర్డర్లలో గణనీయమైన పెరుగుదమీషో వార్షిక లావాదేవీలు నిర్వహిస్తున్న వినియోగదారుల సంఖ్య 29 శాతం పెరిగి 27.4 కోట్లకు (274 మిలియన్లు) చేరింది. ఒక్కో వినియోగదారు ఏడాదికి చేసే కొనుగోళ్ల సగటు సంఖ్య 10.3 ట్రాన్సాక్షన్లకు పెరిగింది.అదే విధంగా, కంపెనీకి వచ్చిన మొత్తం ఆర్డర్లు కూడా 29 శాతం పెరిగి 72.5 కోట్లకు (725 మిలియన్లు) చేరాయి.నగదు ప్రవాహంలో మెరుగుదగత 12 నెలల ఫ్రీ క్యాష్ ఫ్లో మైనస్ రూ.633 కోట్ల నుంచి మైనస్ రూ.537 కోట్లకు మెరుగుపడింది. త్రైమాసికంలో షిప్ చేసిన ఆర్డర్లలో సుమారు 37 శాతం ప్రీపెయిడ్ ఆర్డర్లే ఉన్నాయని కంపెనీ వెల్లడించింది.త్రైమాసిక ఫలితాల ప్రకటనకు ముందు ఎన్ఎస్‌ఈలో మీషో షేరు 0.48 శాతం తగ్గి రూ.188.95 వద్ద ముగిసింది. అదే రోజు నిఫ్టీ సూచీ 0.53 శాతం క్షీణించింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో ఇప్పటివరకు మీషో షేరు దాదాపు 5 శాతం లాభపడింది.









Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.